




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


మేమేమీ తక్కువ కాదు

వక్ఫ్ చట్టాన్ని తిప్పికొట్టాలి


లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 299 | ఆదివారం | 20-04-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00


## పెట్టుబడులు పెరగాలి
# పరిశ్రమలు రావాలి




- ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం
- ఐటి, ఫార్మారంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించాం
- రాష్ట్రాభివృద్ధికి అందరి సహకారం అవసరం
- జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

''తెలంగాణలో పెట్టుబడులు పెరగాలి, పరిశ్రమలు పెరగాలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశం. తెలంగాణ అభివృద్ధిలో జపాన్ తెలుగు సమాఖ్య సహా అందరి సహకారం అవసరం. ఎవరికి చేతనైనంత వారు చేయగలిగింది చేస్తే ప్రపంచంతోనే తెలంగాణ పోటీ పడొచ్చు. మీ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం ఏమిటో మీకు తెలుసు'' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తరువాయి 2లో

### సుప్రీంకోర్టు చట్టాలు చేస్తే
## చట్టసభలు మూయాల్సిందే
### బిజెపి ఎంపి నిశికాంత్ దూబే వివాదాస్పద వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు చట్టాలను రూపొందించాల్సి వస్తే పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలను మూసివేయాలని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. . శాసనసభ ఆమోదించిన చట్టాలను కొట్టివేయడం ద్వారా ,తమను నియమించే రాష్ట్రపతికి కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆదేశాలు ఇవ్వడం ద్వారా, పార్లమెంటు శాసన అధికారాలను కోర్టు తన చేతుల్లోకి తీసుకుందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన శనివారం నాడు తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేయడంతో పాటు, పిటిఐతో కూడా మాట్లాడారు. 'సుప్రీం కోర్టే చట్టాలు చేస్తే పార్లమెంటు భవనాన్ని బంద్ చేయాలి' తరువాయి 2లో



## ప్రభుత్వానిది సాహసమే

- పేదింట్లో ఎమ్మెల్యే కూనంనేని సన్న బియ్యం సహపంక్తి భోజనం

ప్రజాపక్షం/పాల్వంచ

సన్న బియ్యం పథకం అమలు ప్రభుత్వానికి సాహసమేనని, పేదల ఆకలిని గుర్తించి పథకం అమలుకు పూనుకోవడం అభినందనీయమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని తరువాయి 2లో


## సన్న బియ్యం పంపిణీపై విపక్షాలు
# అసత్య ప్రచారం





- ఎఫ్‌సిఐ నిబంధనల ప్రకారమే బియ్యంలో 25 శాతం నూకలు
- యాసంగిలో రికార్డు స్థాయి ధాన్యం దిగుబడి
- ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- 57 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ అంశంలో విపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యంలో 25 శాతం నూకలు ఉండడం భారత ఆహార సంస్థ నిబంధనలలో భాగమేనని మంత్రి స్పష్టం చేశారు. విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారం పట్ల అధికార యంత్రాంగం తరువాయి 2లో



# ప్రపంచం

WORLD NEWS

## హౌతీ స్థావరాలపై దాడులు

### 80 మంది మృతి

**సనా :** యెమెన్‌లో హౌతీ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా సేనలు చేసిన దాడుల్లో మృతులసంఖ్య 80కి పెరిగింది. దాడుల్లో గాయపడివారిసంఖ్య 180కు చేరుకుంది. పాలస్తీనాభూభాగంలో ఇజ్రాయెల్ 2023లో యుద్ధం ప్రారంభించినప్పటినుండీ పాలస్తీనాకు సంఘీభావంగా హౌతీ ఉగ్రవాదులు ఎర్ర సముద్రంలో వాణిజ్యనౌకలపై దాడులు ఉధృతం చేశారు. ఈ విధంగా ఇప్పటివరకూ 190 దాడులు చేశారు. దీంతో యెమెన్ కేంద్రంగా పనిచేస్తున్న హౌతీ ఉగ్రవాదస్థావరాలను లక్ష్యంగా చేసుకుని గతనెల 15వ తేదీన అమెరికా సేనలు దాడులు పునఃప్రారంభించాయి. ఈ దాడులు అడపాదడపా కొనసాగుతూనే ఉన్నాయి. గడచిన 48 గంటల్లో జరిగిన అమెరికా దాడుల్లో మృతులసంఖ్య 80కి పెరిగింది. దీంతో హౌతీలు కూడా ఇజ్రాయెల్, అమెరికా లక్ష్యంగా దాడులు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కాగా హౌతీల దాడులకు ఉపయోగపడే ఇంధనవనరులు, ఆదాయ వనరులను అందుబాటులో లేకుండా చేయడంకోసమే దాడులు చేస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం పేర్కొంది.

## అవాస్తవిక డిమాండ్లు చేస్తే అణు ఒప్పందం జరగదు

### తెగేసి చెప్పిన ఇరాన్ విదేశాంగమంత్రి



**రోమ్ :** బెదిరింపులు, మిశ్రమ స్పందనలమధ్య ఇటలీ దేశ రాజధాని రోమ్ కేంద్రంగా శనివారంనాడు ఇరాన్–అమెరికా మధ్య రెండో విడత పరోక్షస్థాయి అణుచర్చలు జరిగాయి. ండో విడత చర్చలు కూడా ఒమన్‌దేశ మధ్యవర్తుల ద్వారా జరిగాయి. ఈ చర్చలకు సంబంధించిన ఫలితాల పూర్తిసమాచారం, వివరాలు ఇంకా బయటకు రానప్పటికీ, ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘీ అనేక ముందస్తు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికా స్పందనను బట్టే తమ తుది నిర్ణయం ఉంటుందని ఆయన తెగేసి చెబుతున్నారు. అవాస్తవికమైన డిమాండ్లు, ఆచరణసాధ్యంకాని డిమాండ్లు చేస్తే ఈ ఒప్పందం కుదిరే అవకాశాలు లేవని అబ్బాస్ అఘారీ చెప్పారు. ఆచరణసాధ్యంకాని డిమాండ్లకు అమెరికా దూరంగా ఉంటేనే ఒక ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియం గురించి మాటలు ఉండబోవని కూడా ఆయన అమెరికాకు హెచ్చరిక చేశారు. ఇరాన్ వద్ద ఆరు అణ్వాయుధాలు తయారు చేయడానికి సరిపడ యురోనియం సిద్ధంగా ఉందని అమెరికా పదే పదే వాదిస్తున్నది. అసలు ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండటానికి వీలులేదని అమెరికా అధ్యక్షుడు ల్డ్ ట్రంప్ పదే పదే హెచ్చరికలు చేస్తున్నారు. 2018 లో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరాన్‌తో అణుఒప్పందం రద్దుచేసుకున్నారు. ఆ తర్వాత ఇరాన్ అణ్వాయుధాల అభివృద్ధిలో ఎంతో పురోగతి సాధించిందని ట్రంప్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను అదుపుచేయడంలో బైడెన్ ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపణ. మరింత మెరుగైన ఒప్పందం ఇరాన్‌తో కుదుర్చుకుంటామని చాలాకాలంగా ట్రంప్ చెబుతున్నారు. మాట వినకపోతే ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ ప్రతిఘటనకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ఇప్పటికే ఎదురుహెచ్చరికలు చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేసేందుకు తమకు తొందరలేదని, చర్చలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ట్రంప్ తన తాజా ప్రకటనలో చెప్పారు.

## చరిత్ర సృష్టించిన ఎ.ఐ రోబో

### బీజింగ్‌లో హాఫ్–మారథాన్






**బీజింగ్ :** కృత్రిమ మేధస్సు రంగంలో సరికొత్త మైలురాయికి బీజం పడింది. చైనాలో జరిగిన హాఫ్–మారథాన్ కార్యక్రమంలో మనుషులతోపాటు ఒక రోబో కూడా ఈ రోడ్ రన్నింగ్ రేస్‌లో పాల్గొంది. ఈ హాఫ్–మారథాన్ లక్ష్యాన్ని పూర్తిచేసి ఎండింగ్‌లో గీసిన గీతను దాటి ముందుకు పరుగెత్తి రన్నింగ్ రేస్‌లో హ్యూమనోయిడ్ రోబో సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచంలో మొదటిసారి ఈ విధంగా ఒక రోబో అథ్లెట్స్‌తో కలిసి మారథాన్‌లో పాల్గొని తొలి చరిత్రను లిఖించింది. ''తియాన్ కుంగ్ అల్ట్రా రోబో'' మొత్తం 2.40 గంటలసేపు ఈ మారథాన్‌లో పాల్గొంది. ఉదయం 7.30 గంటలకు స్టార్టింగ్ పాయింట్‌లో గన్ పేల్చగానే ఈ రోబో తన పరుగు ప్రారంభించింది. అనేకమంది ప్రముఖులు, ఔత్సాహిక కెమేరామెన్‌లో ఈ ఫస్ట్ రోబో హాఫ్–మారథాన్‌ను కెమెరాలలో బంధించారు. ఈ అడ్వాన్స్‌డ్ రోబోతో పాటు అనేక రోబోలు కూడా మారథాన్‌లో పాల్గొన్నాయి. వీటికోసం ఆ మారథాన్‌లో ప్రత్యేక నిబంధనలను రూపొందించారు. ఈ ట్రాక్ వెంబడి రోబోలకోసం రీఛార్జ్ బ్యాటరీ సప్లయ్ స్టేషన్స్ ఏర్పాటు చేశారు. బ్యాటరీ రీప్లేస్‌మెంట్‌కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. బీజింగ్‌లో ఉన్న స్థానిక ఎంబోడిడ్ ఎ.ఐ రోబోటిక్స్ ఇన్నొవేషన్ సెంటర్, చైనా జాతీయ సంస్థలు సహభాగస్వామ్యం వహించి ఈ హ్యూమనోయిడ్ రోబోను తయారు చేశాయి. ''తియాన్ కుంగ్ అల్ట్రా రోబో'' ను మల్టిపుల్ అడ్వాన్స్‌డ్ రోబోలలో ఒకటిగా నిర్వాహకులు చెప్పారు. శనివారం నాడు బీజింగ్‌లో జరిగిన హాఫ్–మారథాన్‌లో ఈ రోబో పాల్గొని 21 కి.మీ పైగా మనుషులతో కలిసి పరుగెత్తి లక్ష్యాన్ని చేరుకుని చరిత్ర సృష్టించింది. హాఫ్–మారథాన్ ముగింపునకు చిహ్నంగా గీసిన గీతను దాటుకుని హ్యూమనోయిడ్ రోబో వెళ్ళగానే అక్క గుమిగూడిన ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇటీవలికాలంలో కృత్రిమ మేథలో చైనా అద్భుతమైన పురోగతి సాధిస్తూ ప్రత్యర్థి అమెరికా కంపెనీల గుండెల్లో దడపుట్టిస్తున్నది. రాబోయేకాలంలో హ్యూమనోయిడ్ రోబోలు అంతరిక్షంలోను, భూగర్భంలోనూ, సముద్రగర్భంలోనూ కీలకపాత్ర పోషించనున్నాయి. అందుకు దీటుగా చైనాలో పరిశోధనా కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి.

## గాజాలో దాడులు : పోలియో బాలుడు సజీవసమాధి

## రెండు రోజుల్లో 92 మంది మృతి



**డైర్ అల్ బలాహ్ :** గాజాలో ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి శనివారంనాటికి 599 రోజులు పూర్తయ్యాయి. ఐనాగానీ ఇజ్రాయెల్ తన దాడులను కొనసాగిస్తూనే ఉంది. తాజా దాడుల్లో గడచిన 38 గంటల్లో 92 మంది పాలస్తీనియన్లు మరణించారు. పుట్టుకతోనే పోలియోబారనపడిన ఒక బాలుడు ఈ గగనతలదాడుల్లో సజీవసమాధి అయ్యాడన పాలస్తినా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఇళ్ళువదలిపారిపోయి సురక్షితమని భావించిన ప్రదేశాలలో తాత్కాలిక గుడారాలు వేసుకున్న వారిపై ఈ దాడులు జరిగాయి. గాజా ఆక్రమిత ప్రాంతాల్లోదాడులుఉధృతంచేస్తామనిఇజ్రాయెల్‌సైన్యం ప్రతిజ్ఞ చేసింది. ఐతే ఐక్యరాజ్యసమితి శనివారం వెల్లడించిన సమాచారం ప్రకారం గతనెల (మార్చి 18) మూడోవారంలో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన ఇజ్రాయెల్ దాడులు పునరుద్ధరించినప్పటినుండీ 5,00,000 లమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. 2023 అక్టోబరు ఏడో తేదీన యుద్ధం మొదలైనప్పటినుండీ ఇప్పటివరకూ 20,00,000 మంది పాలస్తీనియన్ల ఇళ్ళు సర్వనాశనమయ్యాయి. మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఆహారంతో పాటు అన్నిరకాల సరఫరాలను వెళ్ళనీయకుండా ఇజ్రాయెల్ సైన్యం అడుకుంది. కాగా ప్రాంతాలవారీగా చూస్తే ఖాన్ యూనిస్‌లో 11 మంది తాజా దాడుల్లో మరణించారు. మ్యాసీ ప్రాంతంలో అనేక టెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసింది. వేలాదిమంది ప్రజలు ఆవాసాలు కోల్పోయి ఈ ప్రాంతంలో తాత్కాలిక గుడారాలు వేసుకున్నారు. కానీ అక్కడకూడా వారికి భద్రతలేకుండాపోయింది. ఈ దాడుల్లో అనేకమంది మరణించారు. రఫా సిటీలో జరిగిన దాడుల్లో నలుగురు మరణించారు. హమాస్ కూడా చివరకు బందీలను అప్పటించడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. అంతర్జాతీయ కృషితో 45 రోజులపాటు ఎట్టకేలకు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నకాలంలో హమాస్ ఉగ్రవాదులు 25 మంది ఇజ్రాయెలీ బందీలను ఆ దేశానికి అప్పగించగా, ఇజ్రాయెల్ కూడా ప్రతిగా 1700 మంది పాలస్తినా ఖైదీలను హమాస్‌కు స్వాధీనం చేసింది. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 400 మంది ఇజ్రాయెలీ సైనికులు మరణించగా, 50,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 14,000 మంది శిథిల్లాలో కూరుకుపోయారు.

## ఒక్కరోజులో 315మంది ఉక్రేన్ సేనలు మృతి

### ఒలెష్న్య ప్రాంతానికి విముక్తి



**మాస్కో :** గడచిన ఇరవైనాలుగు గంటల్లో 315 మంది ఉక్రేన్ సేనలు హతులైనట్లు రష్యా బ్యాటిల్ గ్రూప్ సెంటర్ ప్రకటించింది. టాస్ వార్తాసంస్థ శనివారంనాడు ఈ విషయం వెల్లడించింది. అదేవిధంగా కుర్స్క్ రీజియన్‌లోని ఒలెష్న్య ప్రాంతాన్ని కూడా విముక్తి చేసినట్లు రష్యా రక్షణమంత్రిత్వ శాఖ వేరొక ప్రకటనలో తెలియజేసింది. వందల సంఖ్యలో ఉక్రేన్ సేనలు మరణిస్తున్నారని రష్యా చెబుతున్నప్పటికీ దీనిపై ఉక్రేన్ మాత్రం ఎలాంటి అధికారిక ధృవీకరణలను ఇవ్వడంలేదు. శత్రుదేశం రెండు యుద్ధశకటాలను, మూడు యుద్ధవాహనాలను, మూడు మోటార్ వెహికిల్స్, ఒక ఫీల్డ్ ఆర్టిల్లరీగన్‌నునష్టపోయిందనిరష్యా బ్యాటిల్‌గ్రూప్ సెంటర్ అధికార ప్రతినిధి అలెగ్జాండర్ సావ్‌ఛుక్ చెప్పారు. రష్యా సేనలు తీవ్రయుద్ధంలో నిమగ్నమై ఉన్నారనీ, ఖార్కోవ్ ప్రాంతంలో ఉక్రేన్‌సేనలు తీవ్ర స్థాయిలో ప్రతిఘటిస్తున్నప్పటికీ వోల్‌ఛాన్స్క్ సమీపం ఖుస్తోరా ప్రాంతంలో రష్యా సేనలు మెల్లిగా ముందుకుదూసుకువెళుతున్నాయని,ఉక్రేన్ సేనలు భౌతికంగా తమను అడ్డుకోలేవనీ సేనల తరపున ఆండ్రీ మారోఛ్‌కోవ్ చెప్పారు. కాగా ఒలెష్న్య ప్రాంతాన్ని విముక్తి చేశామనీ, తద్వారాకుర్స్క్‌ప్రాంతంలోజరిగిన యుద్ధంలో ఇప్పటివరకూ 75,170 మంది ఉక్రేన్ సైనికులు హతులయ్యారని రష్యా రక్షణమంత్రిత్వ శాఖపేర్కొంది.ఈ ప్రాంతంలో ఇప్పటివరకూ 411 యుద్ధ ట్యాంకులను, 355 పదాతిదళ యుద్ధ వాహనాలను, 307 సైనిక రవాణా వాహనాలు, 2,280 సైనిక యుద్ధవాహనాలు, 2,743 సాధారణ వాహనాలు, 625 ఆర్టిల్లరీ గన్స్, 61 మల్టిపుల్ రాకెట్ లాంఛర్లను రష్యా సేనలు ధ్వంసం చేసినట్లు మంత్రిత్వశాఖ ప్రకటించింది.

### రష్యా భూభాగంగా క్రిమియాను గుర్తించేందుకు అమెరికా రెడీ

దక్షిణ ఉక్రేన్‌లోని క్రిమియాను రష్యాభూభాగంగా గుర్తించేందుకుఅమెరికా సిద్ధంగా ఉంది! అమెరికా న్యూస్‌మీడియా శనివారం ఈ విషయం వెల్లడించింది. ఉక్రేన్‌లో యుద్ధం ముగించాలని ట్రంప్ చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా రష్యా చర్యలు తీసుకోవడానికి వీలుగా క్రిమియాను రష్యాభూభాగంగా గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆ న్యూస్ మీడియా పేర్కొంది. 2014లో చేసిన దాడుల్లో రష్యా ఈ ప్రాంతాన్నితన అధీనంలోకి తెచ్చుకుంది. ఈ ప్రాంతంలో చేసిన ప్రజాభిప్రాయ సేకరణ కూడా రష్యాకు అనుకూలంగా ఉంది. ఆ తర్వాత రష్యాతో సుదీర్ఘ సాంస్కృతిక, చారిత్ర అనుబంధ తూర్పు ఉక్రేన్ ప్రాంతాలు డోనెట్స్క్, లూహాన్స్క్, దక్షిణ ఉక్రేన్ ప్రాంతాలు ఖెర్సన్, జెపోరిఝియాలను కూడా తన అధీనంలోకి తెచ్చుకునేందుకు 2022లో ఉక్రేన్‌పై రష్యా పూర్తి స్థాయీ యుద్ధం ప్రారంభించింది.

## రైతులు, రైతు కూలీలను ఆదుకోవాలి

### బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాలు, వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులు, రైతు కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఇటీవల పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు, గాలి దుమారం ప్రకృతి బీభత్సంతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలను అందించాలన్నారు.అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంట నేలపాలు కావడం, కొన్నిచోట్ల వరిధాన్యం తడిసి ముద్ద కావడంతో పాటు ఇతర పంటలు కూడ తీవ్రంగా దెబ్బతిన్నడంతో చాలా చోట్ల పంటలకు అపారమైన నష్టం జరిగిందన్నారు. దీంతో ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి ఆరుగాలం కష్టపడిన అన్నదాతలకు కన్నీరే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ కౌలు రైతు నరసింహులు వరి పంట దెబ్బతినగా మనస్థాపంతో గుండె పోటుతో ఆసుపత్రి పాలు కావటం అత్యంత బాధాకరమన్నారు. విపరీతమైన గాలి దుమారానికి పేదల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, చెట్లు విరిగి, పిడుగులు పడి గొర్రెలు మేకలు మృత్యువాతపడ్డాయని పేర్కొన్నారు.

## చట్టసభలు మూయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

నిశికాంత్ దూబే అన్నారు. వక్ఫ్ (సవరణ) చట్టంలోని వివాదాస్పద నిబంధనలలో కొన్నింటిని కోర్టు ప్రశ్నలు లేవనెత్తిన తరువాత తదుపరి విచారణ రోజు వరకు వాటిని అమలు చేయబోమని కేంద్రం కోర్టుకు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు.ఈ నెల మొదటి వారంలో పార్లమెంటు ఆమోదించిన ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ అనేక పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరుపుతున్నది.'వక్ఫ్ బై యూజ్' నిబంధనను ఈ చట్టం సడలించడంపై కోర్టు చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలను దూబే పరోక్షంగా ప్రశ్నించారు. అయోధ్యలోని రామమందిరం సహా దేవాలయాలకు సంబంధించిన కేసులలో డాక్యుమెంటరీ రుజువులను కోరిందని, అయితే కొనసాగుతున్న కేసులో ఇలాంటి అవసరాన్ని విస్మరించడానికి ఎంచుకుందని ఆయన అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ను ఉటంకిస్తూ, చట్టాలు చేయడం పార్లమెంటు పని అని, సుప్రీంకోర్టు చట్టాలను వ్యాఖ్యానించడానికి ఉద్దేశించబడిందని ఆయన పేర్కొన్నారు. కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వగలదు కానీ పార్లమెంటుకు కాదని ఆయన నొక్కి చెప్పారు.గత భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 377 కింద సమ్మతంతో కూడిన స్వలింగ సంపర్కాన్ని నేరరహితం చేయడానికి, దాని ఆరోపిత దుర్వినియోగాన్ని లక్ష్యంగా చేసుకుని ఐటి చట్టంలోని సెక్షన్ 66 (ఎ) ను కొట్టివేయడానికి కోర్టు గతంలో తీసుకున్న నిర్ణయాలను దూబే ఉదహరించారు.

### పౌర యుద్ధాలకు ప్రధాన న్యాయమూర్తే కారణం

దేశంలో మత యుద్ధాలను పురిగొల్పేందుకు సుప్రీం కోర్టు కారణమని నిశికాంత్ దూబే అన్నారు. దేశంలో పౌర యుద్ధాలన్నిటికీ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నానే కారణమని ఆయన 'ఎఎన్ఐ' వార్తా సంస్థతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

### సుప్రీం కోర్టు ప్రతిష్టకు భంగం కలిగించారు : కాంగ్రెస్

సుప్రీం కోర్టుపై బిజెపి ఎంపి నిశికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలు ప్రతిష్టకు భంగం కలిగించేవని, అత్యున్నత న్యాయస్థానంపై దాడిని అమోదయోగ్యం కాదని కాంగ్రెస్ ఎంపి మాణిక్కం ఠాగూర్ అన్నారు. ''ఇది సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా ప్రతిష్టకు భంగం కలిగించే ప్రకటన. నిశికాంత్ దూబే దేశంలోని అన్ని వ్యవస్థలను నిరంతరం ధ్వంసం చేసే వ్యక్తి. ఆయన పార్లమెంటులో కాదు, బైట మాట్లాడారనే అంశాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు పరిగణలో తీసుకుంటారని ఆశిస్తున్నాను. సుప్రీం కోర్టుపై ఆయన దాడి ఆమోదనీయం కాదు'' అని వ్యాఖ్యానించారు. బిజెపి నాయకుని వ్యాఖ్యలు దురదృష్టకరమని, పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా సుప్రీం కోర్టు నిర్ణయం ప్రకటించడం ఇదే మొదటిసారి కాదని వక్ఫ్‌పై సుప్రీంకోర్టులో కేసు వేసిన కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ అన్నారు.

## యువజన కాంగ్రెస్ ఆందోళన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ హెరాల్డ్ కేసులో ఎఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను చేర్చడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శనివారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించి ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు పోలీసులకు మధ్య వాగ్వా దం, తోపులాట చోటుచేసుకుంది. ఈడి కార్యాలయం వైపు దూసుకుపోయేందుకు ప్రయత్నించిన యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ కుటుంబంపై బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోదీ విషం చిమ్ముతూ కేసులు నమోదు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అధికార అహంకారంతో ప్రభుత్వ సంస్థలను నాశనం చేస్తున్నారని, స్వయం ప్రతిపత్తి గల సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం కేవలం బిజెపి రాజకీయ కక్ష సాధింపేనన్నారు. త్వరలోనే ప్రధాని మోదీ నిరంకుశ పరిపాలనకు దేశ ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు.

### బంగ్లాదేశ్‌లో హిందూ నేత హత్యకు

## భారత్ ఖండన

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీ వ్యతిరేక వైఖరి ఇంకా తగ్గలేదు. తాజాగా బంగ్లాదేశ్‌లో ఓ హిందూ మైనార్టీ నేతను అపహరించి హత్యచేయడాన్ని శనివారం భారత్ ఖండించింది. మైనార్టీలను రక్షించే బాధ్యతను ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని భారత్ కోరింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఒక సోషల్‌మీడియా పోస్ట్‌లో బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలను క్రమబద్ధంగా హింసించే విధానంలో భాగమే భబేష్ చంద్రరాయ్ దారుణ హత్య అని ఆరోపించారు.బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీ నేత 'భబేష్ చంద్ర రాయ్ అపహరణ, దారుణహత్యను మేం బాధతో గుర్తించాం' అని ఆయన అన్నారు. తాత్కాలిక ప్రభుత్వంలో హిందూ మైనార్టీలను క్రమబద్ధంగా హింసించే విధానంలో భాగంగానే ఈ హత్య జరిగిందని, మునుపటి నేరస్తులకు శిక్ష నుంచి మినహాయింపు ఇవ్వడంవల్లే ఇలాంటి సంఘటనలు యథేచ్ఛగా జరుగుతున్నాయని జైస్వాల్ చెప్పారు. ఇలాంటి ఘటనలను భారత్ ఖండిస్తోందని, మైనార్టీలు అందరినీ రక్షించడంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తన బాధ్యతను ఎట్టి పరిస్థితులలో విడిచిపెట్టవద్దని మరోసారి గుర్తుచేస్తున్నామన్నారు. మూకుమ్మడిగా భారీ ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ప్రజ్వరిల్లుతున్న నేపథ్యంలో పదవీచ్యుతులై ఢాకా నుంచి ప్రధానమంత్రి షేక్ హసీనా పారిపోయి భారత్‌లో తలదాచుకున్న అనంతరం భారత్‌బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు తీవ్ర తిరోగమన దిశలో పయనించాయి. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మైనార్టీలను ముఖ్యంగా హిందువులపై దాడులను నియంత్రించడంలో విఫలమైన తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు నాటకీయంగా దెబ్బతిన్నాయి.

### భబేష్ హత్యను ఖండించిన కాంగ్రెస్

హిందూ నేత భబేష్ చంద్రరాయ్ దారుణ హత్యను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం ఈ విషయంలో బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించాలని, ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నప్పుడు భారత ప్రభుత్వం మౌనం వహించడం సరియైన విధానంకాదని, క్షేత్ర స్థాయిలో హింసను లక్ష్యంగా చేసుకుంటుంటే వారికి అవకాశం ఇవ్వడం సమంజసం కాదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రత్యేకించి మన హిందూ సోదర సోదరీమణులు, మతాలకు చెందిన మైనార్టీలు నిరంతరం అక్కడ నివసిస్తున్నారని తెలియజేశారు. నరేంద్రమోదీ బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారుతో నవ్వుతూ సమావేశం నిర్వహించడమే ఆయన విఫలమయ్యారని, హిందూ సమాజానికి చెందిన భబేష్ చంద్రరాయ్ హత్య దీనికి రుజువని శనివారం మల్లికార్జున్ ఖర్గే తన హిందీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ హత్యపై కాంగ్రెస్‌ప్రధానకార్యదర్శి,ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేష్ స్పందించారు. బంగ్లాదేశ్‌లో హిందూ సమాజానికి కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలియజేశారు. నిందితులను కఠినంగా శిక్షించడంలో పారదర్శక చర్య తీసుకునేలా ప్రభుత్వం తప్పకుండా ప్రయత్నాలు కొనసాగించాలని కోరారు.

## అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లకు సంబంధించి శనివారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాల భవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్,వినియోగదారుల వ్యవహారాలు,ఆహార,పౌర సరఫరాల శాఖ జాయింట్ కమిషనర్ ప్రియాంకా అలే, డైరెక్టర్ ప్రసాద్ తదితరులతో కలసి జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆదిలాబాద్ నుండి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి దలసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు.

**యాసంగీలో ధాన్యం దిగుబడి మరో రికార్డు కానుంది :**

యాసంగీలో ధాన్యం దిగుబడి మరో రికార్డు కానుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగాఈ సీజన్ లో రైతాంగం 57 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, రికార్డ్ స్థాయిలో 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానుందని ప్రభుత్వ అంచనా ఉందన్నారు. ఇందులో 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందని ఆయన వెల్లడించారు. ధాన్యం కొనుగోలు అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎక్కడ ఏలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండ అన్ని జిల్లాల కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో 66.7 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 153.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ప్రస్తుత రబీ సీజన్ లో 57 లక్షల ఎకరాల్లో సాగుకు గాను 127.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా ఉందని, ఈ రెండు సీజన్లు కలిపిమొత్తం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుదన్నారు. ఇది తెలంగాణాలో మాత్రమే కాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు యావత్ భారతదేశంలోనే అరుదైన రికార్డ్ నమోదు చేసుకోనుందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు సున్నిత మైన అంశమని అధికారులు అప్రమత్తంగా ఉంటూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతాంగాన్ని చైతన్యపరచాలని సూచించారు.

**ఇప్పటీ వరకు 5.77లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు :**

ఏప్రిల్ రెండో వారం పూర్తి అయ్యేనాటికి 8.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరగా ఇప్పటికే 5.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.ఇందులో సన్నరకాలు 3.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండగా 1.98 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాలనీ ఆయన వివరించారు. సన్నాలు పండించిన రైతాంగానికి బోనస్ లు ఎప్పటికప్పుడు వారి వారి ఖాతాలలో జమ చేస్తున్నామన్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం 8,329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి నిర్ణయం తీసుకోగా ఇప్పటికే 7,337 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని చెప్పారు. .సుమారు 88 శాతానికి పై బడి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా ఇవి పి.ఏ.సి.ఎస్,ఐ. కే. పి గ్రూపుల ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంబించగా మిగిలిన జిల్లాలో వరికోతలను దృష్టిలో పెట్టుకుని ప్రారంభిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.ఆయా దాన్యం కొనుగోలు కేంద్రాలకు గ్రేయిన్ కాలిపర్స్, ఎలక్ట్రానిక్ తూకపు మిషన్లు, మాయిశ్చర్ మీటర్లతో పాటు టార్పాలిన్లు,క్లినర్లు,హస్క్ రిమువర్ వంటి యంత్రాలను తరలించినట్లు ఆయన చెప్పారు. మొత్తం 17.5 కోట్ల గన్ని బ్యాగులు అవసరం ఉండగా 9.45 కోట్లు కొత్తవి,8.05 కోట్లు పాతవి ఏర్పాటు చేస్తున్నామన్నారు.ప్రస్తుతం 9.23 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నట్లు ఆయన చెప్పారు. ఫిలిప్పీన్స్ తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటికే లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఎగుమతి చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే మొదటి దశలో 12,500 మెట్రిక్ టన్నులు పంపించగా రెండో దశలో పంపిణీకి రంగం సిద్ధమైందని తెలిపారు.

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా రానున్న విద్యాసంవత్సరానికిగాను ముందస్తూ అడ్మిషన్లు నిర్వహిస్తు, ప్రచార హోర్డింగ్‌ల ద్వారా హోరెత్తిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాల యాజమన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు డిమాండ్ చేశారు. ఇంత జరగుతున్న విద్యాశాఖ, ఇంటర్ బోర్డుకు చెందిన కొంతమంది అధికారులు విద్యాసంస్థల యాజమాన్యాలకు తొత్తులుగా మారి ఏమి పట్టనట్లుగా వ్యవరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫర్ల పేరుతో ఈ తేదిలోపు అడ్మిషన్ తీసుకుంటే ఇంత ఇంత ఫీజు రాయితీ అంటూ ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల వారు విద్యను వ్యాపారంగా మార్చారని, నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహించడమే కాకుండా అడ్మిషన్ ఫీజు పేరిట వేలాది రూపాయలు వసూలు చేస్తున్నరన్నారు. మరోవైపు నిబంధన విధంగా టెక్నో ,ఈటెక్నో, వరల్డ్, ఒలంపియాడ్, వంటి పేర్లతో ప్రచారం చేస్తు కార్పొరేట్ కళాశాలల వారు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఇండ్ల వద్దకు వెళ్లి మాయమాటలు చెప్పి అందిన కాడికి దండుకుంటున్నారని విమర్శించారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడం మూలంగానే ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల వారు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారని, సిఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ కూడా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో తక్షణమే విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.

## ప్రభుత్వానిది సాహసమే

(మొదటి పేజీ తరువాయి)

బాపూజీ నగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో అధికారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం ఎమ్మెల్యే కూనంనేని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల ఆకలిని గుర్తించి పథకం అమలుకు ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అభినందనీయమని అన్నారు. రేషన్ షాపుల నిర్వహనను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్‌కుమార్, వైఎస్ గిరి, బట్టు మురళీ, విజయ్, రాంబాబు, హెచ్ మధు, ఆదినారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలు రావాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో ఐటి, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని, తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోనున్నామని, ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను అభివృద్ధి చేసుకుందామన్నారు. టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్ ఫ్రంట్ పరిశీలించామని, నీరు మన సంస్కృతికి, అభివృద్ధికి ప్రతీక అన్నారు. హైదరాబాద్‌లో మూసీ నది ప్రక్షాళనకు కొంతమంది అడ్డుపడుతున్నారని సిఎం అన్నారు. ఢిల్లీలో కాలుష్యంతో అన్ని సంస్థలకు సెలవులు ఇస్తున్న పరిస్థితి ఉందని, కేవలం కాలుష్యంతో ఢిల్లీ నగరం స్థంభించే పరిస్థితి ఉండగా, మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. ఈ కారణంగా హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళన చేయాలని చెబుతున్నామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి అత్యంత కీలకమైన అంశాలని సిఎం వివరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైతు మహోత్సవ పోస్టర్ విడుదల



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి 23 వరకు నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవం వాల్ పోస్టర్, కరపత్రంను హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం డైరెక్టర్ బి.గోపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు వేలాదిగా తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి స్టాల్స్ దాదాపు 150 స్టాల్స్‌ను రైతు మహోత్సవంలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పోస్టర్, కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ కె. విజయ్ కుమార్, జాయింట్ డైరెక్టర్లు బాలు, వై సుచరిత, అసిస్టెంట్ డైరెక్టర్లు మేరీ రేఖ, రత్నాకర్ పాల్గొన్నారు.

# వక్ఫ్ చట్టాన్ని తిప్పికొట్టాలి

- మతాలు, కులాలకు అతీతంగా పౌరులందరూ ఏకమవ్వాలి
- రైతు ఉద్యమం తరహాలో మరో పోరాటానికి నాంది పలకాలి
- 'వక్ఫ్ సవరణ చట్టం ఎవరికోసం?' రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు




ప్రజాపక్షం/హైదరాబాద్

వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా మతాలు, కులాలకు అతీతంగా దేశ పౌరులందరూ ఏకమై తిప్పికొట్టాలని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మేధావులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త రైతు ఉద్యమం తరహాలో మరో పోరాటానికి నాంది పలికి ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిన బూనాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో "వక్ఫ్ సవరణ చట్టం ఎవరి కోసం?" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ, ప్రముఖ శాస్త్రవేత మోటూరి కృష్ణప్రసాద్, ఎంబిటి అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్, ఇన్సాఫ్ రాష్ట్రాధ్యక్షులు, మునీర్ పటేల్, జర్నలిస్ట్, రచయిత సెబాస్టియన్ , భారత జాతీయవాదుల ఉద్యమం, జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నవీద్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఫసియుద్దీన్ ఖాస్మి, ముస్లిం ఐక్యత, అభివృద్ధి ఉద్యమం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ సుభాన్, ఆల్ ఇండియా సూఫీ ఉలేమా కౌన్సిల్, అధ్యక్షుడు మౌలానా ఖైరుద్దీన్ సూ, జామియత్ ఎ అహ్లే హదీస్, తెలంగాణ ప్రతినిధి డాక్టర్ ఆసిఫ్ ఉమ్రీ, జమాత్ ఎ ఉలేమా ఎ హింద్ ప్రతినిధి మొహబూబ్ మదనీలతో పాటు పలువురు మేధావులు పాల్గొన్నారు. తెలుత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వెచ్చించి మరీ వక్ఫ్ బోర్డు చట్ట సవరణను సాధించుకుందని విమర్శించారు. ఈ బిల్లు ఆమోదం పొందేందుకు అవకాశాలున్నాయని ఆంధ్రప్రదేశ్ సిఎం నారా చంద్రబాబునాయుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లు బేరమాడి మరీ వారి డిమాండ్లను నెరవేర్చుకున్న తర్వాతే ఈ బిల్లుకు మద్దతును ఇచ్చారని విమర్శించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారని తెలిపారు. ఒక వైపు న్యాయపోరాటం, మరో వైపు ప్రజా ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగడతామని చెప్పారు. కేరళలో జరుగుతున్న సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఓ తీర్మానం చేసి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చట్టం సవరణ కేవలం ముస్లింలకు మాత్రమే అన్యాయం జరుగుతుందని భావించరాదన్నారు. ఈ చట్ట సవరణతో ప్రధాని మోదీ రాజకీయ జీవితం పరిసమాప్తం కానుందన్నారు.

ఇటి నరసింహా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోని బిజెపి ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను వీడదీసేందుకు ఎన్ని కుట్రలు పన్నినా వాటిని సిపిఐ తిప్పికొడుతుందని, ఇందుకు అవసరమైతే ప్రాణ త్యాగాలకు సైతం వెనకాడబోమని స్పష్టం చేశారు. వందల ఏళ్లుగా ఉన్న అనేక మసీదులు, ఈద్గాలు, ఆలయాలకు సంబంధించి ఏలాంటి కాగితాలు లేవని, కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సవాల్ చేశారు. అమ్జదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి ఎపి సిఎంగా 1994లో ఉన్న చంద్రబాబునాయుడు వక్ఫ్‌బోర్డు భూముల ఆక్రమణదారులకు నాంది పలికారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్.రాజశేఖర్ రెడ్డి మొదలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సిఎంగా బాధ్యతలు చేపట్టిన కెసిఆర్ వరకు అందరూ వక్ఫ్ బోర్డు భూములను కొల్లగొట్టిన వారేనని విమర్శించారు. వారి ద్వారాలు తెరిస్తే ప్రధాని మోదీ ఏకంగా వక్ఫ్ బోర్డు భూములను లూటీ చేసేందుకు వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ప్రస్తుత న్యాయ వ్యవస్థను పరిశీలిస్తే సుప్రీం కోర్టు ద్వారా న్యాయం జరుగుతుందన్న నమ్మకం పెద్దగా లేదని, అక్కడ న్యాయం జరిగినా జరగకపోయినా, వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణ వ్యతిరేక ఉద్యమానికి సిపిఐ న్యాయకత్వం వహించాలని, తామంతా భాగస్వామ్యమౌతామన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎన్.శ్రీకాంత్, షంషుద్దీన్, ఎండి. సలీం, సలీమ్ ఖాన్, కాంపల్లి శ్రీనివాస్, గ్యార నరేష్, మహమూద్ పాల్గొన్నారు.

# మేమేమీ తక్కువ కాదు

- జెఇఇలో మెరిసిన ఎస్‌సి గురుకుల విద్యార్థులు
- అడ్వాన్స్‌కు అర్హత పొందిన 525 మంది
- గురుకుల చరిత్రలోనే కొత్త రికార్డు




ప్రజాపక్షం/హైదరాబాద్

కార్పొరేట్ సంస్థల విద్యార్థుల కంటే తామేమీ తక్కువ కాదని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ విద్యార్థులు నిరూపించారు. జెఈఈ మెయిన్స్ 2025లో గురుకులాలకు చెందిన 525 మంది విద్యార్థులు 61 శాతం కంటే అధికంగా మార్కులు సాధించి, జెఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించారు. ఈ ఫలితాలు గురుకుల సంస్థ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా సాధించడం ఒక సువర్ణ అధ్యాయమని గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలగు వర్షిణి అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి చొరవతో ప్రైవేట్ కోచింగ్ సంస్థలకు ధీటుగా తమ విద్యార్థులకు జెఈఈ శిక్షణ ఇస్తున్నామని వర్షిణి తెలిపారు. జెఈఈ 2025 మెయిన్స్‌లో ( జనవరి , ఏప్రిల్‌లో ) రెండు విడతల్లో జరిగిన పరీక్షల్లో అత్యధిక శాతం సాధించిన విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. 90 పై శాతం సాధించిన విద్యార్థులు 40, 80 పై శాతం సాధించిన విద్యార్థులు 164 ఉన్నారు. గౌలిదొడ్డి బాలుర కళాశాలకు చెందిన ఆర్. మణి దీప్ 99.03, కె .చరణ్ తేజ్ 98 .30, రామ్ చరణ్ తేజ 98.08, అలాగే బాలికల కళాశాల విద్యార్థినిలు బి. తేజస్విని 98 .27, కె. కీర్తన 96.71, షేక్‌పేట గురుకులంకు చెందిన టి. అభ్రయాం 97.87, నల్లగొండ జిల్లా జివి గూడెం కళాశాలకు చెందిన కె. కీర్తన 96 .71 శాతం మార్కులను సాధించి ముందంజలో ఉన్నారు.

**అభినందనలు తెలిపిన సిఎం..**

ఈ సందర్భంగా విజయాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అందుకు కృషి చేసిన సిబ్బందిని, సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎస్‌సిడిడి ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, గురుకులాల కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిణి ప్రత్యేకంగా అభినందించారు. గురుకుల ప్రతిభ కేంద్రంలో (సిఓఇ) విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి సంస్థ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలతో మంచి ఫలితాలు సాధించడం జరిగిందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యాలయాల సంస్థ కార్యదర్శి తెలిపారు. అనుభవజ్ఞులైన ప్రధానాచార్యులను, నిష్టాతులైన బోధనా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. మైక్రో షెడ్యూల్‌ని పటిష్టంగా అమలు పర్చడం, నిరంతర మూల్యాకనం, ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేయడం, లక్ష్యానికి అనుగుణంగా నిరంతరం పర్యవేక్షణతో ఈ ఫలితాలు సాదించేందుకు దోహదపడిందన్నారు. మే 18న నిర్వహించనున్న జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో పైన పేర్కొన్న విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ఐఐటిలో సీట్లు సాధించేందుకు ప్రత్యేక కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తూ అత్యధిక సంఖ్యలో విద్యార్థులుఅర్హత పొందేవిధంగా కార్యాచరణ ప్రణాళికను అమలు పరుస్తున్నామని తెలిపారు.

**జెఈఈ ప్రవేశ పరీక్షలోబిసి గురుకుల విద్యార్థుల విజయ భేరీ**

జెఈఈ ప్రవేశ పరీక్షలో బిసి గురుకుల విద్యార్థులు విజయ భేరీ మోగించారు. 97.43 శాతం, నవదీప్, 94.10 శాతం రాజశేఖర్ రెడ్డి, 93.02 డి. తరుణ్, 92.08 ఎం. జాహ్నవి, 91.82 కె. స్వాతి, 90 పైగా పర్సంటైల్ సాధించిన ఏడుగురు అబ్బాయిలు, మొత్తం 63 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. విద్యార్థులను బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజెపి కార్యదర్శి బడుగుల సైదులు అభినందించారు. జాతీయ స్థాయిలో ఐఐటి, ఎన్ఐటిలో 2025 26 సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహించిన జెఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షలో బిసి గురుకుల పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో అర్హత సాధించారు. 90కి పైగా శాతం 9 మంది విద్యార్థులు సాధించగా, మొత్తం 63 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు.

**పర్సంటేజ్ సాధించిన విద్యార్థులు..**

ఎం. నవదీప్(97.43), వై.రాజశేఖర్ రెడ్డి (94.10), డి.తరుణ్(93.02), ఆర్. వరుణ్ (91.68), ఎన్.శ్రీకాంత్(91.68), డి.ఆశిష్(91.12), సిహెచ్. సాయి ప్రసన్న(90.46), అమ్మాయిలు ఎం. జాహ్నవి(92.08), కె.స్వాతి(91.82), మొత్తం 63 మంది విద్యార్థులు అర్హత సాధించగా, వారిలో 32 మంది అబ్బాయిలు, 31 మంది అమ్మాయిలు ఉన్నారు. 80 కంటే ఎక్కువ శాతం సాధించిన వాళ్లలో 23 మంది అబ్బాయిలు, 18 మంది అమ్మాయిలు ఉన్నారు. అధిక శాతం సాధించిన, క్వాలిఫై అయినా విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

## టోల్‌ప్లాజా వద్ద లారీ బీభత్సం

ప్రజాపక్షం/రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల టోల్‌ప్లాజా వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. లారీ డ్రైవర్ తాగిన మైకంలో అతివేగంగా అజాగ్రత్తగా నడపడంతో టోల్ బూత్ మొత్తం ధ్వంసం కాగా అందులో పని చేస్తున్న ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన మక్కల శంకర్ అనే లారీ డ్రైవర్ తన లారీని తీసుకుని హైదరాబాద్ నుండి హన్మకొండకు వెళ్తున్న క్రమంలో టోల్‌ప్లాజా వద్దకు రాగానే డ్రైవర్ అప్పటికే మద్యం సేవించి లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఉండడంతో లారీ అదుపుతప్పి టోల్ బూత్‌ను అతివేగంగా ఢీకొట్టడమే గాకుండా అక్కడే ఉన్న టీఎస్ 07ఈవి 0749 నెంబర్ గల చుక్క వెంకటరమణకు చెందిన షిఫ్ట్ డిజైర్ వాహనాన్ని సైతం ఢీకొట్టింది. ఈ సంఘటనలో టోల్‌ప్లాజాలో పని చేస్తున్న బండి శ్రీకాంత్‌గౌడ్ అనే వ్యక్తికి గాయాలు కాగా అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. సంఘటన సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ తెలిపారు.

# హైదరాబాద్ స్థానిక సంస్థల.. ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్




ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ప్రకటించారు. పోలింగ్‌కు ఎవరూ హాజరు కావద్దని, పార్టీ తరపున విప్ కూడా జారీ చేస్తామని తెలిపారు. ఎవరైనా విప్ ధిక్కరించి, ఓటింగ్‌కు వెళ్తే సస్పెండ్ చేస్తామని పార్టీ కార్పొరేటర్‌లను హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో శనివారం బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహకాల్లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్‌కు బిఆర్ఎస్ దూరంగా ఉంటుందన్నారు. బలం లేదు కాబట్టే అభ్యర్థిని పోటీలో పెట్టలేదన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక అక్టోబర్‌లో ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ నెల 27న హనుమకొండలో జరిగే సభ తర్వాత కొత్తగా పార్టీ సభ్యత్వాలు తీసుకుంటామని, ఇకపై డిజిటల్ సభ్యత్వాలు తీసుకోవాలని నిర్ణయించామని తెలిపారు. అన్ని విషయాలపై అవగాహనతో మట్లాడగలిగేలా కార్యకర్తలకు త్వరలో శిక్షణ ఇస్తామన్నారు. ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్లకు ఉప ఎన్నికలు ఖాయం అన్నారు. చేసినవి చెప్పుకోనందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామన్నారు. 17 నెలల్లో బిఆర్ఎస్ గ్రాఫ్ బాగా పెరిగిందన్నారు. ప్రస్తుతం హైడ్రా, మూసీ, హెచ్‌సియు భూముల పేరుతో అరాచకాలు చేస్తోందన్నారు. హైడ్రా హడలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పతనమైందన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులతో తెలంగాణకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌గాంధీలపై ఈడి ఛార్జ్‌షీట్ పెడితే రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రధా ని మోదీ, సిఎం రేవంత్ రెడ్డిలది దృఢమైన బంధం అని ఆరోపించారు. ఈ సన్నాహక సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎంఎల్‌సి సురభి వాణిదేవి, ఎంఎల్‌ఎలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, నాయకులు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# బిజెపితో లోపాయికారీ ఒప్పందం

టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్




ప్రజాపక్షం/హైదరాబాద్: దొంగల ముఠాలా రాష్ట్రాన్ని పదేళ్లు దోచుకున్న బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికి బిజెపితో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన బిఆర్ఎస్ నేతలు చివరకు అక్రమాలపై కేంద్రం చర్యలు తీసుకోకుండా ప్రధాని మోదీకి దాసోహమయ్యారన్నారు. గాంధీ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ పరిపాలనలో అప్పటి సిఎం, మంత్రుల బలహీనతలను ఆసరాగా తీసుకున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలను, నిధులను ఇవ్వకుండా అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం సొంత ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తూ బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. పదేళ్లలో కేంద్రంలోని బిజెపి సర్కార్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బిల్లులకు, ప్రధాని మోదీ తీసుకున్న అనాలోచన నిర్ణయాలన్నింటికీ మద్దతు ఇచ్చిన బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదమన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను లిక్కర్ స్కామ్ నుంచి కాపాడడానికి బిజెపికి ఊడిగం చేసిది నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. బిజెపికి కట్టు బానిసలా కెటిఆర్ పనిచేస్తున్నారన్నారు. రెండు పార్టీలు కలిసి హెచ్‌సియు భూములపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బిఆర్ఎస్ అండ చూసుకునే సంఖ్యా బలం లేని బిజెపి ఎన్నికల్లో పోటీ చేస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని గెలిపించేందుకే కెటిఆర్ తాపత్రయ పడుతున్నారన్నారు. పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్దఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బిసిలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్‌సి వర్గీకరణ చేయడం, పేదలకు సన్న బియ్యం అందించడం వంటి గొప్ప పథకాలను, పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ నేతలు విమర్శించడం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

# సన్నబియ్యం అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ

సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో మంత్రి తుమ్మల భోజనం



ప్రజాపక్షం/రఘునాథపాలెం : దేశంలో పేదలకు సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సన్న బియ్యం కార్యక్రమంలో భాగంగా శనివారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామంలో లబ్ధిదారుడు గుడిబండ్ల రాజారావు ఇంట్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఇంచార్జ్ కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కూలీ చేసుకునే కుటుంబం నేడు సంతోషంతో సన్న బియ్యం భోజనం చేస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా అందించే దొడ్డు బియ్యం బయట మార్కెట్‌లో రూ.10లకు అమ్ముకుని కూలీ చేసిన డబ్బులతో సన్నబియ్యం కొనుక్కోవాల్సి వచ్చేదన్నారు. సన్న బియ్యం పంపిణీ ద్వారా రైతులకు కూడా లాభం జరగాలని ప్రభుత్వం క్వింటా సన్నధాన్యంపై మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లించి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిందన్నారు. అంతకు ముందు రఘునాథపాలెం మండలం బూడిదంపాడు పుతానితండా, జెడ్పిరోడ్డు నుంచి వాంకుడోత్ తండా రోడ్డు వరకు రూ.2.50 కోట్లతో చేపట్టిన బిటి రోడ్డు నిర్మాణ పనులకు, బూడిదంపాడు ఎస్సి కాలనీ నందు రూ.80 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు, ఆర్అండ్‌బి రోడ్డు నుండి బూడిదంపాడు గ్రామం వరకు రూ. 1.50 కోట్లతో నిర్మించనున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసి ఈవో దీక్షారైనా, ఆర్అండ్‌బి ఎస్ఈ యుగంధర్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిఎల్‌పివో రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, నాయకులు చోటాబాబా, వాంకుడోత్ దీప్లా నాయక్, తుమ్మలపల్లి నర్సింహారావు, బాలాజీ నాయక్, కొంటెముక్కల నాగేశ్వరరావు, కళ్యాణం వెంకటనర్సయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కార్మిక వ్యతిరేక పార్టీ

మే 20న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు బిఆర్ఎస్ సంపూర్ణ మద్దతు : మాజీ మంత్రి హరీష్‌రావు



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : కార్మికుల శ్రమ, చమట చుక్కలు లేకపోతే ఈ ప్రపంచమే నడవదని, కార్మికుల పట్ల కేంద్ర వైఖరి దుర్మార్గంగా ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. మే 20న దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె కు బిఆర్ఎస్ పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాజీ మంత్రి హరీష్‌రావు వెల్లడించారు. శనివారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలో టిటిఎఫ్ భవన్‌లో జరిగిన కార్మిక సంఘాల సదస్సులో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. 50 శాతం మంది కార్మికులు అంగీకరిస్తేనే యూనియన్ పెట్టాలని కార్మిక వ్యతిరేక నిబంధనలను పెట్టిందన్నారు. కార్మికులను మేనేజ్ చేసి అక్కడ యూనియన్ లేకుండా చేస్తుందన్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా? యూనియన్ లేకుండా ప్రశ్నించే కార్మిక గొంతులుంటాయా ? అన్నారు. మొదటి నుండి బిజెపి కార్మిక వ్యతిరేక పార్టీ, బడాబాబులు, బడబడా పారిశ్రామిక వేత్తల పార్టీ అన్నారు, బడా పారిశ్రామికవేత్తలకు కేంద్ర బిజెపి సర్కార్ 16.50 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. కార్మికులకు 16వేల వేతనం ఇవ్వమంటే మనస్సు రాదని, పారిశ్రామిక వేత్తలకు కోట్లు రూపాయలు మాఫీ చేస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ చేయమన్న, కార్మికులకు ఆరోగ్య భద్రత, కల్పించమన్న వీరికి చేతులు రావన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయమన్న బిజెపి సర్కార్ పట్టించుకోవటం లేదన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు కోసం మే 20న జరిపే సమ్మెలో కార్మిక సంఘాలతో పాటు బిఆర్ఎస్ శ్రేణులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కిష్టపురం లక్ష్మణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, రాజనర్సు, గోపాలస్వామి, సాయిరాం, నర్సింలు, పిండి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: చిత్రపురికాలనీ అవినీతికి కారణం అయిన ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావుపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ పోరాటాలు కొనసాగిస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. చిత్రపురి కాలనీ అవినీతి, అక్రమాలను నిరసిస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద శనివారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.

ధర్నాను ఉద్దేశించి నరసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం మారిన తర్వాత కూడా గత ప్రభుత్వం అవినీతి ఇంకా కొనసాగుతున్నదని, ఈ విషయంపై సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబాశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ద్వారా అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తామని, దీనిపై న్యాయం జరిగే వరకూ పోరాడుతామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు దిడ్డి సుధాకర్, నవోదయం పార్టీ నాయకులు పటేల్, భద్ర, కస్తూరి శ్రీనివాస్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ చిత్రపురి కాలనీ అవినీతి అక్రమాలు ఆగాలంటే ప్రస్తుత అక్రమ కమిటీ రద్దు చేసి, అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే ఈ విషయంపై స్పందించి కమిటీని రద్దు చేయాలని కోరారు.

# పెరిగిన వేతనాలు జూన్ 2021 నుండి ఇవ్వాలి

ఎమ్మెల్సీ కోదండరాం డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: బస్తీ దవాఖానాలో సపోర్టింగ్ స్టాఫ్‌కు పెరిగిన వేతనాలు జూన్ 2021 నుండి ఇప్పించాలని ఎమ్మెల్సీ సి.కోదండరాం డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానాలలో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు ప్రభుత్వ ఉత్తర్వుల జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇటీవల పెరిగి వస్తున్నాయి. సపోర్టింగ్ స్టాఫ్‌ల యొక్క బేసిక్ వేతనంలో జిఎస్‌టి, ఇతర మినహాయింపులు చేయడం వలన సపోర్టింగ్ స్టాఫ్‌కు చేతికి జీతం కేవలం రూపాయలు 9917 రావడం జరుగుతుంది. కానీ కనీస వేతనం 13,600 నగదు రావలసి ఉన్నదని ఎమ్మెల్సీ కోదండరాం వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ దృష్టికి శనివారం తీసుకెళ్లారు. 2019 సంవత్సరంలో కాంట్రాక్ట్ విధానంలో నియామకమై 6 సంవత్సరాల నుండి నుండి కాంట్రా క్టు విధానంలో పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌ను కాంట్రాక్ట్ విధా నం నుండి మార్పు చేసి ఇటీవల ఏజెన్సీలకు అప్పుజెప్పడం జరిగిందని, తిరిగి వీరిని కాంట్రాక్ట్ విధానంలో పని విధానంను అమలు చేస్తున్నారని తెలిపారు. బస్తి దవాఖాన ఏర్పాటు అయిన 2018 నుండి కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్‌లలో నియామకమై నేటివరకు పని చేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌ల యొక్క వేతనాలలో మినహాయించిన ప్రావిడెంట్ ఫండ్ కాంట్రిబ్యూషన్ అమౌంట్‌లు సపోర్టింగ్ స్టాఫ్ అకౌంట్‌లలో పూర్తి పెండింగ్ పీరియడ్ అమౌంట్‌ను స్టేట్ హెల్త్ సొసైటీ, డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీ, ఏజెన్సీల నుండి జమ చేయించుటకు వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ ఆర్.వీ.కర్ణన్‌కు వినతి పత్రం అందసినట్లు టిజెఎస్‌కెవి కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ దవాఖాన కాంట్రాక్టు, ఔట్ సోర్సిం గ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మంగళపాటీ సుమన్, కన్వీనర్ మెతుకు ఉప్పలయ్య, స్వప్న, శాంతమ్మ, పావని, హారిక,అనిత, అంబికా, మహేష్, భావిక, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**సూపరింటెండెంట్ కార్యాలయం, నీలోఫర్ హాస్పిటల్,**
రెడ్ హిల్స్, హైదరాబాద్.

Rc.No.GS/NH/2025/777 | టెండర్ ప్రకటన | తేది: 17.04.2025

హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి (ఒక ఏడాది) కొన్ని ల్యాబ్ కెమికల్స్, కిట్లు, జనరల్ & ఎలక్ట్రికల్ వస్తువులు & స్టేషనరీ వస్తువులను సప్లయ్ చేయడానికి ప్రముఖ కంపెనీలు / సంస్థల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. టెండర్ ఫారమ్‌తో పాటు నిబంధనలు, షరతులు సూపరింటెండెంట్, నిలోఫర్ కార్యాలయం నందు అందుబాటులో ఉన్నాయి. **సూపరింటెండెంట్, నీలోఫర్ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ, హైదరాబాద్‌కు అనుకూలంగా డి.డి రూపంలో ప్రతీ టెండర్ ఫారమ్‌కు రూ.3,000/- జిఎస్‌టితో పాటు చెల్లించి ఏదైనా పనిదినం రోజున ఉ.11.00గం.ల నుండి మ.3.00గం.ల మధ్య పొందవచ్చును.**
**ప్రతి టెండర్‌కు జతపరచవలసిన ఇఎండి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:** 1. ల్యాబ్ కెమికల్ & కిట్స్: రూ.50,000/-, 2. జనరల్ & ఎలక్ట్రికల్ వస్తువులు: రూ. 30,000/-, 3. స్టేషనరీ వస్తువులు: రూ. 30,000/-.
**టెండర్ షెడ్యూల్:** 1. టెండర్ ఫారమ్‌ల అమ్మకపు తేదీ: 21-04-2025, 2. టెండర్ ఫారమ్ అమ్మకపు చివరి తేదీ: 02-05-2025, 3. సీల్డ్ టెండర్ ఫారమ్ సమర్పణ / స్వీకరణకు చివరి తేదీ: 02-05-2025 మధ్యాహ్నం 12:30 గంటల వరకు, 4. సీల్ టెండర్ల తెరవడం: 02-05-2025 మధ్యాహ్నం 03:00 గంటల వరకు, 5. సీల్ టెండర్ల తెరిచే స్థలం: **హైదరాబాద్‌లోని నీలోఫర్ హాస్పిటల్ బోర్డు రూమ్.** మరిన్ని వివరాలకు సూపరింటెండెంట్ కార్యాలయం, నీలోఫర్ హాస్పిటల్, మరియు హైదరాబాద్ నుండి పొందవచ్చు. (040-23394265)

సం/- సూపరింటెండెంట్, నీలోఫర్ హాస్పిటల్, హైదరాబాద్.
DIPR R.O. No. : 551-PP/CL/ADVT/1/2025-26, Date: 19-04-2025

**పురపాలక సంఘ కార్యాలయము, తూంకుంట,**
మేడ్చల్ – మల్కాజ్ గిరి జిల్లా

ఫైల్ నెం. F1/TMC/Chicken Waste /2025, | ఆసక్తి వ్యక్తీకరణ (EOI) | తేది: 17.04.2025

**పని పేరు:** తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో సం.2025-2026 సం॥ నుండి 2027-28 సం॥ వరకు అనగా (3) సం సంవత్సరాల కాలవ్యవధికై. చికెన్, మటన్ మరియు చేప యొక్క వ్యర్థాలను సేకరించడం - నిమిత్తం - సీల్డ్ కొటేషన్‌ను సమర్పించుటకై - ఆసక్తి - అనుభవం ఉన్న నుండి టెండర్లు కోరుట గురించి.
**షరతులు:** 1. మున్సిపాలిటీల నుంచి పని అనుభవం. 2. రిజిస్టర్ అయిన వాహనం యొక్క వివరములు. 3. డ్రైవర్లు సరైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. 4. సంబందిత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సరైన అనుమతులు కలిగి ఉన్న ఏజెన్సీలకు అప్పగించాలి. 5. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి ఉన్న కంపెనీకి సరఫరా చేసేటటువంటి సరఫరాదారులు మాత్రమే ఇట్టి దరఖాస్తు అప్లై చేసుకోవాలి. 6. ఏజెన్సీ యొక్క సరైన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు. 7. సీల్డ్ టెండర్లను స్వీకరించే లేదా తిరస్కరించే అధికారం కమిషనర్, తూంకుంట వారికి ఉంటుందని తెలియజేయనైనది. 8. కమిషనర్, తూంకుంట మున్సిపాలిటీ పేరిట తీసిన రూ.5,000/- డిడి తో పాటుగా ఈవోఐని సమర్పించాలి. 9. కలెక్షన్ మరియు సైంటిఫిక్ డిస్పోజల్ కోసం ఏడాది కాల పరిమితి కోసం చెల్లింపునకు సంబంధించి కోటెడ్ ఫీ మొత్తాన్ని ఏజెన్సీ వారు చెల్లించాల్సి ఉంటుంది. **సీల్డ్ రూపంలో ఆసక్తి వ్యక్తీకరణ సమర్పణ కోసం చివరి తేది:22.04.2025, సమయం: 03:00గం.** ఇతర వివరముల కోసం అన్ని పని దినములలో తూంకుంట మున్సిపాలిటీలో మంజూరు సెక్షన్లో సంప్రదించాలని కోరడమైనది. సంప్రదించాల్సిన నెంబర్: కమిషనర్ - 7995307809.

సం/- కమిషనర్, తూంకుంట మున్సిపాలిటీ, మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లా.
DIPR R.O. No. : 569-PP/CL/ADVT/1/2025-26, Date: 19-04-2025

## వచ్చే ఏడాది ఫైడల్ కాస్ట్రో శతజయంతి చిలీలో జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరణ



ప్రఖ్యాత క్యూబా విప్లవకారుడు, చారిత్రక నాయకుడు ఫైడల్ కాస్ట్రో శతజయంతి వేడుకలు వచ్చే ఏడాది ఆగస్టు నెలలో జరుగుతాయి. ఈ సందర్భంగా బయోగ్రాఫర్, క్యూబా రచయిత్రి కటియుస్కా బ్లాంకో కాస్ట్రో జీవిత చరిత్రను గ్రంథస్థం చేశారు. ఈ పుస్తకాన్ని శాంటియాగోలో ఆవిష్కరించారు. ''అల్ ద టైమ్ ఆఫ్ సెడార్ ట్రీస్''అనే శీర్షికతో బ్లాంకో రాసిన పుస్తకాన్ని చిలీ రాజధాని శాంటియాగోలో పుస్తకావిష్కరణ జరిగింది. ఫైడల్ కాస్ట్రో కుటుంబ సంపూర్ణ చరిత్రను ఈ సంపుటాల్లో ఆవిష్కరించినట్లు ఈ సందర్భంగా కటియుస్కా బ్లాంకో చెప్పారు. కాస్ట్రో బాల్యం, యవ్వనం, విప్లవజీవితం, క్యూబా ప్రభుత్వాధిపత్యం, ఆయన కుటుంబ నేపథ్యమంతా ఈ సంపుటాల్లో ఉందని ముందుమాటలో గిల్లెర్మో కాబ్రెరా రాశారు. ''ఇరవై సంవత్సరాలక్రితం నేను చిలీకి వచ్చాను, కాస్ట్రో గురించి లెక్కకుమిక్కిలిగా అనేక వ్యాసాలు రాసిన జర్నలిస్టు వోలోడియా టిటెల్బోయిమ్ సహాయంతో రైటర్స్ సొసైటీని ఆధారం చేసుకుని ఈ గ్రంథాన్ని రచించినట్లు ఆమె చెప్పారు. ఫైడల్ కాస్ట్రో వంటి ప్రపంచ ప్రఖ్యాత నాయకుడి జీవితం, ఆయన గమనం, స్ఫూర్తి, పనివిధానం, ఆలోచనల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలనుకునేవారికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందని ఆమె చెప్పారు. మూమెంట్ ఆఫ్ సాలిడారిటీ విత్ క్యూబాకు చెందిన సభ్యులు, లాటిన్ అమెరికా వైద్యకళాశాల గ్రాడ్యుయేట్ వృత్తినిపుణులు, అనేకమంది మేధావులు, జర్నలిస్టులు, అభ్యుదయవాదులు, దౌత్యవేత్తల సమక్షంలో వారి ప్రశంసలమధ్య ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. క్యూబా విప్లవకారుడు, రాజకీయవేత్త కాస్ట్రో 1926వ సంవత్సరం ఆగస్టు 13వ తేదీన జన్మించారు. 2016 నవంబరు 25వ తేదీన తన 90వ యేట క్యూబా రాజధాని హవానాలో కన్నుమూశారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఆయన శతజయంతి కార్యక్రమాలు జరుగుతాయి.

## బిహార్‌లో 'ఇండి' కూటమి పటిష్టత

ఈ సంవత్సరం చివర్లో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఇండియా, ఎన్‌డిఎ కూటములు రెంటికీ ప్రతిష్టాత్మకం. ఇరువైపులా వ్యూహ–ప్రతివ్యూహాలు అప్పుడే ప్రారంభమైనాయి. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ని ముఖ్యమంత్రిగా ఎన్‌డిఎ కొనసాగిస్తుందా అన్నది సందిగ్ధం. ఇండియా కూటమికి ప్రజలు అధికారం అప్పగిస్తే ముఖ్యమంత్రి ఎవరన్న ప్రశ్న ఉండనే ఉంది. నితీశ్‌కుమార్ పలుకుబడిపై ఆధారపడి రాష్ట్రంలో దీర్ఘకాలంగా అధికారంలో భాగస్వామిగా ఉన్న బిజెపి ఈ పర్యాయం ముఖ్యమంత్రి పదవికి గురిపెట్టిం ది. ''2025 నుంచి 2030 వరకు మళ్లీ నితీశ్' అనే పోస్టర్లు జెడియు కార్యాలయం ముందు దర్శనమివ్వగా, 'ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి (బిజెపి) నాయకత్వం కింద ఎన్‌డిఎ బిహార్ ఎన్నికలు గెలుస్తుంది' అని హర్యానా ముఖ్యమంత్రి నయబ్‌సింగ్ సైని ప్రకటించటం గందరగోళం సృష్టించింది. సైని ఒబిసి నాయకుడు. నితీశ్‌కుమార్ మోదీ ప్రభుత్వంలో ఉప ప్రధాని అవుతారని అంతకుముందు మరో బిజెపి నాయకుడన్నారు. అయితే బిజెపి మాత్రం అధికారికంగా ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నాయకత్వంలోనే ఎన్‌డిఎ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రకటించింది. నమ్మండి–నమ్మకపోండి!. బిజెపి సొంత అభ్యర్థి ముఖ్యమంత్రి పదవి చేబట్టని ఏకైక హిందీ భాషా రాష్ట్రం బిహార్. మహారాష్ట్ర అనుభవం మన కళ్లముందే ఉంది. శివసేనను చీల్చి ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బిజెపి, ఆయన నాయకత్వంలోనే కూటమి ఎన్నికలకు వెళ్లింది. ఎన్నిక ల్లో సహజంగానే పెద్దపార్టీగా అవతరించిన బిజెపి షిండేను పక్కకుతోసి ముఖ్యమంత్రి పదవి చేబట్టింది. బిహార్‌లో అలాగే జరగదన్న గ్యారంటీ ఏదీ లేదు. ఎల్‌జెపి(రావిలాస్) తిరిగి ఎన్‌డిఎలోకి వచ్చినందున, బిజెపియే అత్యధిక సీట్లకు పోటీ చేస్తుంది. గతంలో లాగా చెరిసగం సీట్లు డిమాండ్ చేసే స్థితిలో నితీశ్‌కుమార్ లేరు. ఎన్నికల తర్వాత పూర్తికాలమో, సగం కాలమో బిజెపికి ముఖ్యమంత్రి పదవి అప్పగించక తప్పదు. బిహార్‌లో ఎన్‌డిఎ ప్రచార కార్యక్రమానికి ప్రధాని, హోంమంత్రి స్వయంగా సారథ్యం వహిస్తున్నారు. అనుకూల మీడియాను ఉపయోగించి ఇండియా కూటమిలో గందరగోళం సృష్టించటం కూడా వారి వ్యూహంలో భాగమే.

ప్రజాపక్షం
20-04-2025, ఆదివారం


ఇదిలా ఉండగా, ఈనెల 17వ తేదీన పట్నాలో జరిగిన భాగస్వామ్య పక్షాల నాయకుల సమావేశంలో ఇండియా కూటమి సమన్వయకర్తగా ఆర్‌జెడి నేత, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవటంతో బిజెపి ప్రేరేపిత దుష్ప్రచారానికి తెరపడింది. ఈ సమావేశానికి ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ(ఎంఎల్) నాయకులతోపాటు ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న ముఖేశ్ సహానీ వికాశ్ శీల్ ఇన్‌సాన్ పార్టీ (విఐపి) కూడా హాజరుకావటం విశేషం. లోక్‌జనశక్తి చీలిక గ్రూపు నాయ కుడు పరశ్ పాశ్వాన్ ఇండియా కూటమిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఒబిసి, ఇబిసి, ముస్లింలు, యాదవుల తో బలమైన అలయెన్స్‌ను కాంగ్రెస్ తలపెడుతున్నది. తేజస్వి అంతకుముందు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ నేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలతో చర్చలు జరిపి వచ్చారు.

ఎవరు ఎవరికీ బి టీమ్ కాదన్న సంకేతం ఇవ్వటానికే ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. అయితే ఆర్‌జెడి ఆధిపత్యాన్ని అదుపు చేసేందుకే సమన్వయ కమిటీ ఎన్నిక. ఉమ్మడి కనీస కార్యక్రమం తయారీకి కూడా కమిటీని వేశారు. సమష్టి నాయకత్వంతో పనిచేస్తామని ప్రజలకు సంకేతం ఇచ్చారు.

సమన్వయ కమిటీ నాయకులు జిల్లాలు, తాలూకాలకు తమ ప్రచారాన్ని ఐక్యంగా తీసుకెళతారు. ప్రజలు విశ్వాసముంచి మెజారిటీ సీట్లు ఇస్తే పెద్దపార్టీ నాయకుడైన తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి కావటం సహజ పరిణామం.

## జీవిత పాఠాలను నేర్పిన పుస్తకాలే మననేస్తాలు!

ఏమిటండీ...? మొబైల్ ఫోన్ చూస్తూ మీలో మీరే ముసిముసి నవ్వు లు చిందిస్తున్నారు అంది భార్య...తన భర్తతో కొంచెం ఆశ్చర్యంగానే...! ఏం లేదోయ్..నీ మనవడు విక్రమ్ నాకు వాట్సాప్ లో పెద్ద టెక్ట్ మెసేజ్ పంపాడు ఈసారి..! అన్నాడు సంతోషంతో ఆ భర్త. విక్రమ్...!మీకు వాట్సాప్‌లో సందేశం పంపడమా..! వింతగా ఉంది ఏమిటో కొంచెం సూక్ష్మ ంగా చెప్పండి అని అడిగింది భార్య. తాతయ్య...చాలా సందర్భాల్లో మీకు పెద్దగా స్నేహితులు లేరనీ, ఎప్పుడూ పుస్తకాలే చదువుతుంటారనీ ఎగతాళి చేసేవాణ్ణి. మీరు సున్నితంగా నవ్వుతూ నాకు చెప్పారు. పుస్తకాలే మన నేస్తాలనీ..! నీకది ఎప్పుడో ఒకప్పుడు అర్థమవుతుందిలే..రా..! అనేవారు. నా జీవితంలో జరిగిన కొన్ని అనూహ్య సంఘటనల వల్ల ఇప్పుడర్థమైంది.




మనతో అధికారమో, అవసరమో, డబ్బో, ఉద్యోగమో వున్నప్పుడు మన వెంట వున్న వాళ్లందరూ మన శ్రేయోభిలాషులు కాదనీ. మనం బాగున్నప్పుడు కాకుండా మనం బాధలో ఉన్నప్పు డు ఉండే చాలా కొద్దిమందే మన స్నేహితులనీ..! ఇక అప్పటినుంచి పుస్తకాలు చదవడం ఆరంభించాను. ఆ పుస్తకాలు నాకు ఎన్నో జీవితపాఠాలను చెప్పాయి. స్ఫూర్తి గీతాలను వినిపించాయి. ఓటమి విలువను తెలియజేశాయి. ఆనందాన్నియిచ్చాయి. బ్రతకడం నేర్పాయి. పదిమందికి సాయపడేలా దారిని చూపాయి. నా వెంట నడుస్తూ నన్ను ముందుకే నడిపిస్తున్నాయి. థాంక్యూ తాతయ్య అని పంపాడు నీ మనవడు అంటూ ఆ భర్త ఇంట్లోని తన లైబ్రరీ రూమ్ లోకి వెళ్ళిపోయాడు. మన ఇంట్లో లైబ్రరీ అంటే మరో దేవాలయం వంటిదే కదా మరి..!

ఈ డిజిటల్ ఇ–బుక్స్ యుగంలో విక్రమ్ లాగా చాలా మంది సోషల్ మీడియా లోనో లేదా తమ వ్యక్తిగత జీవితాల్లోనో ఎంజాయ్‌మెంట్ ఎంటర్‌టైన్‌మెంట్ చేస్తూ దాన్నే స్నేహం అనుకుంటున్నారు. పుస్తకాలు చదవడం ఎప్పుడో మానేశారు. బతుకు పుస్తకాన్ని ఆస్వాదిస్తూ, శోధించడాన్ని పక్కన పెట్టేశారు. మొబైల్ ఫోన్లో సాంకేతికత చాటున తమ సమయాన్ని వినియోగిస్తూ కొన్ని సందర్భాల్లో విచక్షణను సైతం వదిలేస్తున్నారు. పుస్తకాల ప్రాధాన్యత గురించి చెప్పే వాళ్ళు కూడా చాలా తక్కువ అయ్యారు. పుస్తకాలను బహుమతులుగా ఇచ్చే పాత రోజులు మళ్లీ మన నవ ప్రపంచంలో పుట్టుకు రావాలి. మొక్కలు నాటి పెంచడం, పుస్తకాలు చదువు తూ జీవించడం మన నిత్యజీవితపు సంఘటనలు కావాలి. అలా జరిగితేనే బాధ్యత గల యువతరం మన సమాజ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషిస్తుంది.

సత్యం, అహింస విశిష్టతను టాల్‌స్టాయ్ రచనల నుండి స్ఫూర్తి పొంది సత్యాగ్రహంను నడిపాననీ, జీవిత సంగ్రామంలో నిరాశ నిస్పృహలు ఆవరించినప్పుడూ భగవద్గీత నన్ను నడిపించిందనీ అంటారు మన మహాత్మా గాంధీజీ. ఆయన ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్ పెరిమెంట్స్ విత్ ట్రూత్' పుస్తకం ప్రపంచంలోని అన్ని ప్రముఖ భాషల్లో అనువాదం చేయబడింది. కోట్లమంది జీవితాలకు మార్గదర్శిగా నిలిచింది. దశాబ్దాలుగా కాలగమనానికి ముందుమాటలు రాస్తూనే ఉంది. ఎంతోమంది విశ్వవిఖ్యాతలకు గాంధీజీ ఆత్మకథ ఓ స్ఫూర్తి దీపపు శిఖరం. ప్రపంచ స్థాయి ఉద్యమాల్లో నేటికీ గాంధీజీ జీవన విధానాలే మనకు దారి చూపుతున్న మైలు రాళ్ళుగా వున్నాయి.

పేపర్ బాయ్ నుంచి నేను మీకు సందేశాన్నిచ్చే స్థాయిలో వున్నానంటే ''లైట్ ఫ్రమ్ మెనీ ల్యాంప్స్'' పుస్తకం నా జీవితాన్ని విపరీతంగా ప్రభావితం చేసిందంటారు భారతరత్న అబ్దుల్ కలాం. రామేశ్వరంలో ఓ సామాన్యునిగా ఆరంభమైన ఆయన జీవన పయనం అంతరిక్షంలో రాకెట్ల స్థాయిని దాటి వేల సంవత్సరాల చరిత్ర కలిగి 100 కోట్ల జనాభా ఉన్న దేశానికి రాష్ట్రపతిని చేసింది. కలాం ఆత్మకథ 'ది వింగ్స్ ఆఫ్ ఫైర్' నేటి తరం చదవాల్సిన పుస్తకం. మన ఆలోచనలకు రెక్కలనిచ్చి మన జీవితంలో ఎన్నో అద్భుతాలను సృష్టించేలా చేస్తుంది ఆ పుస్తకం.

దాస్ కాపిటల్, లాంగ్ వాక్ టు ఫ్రీడం, ఐ యామ్ మలాలా, ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్, వార్ అండ్ పీస్, ది ఫౌంటెన్ హెడ్ ప్రిన్సిపియా, గీతాంజలి, మహా ప్రస్థానం, అటామిక్ హాబిట్స్, రిచ్ డాడ్ పూర్ డాడ్ వంటి ఎన్నో వివిధ రకాల పుస్తకాలు మానవ పురోగతినే శాసించాయి. కాలానికి నూతన రహదారులను సృష్టించి నవ చరిత్రను రాశాయి. మనిషితనానికి దిక్సూచిగా నిలిచాయి. జీవన విలువలను సమాజంలోకి చొప్పించాయి. అందుకే మనం కూడా మన పిల్లలకు మంచి పుస్తకాలు కానుకగా ఇద్దాం. మనం చదువుతూ వాళ్ళ నీ చదివి ద్దాం. 'పుస్తకం అంటే ఒక ప్రపంచం. దాన్ని చదివితే ఎంతోమంది మహానుభావులు మానవ మనుగడకోసం చేసిన త్యాగాల ఫల పరిమళాలు మనల్ని విజ్ఞాన ప్రపంచంలో విహరింపజేస్తాయి అంటారు విఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్'. చెట్లు ఆక్సిజన్ ఇస్తూ మనల్ని బ్రతికిస్తున్నాయి. పుస్తకాలు మనకు ఆలోచనలనిస్తూ జీవించమని బోధిస్తున్నాయి.

(ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం)



ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

# జనం అలవాటుపడ్డ మత్తుమందు – మతం



డాక్టర్ దేవరాజు మహారాజు

సామాన్యుల్ని నోరెత్తకుండా ఉంచడానికి మతం ఒక మంచి మత్తు మందు. సామాన్యులు తిరగబడి ధనికుల్ని చంపకపోవడానికి కూడా అదే కారణం!

– నెపోలియన్ బోనపార్టీ

విషయాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి భారత దేశంలో ఐదంచెలుగా ఉన్న విద్యా విధానాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయిన వారు డాక్టర్లు, ఇంజనీర్లు అవుతారు. లేదా కంప్యూటర్ రంగంలోనో, ఇతర సాంకేతికరంగంలోనో, పరిశోధనారంగంలోనో రాణిస్తారు. ఇక రెండో శ్రేణిలో ఉత్తీర్ణులయిన వారు యం.బి.ఎ చేస్తారు. పరిపాలనా విభాగంలో చేరుతారు. వీరికి ఉన్న సౌకర్యమేమంటే, ప్రథమ శ్రేణిలో ఉత్తర్ణులయిన వారిమీద అజమాయిషి చేయడం. తృతీయ శ్రేణిలో ఉత్తర్ణులయిన వారు రాజకీయాల్లో చేరి మంత్రులు, ఎం.ఎల్.ఎ లవుతారు. ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై వివిధ రంగాలలో పనిచేస్తున్న వారిపై వీరు పెత్తనం చేస్తారు. అసలు ఎక్కడా దేనిలోనూ పాస్ కాని వారు డాన్‌లు, గుండాలు అవుతారు. బిజినెస్ మాగ్నెట్ లు అవుతారు. వీరు పైన చెప్పుకున్న మూడు రకాల వాళ్ళని కీలుబొమ్మలు చేసి ఆడిస్తారు. డిగ్రీలు కూడా సరిగ్గా లేనివాళ్ళు దేశ వ్యాపారరంగాన్ని గుప్పెట్లో పెట్టుకుని ప్రభుత్వాల్ని ఆటపట్టిస్తున్న విషయం అందరికీ తెలిసిందే! అయితే ఇది ఇంకా అయిపోలేదు. దేశంలో మరోరకం వాళ్ళు కూడా ఉన్నారు. అసలు మొత్తానికి చదువులేని అజ్ఞానులు – స్వాములు, మత గురువులూ అవుతున్నారు. సమాజంలోని అన్ని వర్గాల వారిని తమ పాదాల దగ్గరికి రప్పించుకుంటారు. ముందు చెప్పుకున్న నాలుగురకాలవారు తమ విచక్షణా జ్ఞానాన్ని పక్కనపెట్టి వీరి ఆశీస్సులకోసం 'క్యూ'లు కడుతుంటారు. ఈ 'క్యూలు కట్టే' వారిలో లోగడ రాజ్యమేలిన వారు, ఇప్పుడు ఏలుతున్న వారూ కూడా అందరూ ఈ కోవలోకే వస్తారు. కొద్దిపాటి మినహాయింపులు తప్ప – ఇక సామాన్య ప్రజానీకం సంగతేమిటీ? వాళ్ళు పెద్దవాళ్ళను అనుకరించాలనుకుంటారు గానీ, స్వయంగా, స్వంతంగా ఆలోచిద్దామని అనుకోరుకదా? తామూ మనుషులమేననీ, తమకూ మెదడుందని, దానితో కాస్త ఆలోచిద్దామ ని అనుకోరుకదా? అయితే ఈ సామాన్యులు తాము చాలా శక్తి సంపన్నులమని గుర్తుంచుకోవాలి. ప్రతిదీ హేతుబద్ధంగా ఆలోచించగలగాలి..

మతం ఎంత నిర్దాక్షిణ్యంగా సామాన్యులతో ఫుట్‌బాల్ ఆడుకుంటుందో గమనించడానికి, మీకిక్కడ ఒక మళయాళ సినిమాను పరిచయం చేస్తున్నాను. ఇందులోనివన్నీ వాస్తవ జగత్తులో జరిగినవే.. జరిగేవే! సినీ దర్శకుడు పి.ఎ.బేకర్, సంఘటనలన్నింటినీ ఒక క్రమంలో అమర్చుకుని ఒక కథ తయారు చేసుకున్నాడు. సినిమా పేరు 'మునిముజ హక్కం': తొలిసారి విడుదలయినప్పుడు ఘనవిజయం సాధించిన సినిమా అది – 'ఈ దేశంలో కులం మారదు. మతం మారుతుంది' అని అన్నాడొక ఆధునిక కవి. నిజమే! ఈ దేశంలో ఏ మతం నుండి ఏ మతంలోకైనా మారొచ్చు. కాని, మారితే ఒరిగేదేమిటీ? ఇంతటి సువిశాలమైన దేశంలో విశాల దృక్పథం కరువైనప్పుడు? జీవన ప్రమాణాలు మెరుగవకుండా, పైపై మెరుగులకోసం పరుగెడుతున్నప్పుడు? ఈ విషయాన్ని ఒక వ్యక్తి జీవితంలోంచి పరోక్షంగా ఫోకస్ చేసిన మళయాళ చలన చిత్రం – మునిముజ హక్కం (ఘంటారావం). హైదరాబాదు నిజాం పరిపాలన కాలంలో తెలంగాణలో చాలామందికి బలవంతంగా ముస్లిం మతం ఇప్పించారు. ఏవో కొన్ని ప్రయోజనాలకు ఆశపడి 1984–85లలో తమిళనాడులో వందలమంది క్రైస్తవం స్వీకరించారు. కాలక్రమేణా అడపాదడపా పత్రికల్లో మత మార్పిడి ప్రసక్తి వస్తూనే ఉంది. సంకుచితత్వానికి మతం ప్రతీకగా నిలబడుతోందన్న విషయాన్ని చిత్ర దర్శకుడు తేటతెల్లం చేశాడు.

ఈ కథలోని అంశాల్ని జాగ్రత్తగా పరిశీలించిన వారికి మతాలు మనిషికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయన్నది స్పష్టంగా అర్థమౌతుంది. చిత్రకథ ఇలా ఉంది:

జోస్ పాల్ తన వ్యక్తిత్వాన్ని తాను నిలుపుకోవాలనుకుని ఎన్నో వైరుధ్యాల మధ్య జరిపిన జీవిత పోరాటమే ఇది...జోస్ పాల్ వందలకొద్ది అనాథ పిల్లల మధ్య పెరుగుతాడు. అదొక చిన్న ప్రపంచం. స్కూలు పరీక్షల్లో అత్యుత్తమంగా ఉత్తీర్ణుడవుతాడు. ఫాదర్ ఫ్రాన్సిస్ దయతో, ప్రేమాభిమానాలతో కాలేజిలో చేరతాడు. అప్పుడే మొట్టమొదటిసారి ఈ విశాల ప్రపంచంలో అడుగు పెడతాడు. మొదట్లో కళాశాల అతనికి దిగ్భ్రమ కలిగిస్తుంది. తబ్బిబ్బు చేస్తుంది. ఒక ధనవంతుల అమ్మాయి పరిచయమయ్యాక అతనికి కొంత కొత్త ధైర్యం వస్తుంది. అతని మీద అతనికి నమ్మకం పెరుగుతుంది. కాని అనాథ శరణాలయంలో పెరిగాడని తెలిసిన మరుక్షణమే ఆ అమ్మాయి అతణ్ణి ఒంటరిని చేస్తుంది. అతని హృదయం విలవిల్లాడుతుంది. మనసు ముక్కలవుతుంది. అనాథ శరణాలయానికి తిరిగి వచ్చేస్తాడు. సుపరిచితమైన వాతావరణంలో రోజులు గడుస్తుంటాయి.

అప్పుడు అతని పూర్వపు కుటుంబంలోని పినతండ్రి వెతుక్కుంటూ వచ్చి – జోస్ తమ వాడని గుర్తించి, ఆధారాలు చూపించి తమ ఇంటికి తీసుకుపోతాడు. దాంతో జోస్ పాల్ మరో కొత్త ప్రపంచంలోకి అడుగు పెడతాడు. పినతండ్రి ధనవంతుడైనందువల్ల భోగభాగ్యాలకు కొదువ ఉండదు. కుటుంబ సభ్యుల మమతానురాగాలకు లోటుండదు. కాని చిన్నప్పటి నుండి తనలో పెరిగిన క్రైస్తవ మత విశ్వాసాల్ని వదులుకోవాలని వాళ్ళు నెమ్మదిగా ఒత్తిడి చేస్తుంటారు. అప్పటికే ఆ ఇంట్లో అతని పేరు జోస్ నుండి రాజన్‌గా మారుతుంది. ఆ కుటుంబానికి సన్నిహితుడైన ఒక పెద్ద మనిషి కూతురు వాళ్ళింటికి తరచూ వస్తుంటుంది. ఆమెతో రాజన్‌కు మంచి పరిచయం ఏర్పడుతుంది. చాలా దగ్గరైపోతారు. కానీ, అతను క్రైస్తవ మతాచారాల ప్రకారం పెరిగాడని తెలియగానే, ఆ హిందువుల అమ్మాయి అతణ్ణి, అతడి స్నేహాన్ని తిరస్కరిస్తుంది. ప్రతిచోటా వంచించబడి అతను బతుకుదెరువు కోసం మద్రాసు చేరుకుంటారు. మళ్ళీ జోస్‌గా గుర్తింపబడతాడు. అతనితో పనిచేసే క్రైస్తవ మిత్రుడొకడు సదభిప్రాయం వెలిబుచ్చి, తన చెల్లెలినిచ్చి పెళ్ళి చేయడానికి సిద్ధమౌతాడు. కానీ, జోస్ మూడోసారి కూడా దెబ్బతింటాడు. పేరు జోస్ అయినప్పటికీ, క్రైస్తవ మత విశ్వాసాలతో పెరిగినప్పటికీ అతని పూర్వీకులు హిందువులని తెలియగానే.. ఆ స్నేహితుడు ప్రయత్నం మానుకుని తన చెల్లెలి నివ్వడానికి నిరాకరిస్తాడు. జోస్ తనకు తానుగా గుర్తింపబడాలని, ఒక మనిషిగా సమాజంలో స్థానం సంపాదించుకోవాలనీ చేస్తున్న ప్రయత్నం కొనసాగుతూనే ఉంటుంది. చలన చిత్రం ముగుస్తుంది. చలనచిత్రంలో కథ ముగిసిందేమో గానీ, సమాజంలో ముగియలేదు. మత ప్రబోధకులు చేసే ఆగడాలు, అఘాయిత్యాలు రోజూ వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. మతంతోకాదు, మనిషితత్వంతో గుర్తింప బడాలన్న ధ్యాస జనంలో రావాలి.

మత ప్రబోధకుల గిమ్మిక్కులు చూడండి. పాస్టర్ ప్రవీణ్ కొబ్బరి నూనెతో ఎయిడ్స్ తగ్గించానని ప్రకటించుకున్నాడు. నేనేం తక్కువ తిన్నానా అని సిస్టర్ షోరాన్ అదే కొబ్బరి నూనెతో చచ్చిన మనిషిని బతికించానని ప్రకటించుకుంది. కొబ్బరి నూనె ముక్కులో వేస్తే ఆగిన శ్వాస మళ్లీ ప్రారంభమైందట. ఏమీ డ్రామా ఇదీ ? దీన్ని రుజువు పరచగలరా? ఈ చెప్పే వాళ్ళు, జనమంతా వెర్రిగొడ్డులేనని అనుకుంటున్నారా? సిగ్గు వదిలిన వాళ్ళు ప్రకటించుకోవడం, అమాయకులు వాటిని నమ్మడం – మత మౌఢ్యానికి బలి కావడం ఏమి సబబూ? పైగా ఈ మధ్య ఇలాంటి మత మోసగాళ్ళను రాజకీయాలు బలపరుస్తున్నాయి. రాజకోణీయ నాయకుల్ని మత బోధకులు బలపరుస్తున్నారు. దీంతో విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. దీన్ని ముందే ఊహించిన డా.బి.ఆర్. అంబేద్కర్ ఓ మాట అన్నారు – ''మతంలో భక్తి ఉంటే అది పునర్జన్మ రాహిత్యానికి కారణమవుతుందని నమ్ముతారు. అదే భక్తి రాజకీయాల్లో ఉండి వ్యక్తి ఆరాధనకు దారితీస్తే, చివరకు అది దుర్మార్గపు చండశాసనానికి దారి తీస్తుంది'' అని. ఈ విషయం ప్రాంతీయ పార్టీల్లోనే కాదు, జాతీయ పార్టీల్లో కూడా ప్రస్ఫుటంగా చూస్తున్నాం. అయితే అన్ని విషయాల్లో లాగానే, ఈ విషయంలో కూడా కొద్దిపాటి మినహాయింపులున్నాయి. కొన్ని ఎగరలేని పక్షులు తాము ఎగురగలమని చెప్పుకోవడానికి చప్పుడు వచ్చేలా రెక్కలు టపటపలాడిస్తాయి. కొద్దిగా పైకిలేచి కిందపడతాయి. కానీ, నింగిలోని పక్షులు అంత ఎత్తులో అవలీలగా, హాయిగా విహరిస్తుంటాయి. గొప్పదనం చెప్పుకుంటే వచ్చేది కాదు. శక్తి సామర్థ్యాలను అనుసరించి వచ్చేదే గుర్తింపు. డబ్బాలోని గులకి రాళ్ళలాగా కొందరు తమ మనసులోని మాటతో జనాన్ని హింసిస్తుంటారు. తమ రెక్కల చప్పుడు అన్ని మాధ్యమాల్లో వినపడాలనుకుంటారు. ప్రపంచంలో మహా మేధావులెంతో మంది ఉన్నారు. వారు మాధ్యమాల్ని దుర్వినియోగం చేయరు. వారిధ్యాసంతా వారుచేసే పనిమీదే ఉంటుంది. ప్రచార ఆర్భాటాల మీద ఉండదు. పాపం.. మతానికీ, రాజకీయాలకు ఇది తప్పనిసరిగా కావల్సి వస్తోంది!

మతం ఎప్పుడూ మానవుడి స్థాయిని, హుందాతనాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛని తక్కువచేసి చూపుతుంది. ఒక నాయకుడు ఒక యూనివర్సిటీ విద్యార్థి తలకు వెలకడతాడు. మరొకరు ఓ రాష్ట్ర ముఖ్యమంత్రి తల నరికితే ఇన్ని కోట్లిస్తానంటాడు. అమెరికా అధ్యక్షుణ్ణి తిట్టుకోవడం అలా ఉంచి, దేశంలో జరుగుతున్నదేమిటో ఆలోచించాలి. బీభత్సమైన ప్రకటనలు, హత్యలు, దాడులు, నిందితులు దొరకకపోవడాలు ఎందుకు జరుగుతున్నాయా? దేశం సుభిక్షంగా, ప్రశాంతంగా ఏమైనా ఉందా? ఏకంగా దేశానికి ఓ రంగు పులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయి కదా? అమాయక జనానికి తీపి మాటలు చెప్పి, మోసపు వాగ్దానాలు చేయ గలిగినవాడే ఎన్నికలలో గెలిచి వస్తున్నాడు కదా? మసిపూసి మారేడుకాయ చేయగలిగిన వాడే నేత అవుతున్నాడు కదా? 'డబ్బులు పంచిన వాడికే మన ఓటు' – అన్న ఆలోచన సామాన్యుల్లో ఉంటే పరిస్థితి మారదు. ప్రచార ఆర్భాటాలకు జనం ఆకర్షింపబడుతూ ఉన్నంతకాలం పరిస్థితి మారదు. జనంలో హేతుబద్ధత పెంచాలి. ఏది నిజం? ఏది అబద్ధం? అన్నది ఆలోచించగలగాలి. హేతువాదులు, మానవ వాదులు, సైన్సు కార్యకర్తలు మరింత బాధ్యతతో జనం మూఢత్వాన్ని పటా పంచలు చేయగలగాలి. కష్టమైన పనే! కాని, అసాధ్యం కాదు.

సద్దా హుస్సేన్ (25)జార్ఖండ్ యువకుడు ఇంజనీరింగ్ పాసయి ఉద్యోగంకోసం నలభై కంపనీలు తిరిగాడు. అందరూ తిరస్కరించారు. కారణం అతనికి ఒకప్పటి ఇరాక్ పాలకుడైన సద్దాం హుస్సేన్ పేరు ఉండడమే! విసిగిపోయి ఆ యువకుడు పేరు మార్చుకునే అవకాశమివ్వాలని హైకోర్టు నాశ్రయించాడు. సమాజంలో మూర్ఖత్వం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఇటీవల అన్ని పత్రికల్లో ప్రముఖంగా వచ్చిన ఈ వార్తను గుర్తు చేస్తున్నాను. పెద్ద చదువులు చదివి, పెద్ద కంపనీలకు సిఇఓలయిన వారికే ఇంగిత జ్ఞానం ఉండడం లేదు. పేరు, వస్త్రధారణ కాదు చూడాల్సింది. కష్టపడి పనిచేసే తత్వం చూడాలి. నిజాయితీ చూడాలి. అతడి ఆలోచనలూ దృక్పథాలూ చూడాలి. అయినా ఆ యువకుడి నేపథ్యం తెలుసుకోవడం పెద్ద కష్టమైన పనేకాదు. ఎవడూ తనకు తానుగా పుట్టినప్పుడు పేరు పెట్టుకోలేదు కదా? పెద్దలెవరో పెట్టిన పేరుకు ఈయువకుడి జీవితం నాశనం కావాలా?ప్రతివాణ్ణీ ఏదో మతానికీ ప్రతినిధిగా తప్ప, మనిషిని మనిషిగా చూడలేమా?

సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

# బిఆర్‌ఎస్ తిరిగి టిఆర్‌ఎస్ అవుతుందా?

సరిగ్గా వచ్చే ఆదివారం నాటికి తెలంగాణ రాష్ట్ర సమితి 25వ ఏటలోకి అడుగుపెట్టబోతుంది. దీనిని పురస్కరించుకొని వరంగల్‌లో భారీ సభ ను ఏర్పాటు చేస్తున్నారు గులాబీ నేతలు. ఆ సభకు తెలంగాణ ప్రజల ఇంటి పండుగగ నామకరణం చేశారు. తొమ్మిదిన్నరేళ్ళ పరిపాలన తరువాత ప్రతిపక్షంలోకి వచ్చి, పార్టీ ఏర్పాటైనప్పటి నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికలలో ఒక్క స్థానం కూడా పొందని నేపథ్యంలో ఈ సభ జరుగుతోంది. అయితే, ఉద్యమ ఆకాంక్షలతో 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో ఏర్పాటైన నాటి తెలంగాణ రాష్ట్ర సమితికి, అధికారం అనుభవించి, మరోసారి అధికారం కోసం ప్రయత్నిస్తున్న పార్టీకి ప్రజల్లో ఆదరణలో ఎలాంటి తేడా ఉందో ఒక్కసారి పరిశీలిద్దాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000 సంవత్సరంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ వివక్షపై తీవ్ర స్థాయిలో అధ్యయనం చేశారు. అప్పటికే కొన్ని సంస్థలు తెలంగాణ ఏర్పాటు కోసం సభలు నిర్వహిస్తూ ప్రజలను సమాయత్తం చేస్తున్నాయి. ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న తెలంగాణ కాంక్ష కెసిఆర్ తన డిప్యూటీ స్పీకర్ పదవికి, శాసనసభ సభ్యత్వానికి, టిడిపి సభ్యత్వానికి రాజీనామా చేసి టిఆర్‌ఎస్‌ను ప్రకటించిన తరువాత రాజకీయ రూపం తీసుకున్నదనేది కాదనలేని నిజం.

టిఆర్‌ఎస్‌ను ప్రజలు ఒక రాజకీయ పార్టీగా కాకుండా ఉద్యమ ఆకాంక్ష వేదికగా చూసి, అక్కున చేర్చుకున్నారు. ఆ పార్టీ ఎన్నికల గుర్తు మారినా పట్టం గట్టడమే నిదర్శనం. తొలుత సిద్ధిపేట ఉప ఎన్నికల్లో కెసిఆర్ బస్సు గుర్తుపై పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగలి పట్టిన రైతు గుర్తుపై పోటీ చేసి రెండు జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాలు, పెద్ద సంఖ్యలో మండలపరిషత్‌లను గెలుచుకొని సంచలనం సృష్టించింది. చివరకు కారు గుర్తును ఎన్నికల గుర్తుగా ఎంచుకున్నా కూడా ప్రజలు ఆదరించారు. ఇదంతా తెలంగాణ ఆవశ్యకతను సులభతరంగా సామాన్యుల భాషలో వివరించడంలో కెసిఆర్ వాహకంగా నిలవడమే కారణం. అందుకు ఆయనకు సమాచారం అందించిన వారిలో ప్రొఫెసర్ జయశంకర్, అనేక మంది ఉద్యమకారులు ఉన్నారు. తెలంగాణలోని అన్ని పార్టీల నాయకులు తెలంగాణ జెఎసి నేతృత్వంలో ప్రజలను ఏకీకృతం చేయడంతో 2014లో తెలంగాణ స్వప్నం సాకారమైంది. వెంటనే వచ్చిన ఎన్నికల్లో ఉద్యమ ఫలితాన్ని టిఆర్‌ఎస్‌కు అధికారం కట్టబెట్టడం ద్వారా ప్రజలందించారు.

కానీ, అసలు కథ అధికారంలోకి వచ్చిన తరువాతే మొదలైంది. తెలంగాణ ఆత్మనే ప్రజాస్వామ్య ఆకాంక్ష. అలాంటిది ప్రజాస్వామ్యాన్ని, ధర్నాలు, నిరసనలను అణచివేసి, చివరకు జెఎసి చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ ఇంటి తలుపుల పగులగొట్టించి మరీ అరెస్టు చేయడం తెలంగాణ సమాజం మరిచిపోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంఎల్‌ఏల ఫిరాయింపులకు బాధితురాలైన టిఆర్‌ఎస్, అధికారంలోకి వచ్చిన తరువాత అదే బాటలో నడిచి ప్రతిపక్ష పార్టీల ఎంఎల్‌ఏలను టోకుగా ఫిరాంచేలా పురికొల్పడం తెలంగాణ ప్రజలకు పెద్ద దిగ్భ్రాంతి. వీటన్నిటికీ ప్రజలు ఎన్నికల్లో సమాధానం చెప్పేందుకు సిద్ధపడగా 2018లో శాసనసభకు జరిగిన ముందస్తు ఎన్నికల్లో చంద్రబాబును బూచిగా చూపడం, ప్రతిపక్షాల సీట్ల పంపకంలో ఆలస్యం జరగడాన్ని సానుకూలంగా మలుచుకొని టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ రెండవసారి ముఖ్యమంత్రి అయ్యారు. మూడింట రెండొంతుల మెజారిటీ లభించినా మళ్ళీ ప్రతిపక్ష ఎంఎల్‌ఏల ఫిరాయింపును ప్రోత్సహించడం విస్మయం కలిగించింది. రెండవసారి అధికారంలో అణిచివేత మరింత పెరిగిపోయింది. ఎన్నిక ఏదైనా ఊహించని మొత్తంలో డబ్బులు వెదజల్లి అధికారమే పరమావధిగా పాలన సాగింది. చివరకు ప్రతిపక్షం ఉనికే లేకుండా చేద్దామనేంతగా ప్రయత్నించారు కెసిఆర్. దీంతో ఉద్యమకారులు, శక్తులు టిఆర్‌ఎస్ నుంచి దూరమయ్యాయి. వంత పాడిన ఉద్యమకారులకే కాకుండా, నాడు ఉద్యమాన్ని వ్యతిరేకించి టిఆర్‌ఎస్ పంచన చేరిన వారికి అందలాలు అందాయి.

ఏ తెలంగాణ తన అడ్రస్‌గా మారిందో ఆ పదాన్ని తొలగిస్తూ 2022 అక్టోబర్ 5న భారత రాష్ట్ర సమితిగా టిఆర్‌ఎస్ రూపాంతరం చెందినప్పటి నుంచి ఆ పార్టీ తెలంగాణ ప్రజల నుంచి అనుబంధాన్ని కోల్పోవడం ప్రారంభించింది. కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్నాటక, పశ్చిమ బెంగాల్‌లోని ప్రాంతీయ పార్టీ ముఖ్యమంత్రులను, ప్రతిపక్ష నేతలను కెసిఆర్ కలిసారు. వారి విశ్వాసం చూరగొనడంలో విఫలమై చివరకు స్వంతంగా ఏర్పాటు చేసుకున్న బిఆర్‌ఎస్‌ను విస్తరించేందుకు మహారాష్ట్ర, ఒడిషాలో మాజీ ఎంఎల్‌ఏలను, వివిధ పార్టీల నాయకులను పెద్ద ఎత్తున చేర్చుకున్నారు. దాని వెనుక డబ్బు సంచులు ఉన్నాయనేది జగద్విదితమే. జాతీయ పార్టీగా ఎదగాలని ఎన్ని రకాలుగా ప్రయత్నాలు సాగించినా వృథా ప్రయాసగానే మిగిలిపోయింది. చివరకు 2023 డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పరాజయం పాలైంది. చివరకు స్వయంగా ముఖ్యమంత్రి పదవిలో ఉండి పోటీ చేసిన రెండవ స్థానం కామారెడ్డిలో కూడా కెసిఆర్ ఓడిపోయారు.


రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

శాసనసభలో గణనీయమైన స్థానాలతో ప్రతిపక్ష పార్టీ హోదా లభించినప్పటికీ ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఏడాదిన్నరలో రెండుసార్లు లాంఛనంగా తప్ప శాసనసభకు హాజరవుతున్న దాఖలాలు లేవు.

### ఆత్మావలోకనం చేసుకునేనా?

ప్రతిపక్ష పాత్రలోకి వచ్చిన తరువాత బిఆర్‌ఎస్ తీరు ఇంకా మారకపోవటాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కలిగిన బిఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు శాసనసభకు రాకపోవడాన్ని, ప్రధాన స్రవంతికి దూరంగా ఉండడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. అడపాదడపా ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో పార్టీ ముఖ్యులు, నేతలను కలిసినప్పుడు ప్రకటనలు రావడమే తప్ప క్రియాశీలంగా కనిపించడం లేదు. ఇక బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆరే అంతా తానై పార్టీని నడుపుతున్నారు. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు సోషల్ మీడియానే ఆ పార్టీ నమ్ముకుంది. చివరకు తప్పుడు ఫోటోలు, వీడియోలను కూడా వాడుకుంటున్న ఉదంతాలు మొన్న కంచ గచ్చిబౌలి వ్యవహారంలో వెలుగులోకి వచ్చింది. శాసనసభ ఎన్నికల తరువాత వచ్చిన లోక్‌సభ ఎన్నికలలో బిఆర్‌ఎస్ ఓట్లు భారీగా పడిపోయాయి, ఒక్క సీటూ గెలవలేక అవమానం పాలైంది. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గం ఎన్నికకు కూడా ఆ పార్టీ దూరంగా ఉంది. ఇదంతా కూడా తమ బలహీనత బైటపడొద్దనే ఎత్తుగడలో భాగమేనని పరిశీలకులు భావిస్తున్నారు.

అయితే, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఎరిగిన, మూలమూలలు తెలిసిన పార్టీగా బిఆర్‌ఎస్ మనుగడ సాగించాల్సిన అవసరం ఉన్నది. అందుకు ఆ పార్టీ తనను తాను ప్రజాస్వామికీకరించుకొని, ప్రజల పార్టీగా మలచుకోవాలి. అలాగే విశ్వసనీయత పెంచుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అధికారం, అవసరం కోసం ఆపద్ధర్మంగా అప్పటికప్పుడు అనేక నాయకులు, రాజకీయ పార్టీల వద్దకు వెళ్ళి మద్దతు తీసుకోవడం, అక్కర తీరగానే దూరం జరగడాన్ని చూసాం. అదే ఆ పార్టీకి చేటు చేసి, చివరకు అధికారం కోల్పోయేలా చేసింది. రాజకీయాలకు అర్థాన్ని మార్చేసి, అధికార దుర్వినియోగంతో ధన, ఫిరాయింపు రాజకీయాలను పరాకాష్ఠకు చేర్చడాన్ని, నిరసనలు, ఉద్యమాలను అణచివేయడం ప్రజల స్మృతి పథంలో సజీవంగానే ఉంది.ఆ ముద్ర తొలగిపోవడం అంత సులభం కాదు. ఆ అప్రజాస్వామిక చర్యలకు తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఓటములను ధైర్యంగా ఎదుర్కొని, ప్రజాస్వామ్య విధానంలో సాగితేనే భవిష్యత్తు ఉంటుంది. తెలంగాణ ఏర్పాటే ఏకైక లక్ష్యంగా ఏర్పాటైన తన సిద్ధాంతాలను నిర్వచించుకోవాల్సిన ఆశ్యకత నేడు ఏర్పడింది. ఎందుకంటే, ఆ పార్టీ కాంగ్రెస్, బిజెపి కూటములతో జతగట్టిన సందర్భాలు తెలుసు. వర్తమాన రాజకీయాలలో సైద్ధాంతిక పోరాటాలకు ప్రాముఖ్యత పెరిగిన తరుణంలో అవకాశవాదంతో కాకుండా ఎటువైపు ఉండాలో ప్రజలకు తెలియజెప్పాల్సిందే. అన్నిటికంటే ముఖ్యంగా పార్టీ మకుటంలో తెలంగాణ ఊసే లేకుండా పోవడంతోనే ఆపార్టీ తెలంగాణ ప్రజలకు దూరమవడం ప్రారంభమైందని, ఆ పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. ఈ మధ్య కరీంనగర్‌లో కెటిఆర్ దాన్ని దాదాపు అంగీకరిస్తూ మాట్లాడారు. భారత రాష్ట్ర సమితిగా పేరు మారినప్పటికీ మా పార్టీ డిఎన్‌ఎ, తెలంగాణ వాదం ఎప్పటికీ మారలేదని అన్నారాయన. అవాస్తవాలతో సోషల్‌మీడియా ఉద్యమాలు, అనునిత్యం కాంగ్రెస్‌పై తిట్ల దండకంకంటే, ప్రజలతో మమేకమై, తిరిగి విశ్వాసం పొందేందుకు ప్రయత్నించాలి. ఇప్పుడు కెసిఆర్ పార్టీ మూడవ దశలో ఉంది. మొదటి దశలో 2001 నుంచి 2014 వరకు ఉద్యమ పార్టీ, రెండవ దశలో 2014 నుంచి 2023 వరకు అధికార పార్టీ. ప్రస్తుత మూడవ దశలో ప్రతిపక్ష పార్టీగా ఉన్న తనను తాను పునర్‌నిర్వచించుకొని, ముందుకుసాగితే మేలు. తమ పార్టీ బలహీనపడుతున్న మేరకు బిజెపి బలపడటం వాస్తవం. కాంగ్రెస్ పట్ల గుడ్డి వ్యతిరేకతతో బిజెపి ప్రమాదాన్ని ఎదిరించకపోతే రాష్ట్రానికే కాదు, దేశానికే చేటు చేసిన వారవుతారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీలో భవనం కూలి నలుగురు మృతి

**న్యూఢిల్లీ :** ఈశాన్య ఢిల్లీలోని శక్తి విహార్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున బహుళ అంతస్తుల నివాస భవనం కూలిపోవడంతో నలుగురు మృతి చెందగా, అనేక మంది శిథిలాల కింద చిక్కుకున్నారని అధికారులు తెలిపారు. దేశ రాజధానిలోని ముస్తఫాబాద్ ప్రాంతంలో భవనం కూలిపోయిన ప్రదేశంలో ఉన్న దాదాపు 11 మందిని ఏజెన్సీలు రక్షించాయి. శిథిలాల కింద సుమారు 810 మంది ఉన్నట్లు భావిస్తున్నారు, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (నార్త్ ఈస్ట్) సందీప్ లామా తెలిపారు. దయాల్పూర్ పోలీస్ స్టేషన్‌లో తెల్లవారుజామున 3.02 గంటల ప్రాంతంలో భవనం కూలిపోయినట్లు గుర్తించిన గాలి నంబర్ 1, శక్తి విహార్‌కు పోలీసు బృందం చేరుకుంది. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఢిల్లీ అగ్నిమాపక సేవలు, అంబులెన్స్ సేవల నుండి సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయని అధికారులు తెలిపారు. భవనం కూలిపోయినప్పుడు దాదాపు 22 మంది చిక్కుకున్నట్లు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు 15 మందిని రక్షించి జిటిబి ఆసుపత్రికి తరలించామని, వారిలో నలుగురు మరణించారని వైద్యులు ప్రకటించారని తెలిపారు. ఆరుగురు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారని, ఐదుగురు చికిత్స పొందుతున్నారని వారు తెలిపారు.

## 'సత్యం, ధైర్యం' నెహ్రూ నుంచే వారసత్వంగా పొందాం: రాహుల్



**న్యూఢిల్లీ :** అణచివేతను ఎదిరించడానికి, స్వేచ్ఛను పొందటానికి జవహర్‌లాల్ నెహ్రూ గొప్ప వారసత్వం భారతీయులకు ధైర్యాన్ని ఇచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశ మొదటి ప్రధాన మంత్రి, తన ముత్తాత నుండి 'సత్యం–ధైర్యం' వారసత్వంగా పొందానన్నారు. పార్టీ నాయకుడు సందీప్ దీక్షిత్‌తో స్వేచ్ఛగా జరిగిన సంభాషణను రాహుల్ ఎక్స్, యూట్యూబ్ ఛానెల్‌లో పోస్టు చేశారు. సత్యం కోసం అన్వేషిస్తానని, ఎట్టి పరిస్థితుల్లోనూ దానికి మద్దతు ఇస్తానన్నారు. నెహ్రూ మనకు రాజకీయాలు నేర్పించలేదు, భయాన్ని ఎదుర్కోవటాన్ని, సత్యం వైపు నిలబడటాడాన్ని నేర్పించారన్నారు. అణచివేతను ఎదిరించడానికి, చివరికి స్వేచ్ఛను పొందటానికి ఆయన భారతీయులకు ధైర్యాన్ని ఇచ్చాలని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆయన గొప్ప వారసత్వం సత్యాన్ని నిరంతరం అన్వేషించడంలో ఉందన్నారు. ఈ వీడియోను గాంధీ యూట్యూబ్ ఛానెల్‌లో 'సత్యం–ధైర్యం నేను నెహ్రూ నుండి వారసత్వంగా పొందినది' అనే శీర్షికతో అప్‌లోడ్ చేశారు. నెహ్రూ కేవలం రాజకీయ నాయకుడు కాదు. ఆయన ఒక అన్వేషకుడు, ఆలోచనాపరుడు, చిరునవ్వుతో ప్రమాదంలోకి నడిచి బలంగా బయటపడిన వ్యక్తి అని గాంధీ వీడియో ఆ వీడియోలో పేర్కొన్నారు. 'అన్వేషించడం, ప్రశ్నించడం, ఉత్సుకతో పాతుకుపోవడం ఇది నా రక్తంలోనే ఉంది. నా జీవిత లక్ష్యం కూడా సత్యాన్ని అన్వేషించడమే. ఆ సత్యాన్వేషణే ఆయన జీవితాన్ని నిర్మించిన ప్రాథమిక సూత్రం. భయంతో స్నేహం చేయడం ఎలా అని గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, పటేల్, బోస్ బోధించేది అదే. గాంధీజీ సత్యం తప్ప మరేమీ లేని సామ్రాజ్యాన్ని నిలబెట్టారు' అని అన్నారు. ఇక తన అమ్మమ్మ, మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ, నెహ్రూ గురించిన అనేక కథలు తనకు చెబుతూ ఉండేవారని అన్నారు. నెహ్రూ ఎలా తనకు ఇష్టమైన పర్వతాలలో మంచు గడ్డల మధ్య వెళ్లి ప్రమాదంలో పడిపోవడం, జంతువులు ఎలా కుటుంబంలో భాగంగా ఉండేవి, వ్యాయామాన్ని ఎంత మాత్రం మిస్ అవ్వకుండా ఉండేవారని చెప్పేవారని తెలిపారు. ' నా తల్లి ఇప్పటికీ తోటలో పక్షులను గమనిస్తారు. నేను జూడో చేయగలను. ఇవి కేవలం అభిరుచిలే కాదు. అవి మనం ఎవరో తెలుసుకోవడానికి చెప్పే ఒక కిటికీ లాంటివి. మేం అన్నింటిని గమనిస్తూ చుట్టూ ఉన్న ప్రపంచంతో మమేకం అయి ఉంటాం. నిశ్శబ్ద శక్తితోనే సవాళ్లను ఎదుర్కొనే ప్రవృత్తిని కలిగి ఉన్నాం. బిల్‌గేట్స్ లాంటి పెద్దవాళ్లు లేదా సామాన్యులతో మాట్లాడుతున్న ఒకే విధమైన ఆసక్తితో మాట్లాడతాం. నిజమైన నాయకత్వం అంటే నియంత్రణ కాదు. అది మనిషిపై ప్రేమ. ప్రస్తుత భారతదేశంలో సత్యం అనేది లేకపోయినా నేను నిజం కోసమే నిలబడతా' అని రాహుల్ గాంధీ చెప్పారు.

# హిందీ తప్పనిసరి అమలును అంగీకరించం

### మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ థాక్రే స్పష్టీకరణ



**ముంబయి :** మహారాష్ట్రలో 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు హిందీని తప్పనిసరి చేయాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే హిందీని తప్పనిసరి చేయాలనే నిర్ణయాన్ని తమ పార్టీ అంగీకరించబోదని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే స్పష్టం చేశారు. శివసేన (యుబిటి) కార్మికుల విభాగం భారతీయ కామ్‌గర్ సేన నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ తమ పార్టీకి హిందీ భాషపై విముఖత లేదని, కానీ దానిని ఎందుకు బలవంతంగా అమలు చేస్తున్నారని థాక్రే ప్రశ్నించారు. ప్రజలను ఏకం చేయనివ్వకపోవడం, వారిని నిరంతరం ఒత్తిడిలో ఉంచడం, తద్వారా వారు తమ ఆందోళనలతో మునిగిపోవడమే పాలక బిజెపి ధ్యేయమని థాక్రే ఆరోపించారు. మహారాష్ట్రలో హిందీని తప్పనిసరి చేయడానికి తాము ఎంత మాత్రమే అనుమతించబోమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మరాఠీ, ఇంగ్లీష్‌మీడియం పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు రెండు భాషలను అభ్యసించే పద్ధతికి భిన్నంగా హిందీని తప్పనిసరి మూడవ భాషగా చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో థాక్రే వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమను ప్రేమతో అడిగితే అన్నీ చేస్తామని, అలా కాకుండా ఏకపక్షంగా ఏదైనా అమలు చేస్తే దానిని తాము కచ్చితంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. హిందీ నేర్చుకోవాలని ఎందుకు బలవంతం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మరాఠీ నేర్చుకోవడాన్ని తప్పనిసరి చేయాలని నిర్ణయించింది తమ ప్రభుత్వమేనని మాజీ ముఖ్యమంత్రి గుర్తుచేశారు. రాష్ట్రంలో నివసించాలనుకుంటే జై మహారాష్ట్ర అనాలి అని థాకరే సూచించారు. మహారాష్ట్ర, మరాఠీని అంతం చేయాలనుకునే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందా అని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ నేతృత్వంలోని మహాయుతిని లక్ష్యంగా చేసుకుని ఆయన నిలదీశారు. ఉప ముఖ్యమంత్రి, శివసేన నాయకుడు ఏక్‌నాథ్ షిండేపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. మరాఠీకి అన్యాయం చేసేవారికి ఆ పార్టీ లొంగిపోయి, బాల్ థాక్రే వారసత్వానికి వారసులమని ఎలా చెప్పుకోగలదని ప్రశ్నించారు. ముంబయికి వచ్చే ఏ వ్యక్తి అయినా తప్పనిసరిగా మరాఠీ నేర్చుకోకపోవచ్చునని గతంలో సీనియర్ ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు భయాజీ జోషి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నగరంలోని గుజరాతీ మాట్లాడే శివారు ప్రాంతమైన ఘట్‌కోపర్‌లో మరాఠీని తప్పనిసరి చేయాలని సేన (యుబిటి) చీఫ్ అన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025పై, ముస్లిమేతరులు వక్ఫ్ బోర్డులో నియమితులవుతున్నందున తమ పార్టీ చట్టాన్ని వ్యతిరేకించిందని ఆయన పేర్కొన్నారు. హిందూ మత సంస్థలకు హిందువులు కాని వారిని ఈ ప్రభుత్వం నియమించదని హామీ ఏమిటి? వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని అడిగిన ప్రశ్న ఇదే అని థాక్రే వ్యాఖ్యానించారు. ఒక ముఖ్యమంత్రిగా, రాష్ట్రంలో కార్మిక కోడ్‌ల అమలును తాను నిలిపివేసినందున తన ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. భారతీయ కామ్‌గర్ సేన యూనియన్ ఉనికిలో ఉన్న కార్యాలయాల్లో, ఖాళీలను భర్తీ చేయడానికి పార్టీ వ్యక్తులను నియమించాలని సూచించారు.

## జెఇఇ మెయిన్‌లో 110 మంది ఫోర్జరీ

### విత్‌హెల్డ్‌లో ఫలితాలు
### జెఇఇ మెయిన్ ఫలితాలు విడుదల చేసిన ఎన్‌టిఎ

**న్యూఢిల్లీ :** జెఇఇ మెయిన్ పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శుక్రవారం అర్ధరాత్రి విడుదల చేసింది. ఈ సందర్భంగా పరీక్షల్లో 110మంది ఫోర్జరీ చేసినట్లు గుర్తించామని పేర్కొంది. అందుకే వారి ఫలితాలను విత్‌హెల్డ్ చేసినట్లు వెల్లడించింది. కాగా, జెఇఇ మెయిన్ ఫలితాల్లో 24 మంది అభ్యర్థులు 100 శాతం స్కోరు సాధించారు. ఇందులో తెలంగాణ నుంచి బనిబ్రత మాజీ, హర్ష్ ఎ.గుప్తా, అజయ్ రెడ్డి ఉండగా, ఎపి నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ ఉన్నారు. ఇక అత్యధిక టాప్ స్కోర్లు సాధించిన రాష్ట్రాల్లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉంది. అయితే ప్రస్తుత ఫలితాల్లో ఇచ్చిన సాధారణ పర్సంటైల్, జెఇఇ అభ్యర్థులు సాధించిన మార్కుల పర్సంటేజ్‌తో సమానం కాదని ఎన్‌టిఎ అధికారులు తెలిపారు. రెండు సెషన్లలో జరిగిన పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులను 0–100 మధ్య స్కోరుగా మారుస్తారని తెలిపారు. జెఇఇ (మెయిన్) సెషన్ 1, 2 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు కేటాయించారు. అలా జెఇఇ (మెయిన్) పేపర్–1, పేపర్–2లో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను జెఇఇ (అడ్వాన్స్‌డ్)కు ఎంపిక చేస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50 లక్షల మందిని జెఇఇ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటిఇల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం మే 18న జరిగే జెఇఇ (అడ్వాన్స్‌డ్) పరీక్షకు ఏప్రిల్ 23 నుంచి మే 2 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. కాగా దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐటిలు, ట్రిపుల్ ఐటిల్లో బిఇ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో పేపర్ 1 పరీక్షలు జరిగాయి.

## భారత్ రానున్న ఎలాన్ మస్క్



**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అత్యంత టెక్ బిలియనీర్లలో ఒకరైన ఎలాన్ మస్క్ ఈ ఏడాది చివర్లో భారత పర్యటనకు రానున్నట్లు ప్రకటించారు. ఈ పర్యటన, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత తెలుపడం విశేషం. ఇది అమెరికా, భారత్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విషయంలో కీలకం కానుంది. దురదృష్టవశాత్తు, టెస్లాలో పనిభారం కారణంగా భారతదేశ పర్యటన ఆలస్యం అయిందన్నారు. కానీ ఈ సంవత్సరం చివర్లో జరిగే పర్యటన కోసం తాను చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎలాన్ మస్క్ భారత పర్యటన ఇప్పటికే అనేక సార్లు వాయిదా పడింది. వాస్తవానికి ఎలాన్ మస్క్ ఏప్రిల్ 21–22 తేదీలలో భారతదేశానికి రావాల్సి ఉంది. కానీ 21, 22 తేదీల్లో భారతదేశంలో ఉంటారని ముందుగా వార్తలు వచ్చాయి. ఈ సమయంలో ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కూడా కలుస్తారని, దీంతో పాటు, టెస్లా సిఇఒ, అతని బృందం ప్రభుత్వ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులను కలుస్తారని వార్తలొచ్చాయి. కానీ ఇవి ఖరారు కాలేదు. దీనికి ముందు కూడా మస్క్ భారత్ పర్యటన పలు మార్లు వాయిదా పడింది.

### మోదీ, మస్క్ రెండుసార్లు భేటీ

ఈ క్రమంలో ఎలాన్ మస్క్ వచ్చే పర్యటన భారతదేశానికి మొదటి సందర్శన అవుతుంది. ఈ సమయంలో మస్క్ భారతదేశంలో టెస్లా తయారీ కర్మాగారం గురించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. మోదీ, మస్క్ ఇప్పటివరకు రెండుసార్లు కలిశారు. వీరిద్దరూ 2015లో కాలిఫోర్నియాలోని టెస్లా ఫ్యాక్టరీలో కలిశారు. ఆ తర్వాత జూన్ 2023లో న్యూయార్క్‌లో కలుసుకున్నారు. ఎలాన్ మస్క్ భారతదేశంలో 2 నుంచి 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి గురించి ప్రణాళికలను ప్రకటించనున్నారు.

### టెస్లాతోపాటు..

టెస్లా భారతదేశంలో కార్లను తయారు చేయడమే కాకుండా, ఇక్కడి నుంచి ప్రపంచ దేశాలకు కూడా ఎగుమతి చేయనున్నారు. మరోవైపు చైనా, అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న వేళ టెస్లా కార్ల తయారీకి ఇప్పుడు భారత్ మంచి అవకాశమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. దీంతో పాటు ఇండియాలో తయారు చేసి విదేశాలకు కూడా ఎగుమతి చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే ఐఫోన్లను తయారు చేస్తున్న భారత్, త్వరలో టెస్లా కార్లను కూడా సిద్ధం చేయనుంది. ఇది కాకుండా, మస్క్ త్వరలో భారతదేశంలో ఉపగ్రహ ఆధారిత బ్రాడ్‌బ్యాండ సేవలను కూడా ప్రారంభించవచ్చు. స్టార్‌లింక్‌కు నియంత్రణ అనుమతులు చివరి దశలో ఉన్నాయని, త్వరలోనే ఆ కంపెనీ లైసెన్స్ పొందే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి.

## కులగణన నివేదిక 'అత్యంత శాస్త్రీయ కసరత్తు'

### విపక్షాల విమర్శల నేపథ్యంలో కర్ణాటక హోంమంత్రి కితాబు



**బెంగళూరు :** కులగణన ప్రాధాన్యతను పలు రాష్ట్రాలు గుర్తిస్తున్నాయి. కులగణన 'ఒక అత్యంత శాస్త్రీయమైన కసరత్తు' అని శనివారం కర్నాటక హోం శాఖ మంత్రి జి.పరమేశ్వర ప్రస్తుతించారు. మంత్రులు అందరి అభిప్రాయాలు విన్న తర్వాత దీని అమలు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ సర్వేపై ప్రతిపక్షాలు సహా సమాజంలోని వివిధ వర్గాలు అశాస్త్రీయం అని వ్యక్తం చేయడంతో వ్యతిరేకత వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఆయన తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. దానిని తిరస్కరించి తాజాగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనాభా గణన నివేదికపై చర్చించేందుకు గురువారం ఏర్పాటు చేసిన కేబినెట్ సమావేశం అసంపూర్తిగా ముగియడంతో ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై కేబినెట్ మే 2న మరోసారి చర్చించడానికి షెడ్యూల్ ఖరారైంది. 'మంత్రులు అందరినుంచి వారి అభిప్రాయాలను తెలుసుకుంటారు. కేబినెట్ సమావేశంలో కొంతమంది చర్చల్లో పాల్గొంటారు. చర్చలు కొనసాగుతాయి. ప్రతీ ఒక్కరూ వారి అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ప్రతీ ఒక్కరి అభిప్రాయం విన్న తర్వాత కేబినెట్ నిర్ణయం తీసుకుంటుంది. కుల గణనపై నిర్ణయం కేబినెట్ తీసుకుంటుంది. వ్యక్తులకు సంబంధించిన అభిప్రాయం, ముఖ్యమంత్రులది కాదు' అని పరమేశ్వర చెప్పారు. ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడతూ'కొన్ని సామాజిక వర్గాలు తమ జనాభా బలాన్ని సర్వేలో తక్కువ చేసి చూపించారని ఆరోపించినట్లు తెలియజేశారు. సర్వేను అధ్యయనం చేసిన తర్వాత ఇది ఒక అత్యంత శాస్త్రీయమైన కసరత్తు అని హోంమంత్రి పరమేశ్వరన్ చెప్పారు. బోర్‌వెల్‌ను తవ్వేవ్యక్తి లోతుగా తవ్విన తర్వాతనే సరిపోను నీరు పడేది లేదా ఎండిపోయేది చెప్పగలరు' అని ఉదాహరించారు. లోతుగా చూస్తేనే కదా స్పష్టంగా అర్థమయ్యేది అని దానితో పోల్చి చెప్పారాయన. ప్రతీ కుటుంబం నుంచి డేటా సమీకరించిన ఆ కుటుంబంతో పాటు సూపర్‌వైజర్ల సంతకాలు కూడా తీసుకోవడం జరిగిందని, 1.37 కోట్ల కుటుంబాల డేటా లభ్యమైందని, సంబంధించి వారి సంతకాలు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.గురువారం జరిగిన సమావేశంలో కొంతమంది మంత్రులు సర్వేలో రిజర్వన్లు అశాస్త్రీయంగా ఉందని, కాలం చెల్లిందని, కొన్ని సామాజిక వర్గాల జనాభా బలాన్ని తగ్గించి చూపారని అభిప్రాయాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రులు అందరూ వారి అభిప్రాయాలను నేరుగా లేదా రాతపూర్వకంగా చెప్పాలని కోరారు. వివిధ సామాజికవర్గాలు ముఖ్యంగా కర్ణాటకలోని రెండు ప్రధాన సామాజికవర్గాలు వొక్కళిగలు, వీరశైవ లింగాయత్‌లు సర్వే అశాస్త్రీయంగా జరిగిందని, దానిని తిరస్కరించి తాజా సర్వే నిర్వహించాలని గట్టిగా డిమాండ్ చేశారు. సమాజంలోని వివిధ వర్గాలు తీవ్రస్థాయిలో తమ అభ్యంతరాలను లేవనెత్తారు. ముఖ్యంగా వారు అధికార కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తమ బలమైన గొంతుకను వినిపించారు. సర్వే కోసం దాదాపు రూ.160కోట్ల డబ్బును వెచ్చించినట్లు ప్రభుత్వం తెలియజేసింది. ఎ క్కడో ఒక మూలకు కూర్చుని కులగణన నివేదికను రూపొందించారని ప్రతిపక్షం విమర్శించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని విమర్శలను, వ్యాఖ్యలను పరిగణనలోనికి తీసుకుంటుందని హోం మంత్రి సమాధానం ఇచ్చారు. దానిపై ప్రభుత్వం చర్చించింది. పలు దఫాలుగా చర్చలు, అభిప్రాయాల సేకరణ అనంతరం ప్రభుత్వంఅంగీకారం తెలియజేసిన తర్వాత వివిధ కార్యక్రమాలు, పథకాలను కులగణన నివేదిక ఆధారంగా సిద్ధం చేస్తారు అని పరమేశ్వర తెలియజేశారు.

## ఆఫ్రికా నుంచి మరో 8 చీతాలు



**న్యూఢిల్లీ :** దేశంలో అంతరించిపోయిన చీతాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాజెక్ట్ చీతాలో భాగం గా ఆఫ్రికా నుంచి విడతల వారీగా చీతాలను భారత్‌కు తీసుకొస్తున్నారు. గతంలో దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి విడతల వారీగా చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తాజా గా మరో 8 చీతాలు రానున్నాయి. దక్షిణ ఆఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి రెండు విడతల్లో చీతాలను భారత్‌కు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమాచారం ఇచ్చింది. తొలి విడతలో భాగంగా మేలో 4 చీతాలను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత మరో నాలుగు చిరుతలను తీసుకొచ్చేందుకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. దేశంలో చి రుత ప్రాజెక్ట్ కోసం ఇప్పటివరకు రూ.112 కోట్ల కు పైగా ఖర్చు చేసినట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అందులో 67 శాతం మధ్యప్రదేశ్‌లో చిరుత పునరావాసానికి వెళ్లిందని వెల్లడించా రు. కాగా, ప్రాజెక్ట్ చీతాలో కేంద్రం 2022, సెప్టెంబర్ 17న నమీబియా నుంచి ఎనిమిది చిరుతలను భారత్‌కు తీసుకొచ్చింది. ఆ తర్వాత ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చిరుతలు వచ్చా యి. వీటన్నింటినీ మ ధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌లో వదిలారు. ఆ తర్వాత అనారోగ్య కారణాలతో పలు చిరుతలు మృతి చెందాయి. ప్ర స్తుతం కూనో పార్క్‌లో 26 చిరుతలు ఉన్నాయి. వాటిలో 14 భారత్‌లో జన్మి ంచిన కూన పిల్లలు. దేశంలో 71 ఏండ్ల క్రితం అంతరించి పోయిన చీతాలను ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరిస్తున్నది. ఇ ందులో భాగంగా ఆఫ్రికా దేశాల నుంచి విడుతల వారీగా దిగుమతి చేసుకుంటున్నది. కాగా, ప్రపంచంలోని 7 వేల చిరుతల్లో అధికంగా దక్షిణాఫ్రికా, నమీబియా, బోట్స్‌వానాలో నివసిస్తున్నాయి. అయితే నమీబియాలోనే చీతాలు అత్యధికంగా ఉన్నాయి.

# ఆదివాసుల అతిపెద్ద గిరిజన తిరుగుబాటు

### ఇంద్రవెల్లి నెత్తుటి గాయనికి 44ఏళ్ళు

అడివి పైన హక్కు కోసం, అటవీ ప్రకృ తి, సంపద ఆధారంగా బతికే నైతిక భరోసా కోసం, ఆకు కోసం పోడు కోసం, ఆదివాసీ సాంస్కృతిక జీవనం కోసం చైతన్య వంతులవుతు, ఒక సంఘం పెట్టుకొని ఒక సభ జరుపుకుందా మని సమావేశమైన అడివి బిడ్డలపై అమానుషంగా, నిర్దాక్షిణంగా జరిపిన కాల్పుల ఘటన దేశాన్ని కుదిపేసింది. ఇంద్రవెల్లి లో జరిగిన ఈ మారణ కాండకు నేటికీ 44ఏళ్ళు నిండాయి. జగిత్యాల జైత్ర యాత్ర స్ఫూర్తి 1980లో ఆవిర్భవించిన పీపుల్స్ వార్ నేతృత్వం లో జిల్లా లో ఆదివాసుల లో రగల్ జెండా రెపరెపలు ఉపందుకుంటున్నాయి. తూర్పున కార్మిక రంగంలో రైతంగం లో, పశ్చిమం లో గిరిజనుల లో అలజడి చైతన్యం మొదలయింది. గిరి పుత్రు లు వారి సమస్యల పై, సౌకర్యలపై, సర్కార్ ను ఎదిరించాలనే మాటలు పొరకల సార్ల దగ్గర వింటున్నారు. చదువుకున్న విద్యావంతులు గిరిజనుల దగ్గరికి పోయి వారి బాష నేర్చుకుని, వారి మాట నేర్చుకుని వారిని సంఘటీతం చేస్తూ గుడాల ల్ల సంఘాలను ఏర్పరిచింద్రు.

ఈ నేపథ్యం లోనే 1981లో గిరిజన రైతుకూలి సంఘాన్ని ఏర్పరిచిండ్లు. గోండులు పోడు వ్యవసాయం చేసుకుంటే అడ్డు పడుతున్న ఫారెస్ట్ వారిని ఎ దిరిస్తున్నారు. చెట్టుకొడితే, ఆకుల కొస్తే కూలి రేట్ల కోసం అడుగుతున్నారు.

ఈ పరిస్థితుల్లో పోడు పై అడ్డుకునే చౌకి దార్ల కు అడ్డుకట్ట వేశారు. గోండు గ్రామలైన పిప్పల్దరి ధన్నాపూర్, కేస్లీ గూడ, తిప్పిరి, పిట్ట బొంగారం, ఇంకా పలు గ్రామాలలో గిరిజనుల పోడు ను అడ్డుకొని కేసులు పెట్టారు. అయినా వెనుకడుగు వేయ కుండా, గిరిజనులు జొన్న మక్క, సొయా కందులు, వేసి పండిస్తుంటే అడ్డుపడుతున్న వాచ్‌మెన్ లను వెళ్లగొట్టిండ్లు. ఫారెస్ట్ వాళ్ళు గిరిజనుల పోడును అడ్డుకోడానికి పోలీస్ ల కు ఫిర్యాదు చేసారు. గుడాల్లోకి పోలీస్ లను ఉసిగొల్పారు. ఉట్నూరు సమీప గ్రామాల లోకి వచ్చి గిరిజనుల పై జులుం చేస్తూ వారి పోడు వ్యవసాయం అడ్డుకున్న ఏడుగురు పోలీస్ లను తరిమికొట్టారు. దీనితో గోండు గ్రామాల ల దాడులు పెరిగాయి.

గిరిజనులు అన్నల అండ తోనే ఎదురు తిరుగు తున్నారని,వీరి వెనుక విప్లవ కార్యకలాపాలు జరుగుతున్నాయనే ఉద్దేశ్యం తో ఆదివాసుల పై పోలీస్ దాడులు, నిఘా కుడా ఎక్కువయ్యింది.ఈ నేపథ్యం లో గిరిజనులు తమ హక్కుల పై పోరాడేందుకు,సంఘటితం అయ్యేందుకు ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలనీ నిర్ణయించి గిరిజన రైతు కూలీ సంఘాన్ని ఏర్పాటు చేసారు. సంఘానికి తోడుసం కట్టీ ని కార్యదర్శి గా పెట్టారు. జిల్లాలోని అన్ని తాలూకా లలో గ్రామాల్లో సంఘాన్ని నిర్మించాలనే లక్ష్యం తో గిరిజన రైతు కూలి సంఘం తొలి సభ ను ఇంద్రవెల్లి లో ఏర్పాటు చేయాలనీ ఏప్రిల్ 20 1981 జరుప తలపెట్టారు.ఈ సభను విజయవంతం చేసేందుకు వార్ ముఖ్యనాయకులు కటకం సుదర్శన్, గజ్జల గంగారాం లు మొదటి నుంచి పూర్తి స్థాయి లో కార్యక్రమాలు నిర్వహించారు. నెల రోజుల ముందే సన్నాహాక కార్యక్రమాలు ప్రారంభించారు. పార్టీ ఏర్పడిన ఏడాది లో ప్రజాసంఘాల నిర్మాణాన్ని బలోపేతం చేస్తూ వచ్చారు. కోల్‌బెల్ట్ ఏరియా బెల్లంపల్లి చెందిన 20మంది ముఖ్య నాయకులు కార్య కర్త లను కాగజ్ నగర్ నుంచి కొందరిని వీరు ఆదిలాబాద్ పంపించి ఆదిలాబాద్ లో దగ్గర ఉండి ఉండి మొత్తం సభ ఏర్పాట్ల ను పర్యవేక్షించారు. ఉట్నూరు, నిర్మల్, గుడిహేట్నూర్, ఖానాపూర్, బోథ్, జైనూర్ చుట్టుప్రక్క ప్రాంతాలలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేసారు. హిందీ, తెలుగు లో కరపత్రాలు, పోస్టర్లు ముద్రించారు.చందాలు ఉట్నూరు నిర్మల్ లో అడిగితే ఎక్కడ వసూలు కాలేదు ఇంద్రవెల్లిలోనే కొంత వసూల్ అయ్యాయి.

ఆదిలాబాద్ ఉట్నూర్ లో వాల్ రైటింగ్, చేసారు. సభకు వక్తలుగా కొబాడ్ గాంధీ, ఎం. రంగనాథ్, పౌరహక్కుల సంఘం, వరవరరావు, అర్‌ఎస్‌యు అధ్యక్షుడు లింగమూర్తి, గద్దర్ పేర్లు ముద్రించారు. ఆదిలాబాద్ డిగ్రీ కాలేజీ ముందు ప్రత్యేకంగా ఒక రూమ్ తీసికొని ఇంద్రవెల్లి సభ సన్నాహాలు అక్కడి నుంచి చేసారు. సభ కు పర్మిషన్ సంఘం కార్యదర్శి గా ఉన్న కట్టీ నీ 4రోజుల ముందే పంపించారు. కరపత్రం లో పోడు ను అడ్డుకున్న పోలీస్ లను గిరిజనుల ను తర్మికొట్టారని కూడ ఉంది. పర్మిషన్ ఇవ్వక పొగా, అనుమతి కోసం వెళ్లిన కటి ని పోలీస్ లు అరెస్ట్ చేసి ఆదిలాబాద్ పోలీస్ స్టేషన్ లో పెట్టారు. ముందునుంచే సభ ను జరగనివ్వరాదని పోలీస్ నిర్భంద పరిస్థితులు కల్పించారు. 18వ తేదీ ఉదయం పోస్టర్లు వేస్తున్న అరుగురి నీ అరెస్ట్ చేసారు. అదే రాత్రి అద్దె రూమ్ పై దాడి చేసి 15మందిని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. రెండు రోజుల ముందునుంచే 144సెక్షన్ విధించి నిషేదా జ్ఞలు విధించారు. సభ గురుంచి ముందే తెలిసిన గిరిజనులు సభకు అనుమతి ఇవ్వలేదన్న సంగతి తెలియదు. 1981,ఏప్రిల్ 20సోమవారం. ఇంద్రవెల్లి సభకు ఆదివాసులు తరలింద్రు, తుడుం మోగించి,బుర్రలు ఉదుతు నృత్యాలు చేస్తూ ఇంద్రవెల్లి చేరుకున్నారు. అదే రోజు గిరిజన జాతర, సంత కూడ ఉంది. గుంపులు గుంపులు గా జనం చేరుకుంటున్నారు. ఇంద్రవెల్లి వచ్చే రహదార్లను జన్నారం, ఆసిఫాబాద్ రూట్ల నుంచి ఎవరు రాకుండా నిలిపివేశారు. తాక తాక మున్నే థాక కోయాదాద అంటూ పాటలు పాడుతూ కొందరు కదులు తున్నారు. చుట్టూ పోలీస్ లు మోహరించారు. అనుమతి లేని సభ దగ్గరకు రాకుండ పోలీస్ నిఘా పెంచారు. ఒక వైపు సంత, ఇంది రాయి దేవత జాతర, మరోదిక్కు గిరిజన రైతు కూలి సంఘం సభ తో ఇంద్రవెల్లి కొలహాలంగా మారింది. చెట్లమీద కూడ పోలీస్ లు కూర్చుని గమనిస్తున్నారు. సభ వైపు వచ్చే వారిని నిలువరిస్తున్నారు. అయితే గిరిజనులు మాత్రం భయపడకుండా అటువైపు వెళుతున్నారు. వెనక్కి నెట్టుతున్న పోలీస్ లను ఎదిరించి మహిళలు, అక్కడికి వచ్చిన గిరిజనులు ముందుకు వెళ్తుండగా అదుపు తప్పి ఆర్డీఓ కాల్పుల కు ఆదేశాలిచ్చారు. దీనితో ఫైరింగ్ మొదలు పెట్టి విచ్చాలవిడిగా కాల్పులు జరిపారు. ఆదివాసులపై తుటాల వర్షం కురిపించారు. చెల్లా చెదరుగా పరుగులు తీశారు. ప్రక్క నున్న చేన్ల లోకి, పొలాల్లోకి, ఉరికిండ్లు. అనేక మంది నేల కోరిగారు. మహిళ చేతిలోని కొడవలికి పోలీస్ బలయ్యా డు. తమ హక్కుల కోసం మీటింగ్ పెట్టుకున్న ఆదివాసులకు అనుమతి ఇవ్వక పోగా 63మందిని కిరాతకంగా పొట్టన పెట్టుకుంది. మూగ జీవాలపై తుపాకీలు ప్రయోగించి రాక్షసత్వాన్ని ప్రదర్శించింది. ఇంద్రవెల్లి లో నెత్తురు ఏరులై పారింది. పచ్చని ఆకులన్నీ నెత్తుటి గాయాలా చిహ్నాలైన్నాయి. దేశంలో ప్రజాస్వామిక శక్తులను, నివ్వెర పరిచ్చింది. అనేక మంది తుటాలకు కాళ్ళు చేతులు కొల్పయి అంగవైకల్యం చెందరు. చనిపోయిన 20మంది పేర్లను సేకరించి గిరిజన సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వం 13మందిచనిపో యినట్లు ప్రకటించింది. చనిపోయిన వారిలో పిట్టబొంగరం కు చెందిన మడవి రాము కొట్నాక్ ఘూ గ్రు, మంద జంగు, ఎర్నదేవ్ రావు, వెట్టి ఇశ్రు బాయి, వాడగం నుండి కనకం సోము, జాకెట్ గూడ కు చెందిన డోంగు రావు, ఏగోటి రావు, తొడసం బింరావ్ (జోరు పల్లి ) కుమ్మరా కొద్దు (ఖానాపూర్ )పెండోర్ దేవ్ రావు, (నిజాం గూడ )ముత్తు గౌరవపూర్, (డొమ్ గలగ్రామ్) హెలే కొమ్రా (భోజర్ గూడ )అరక గంగు (మోహంగూడ )సైదం బాపూరావు (బంగారు గూడా )మెస్రం సురేష్( మామిడి గూడా )పెండూర్ బందు (ఇచోడా )పెందురు గంగు (సిరి కొండ )లు ఉన్నారు. గాయపడ్డ వారిని ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణ మారణ కాండ ను చూసి దేశం లోని పౌరులు, ప్రజాస్వామిక వాదులు గోల్లుమన్నారు. గిరిజనుల వైపు ఎన్నడూ చూడని, వారి సమస్యలు పట్టించుకొని పాలకుల వెన్నులో గిరిజనుల రక్త పాతం వణుకు పుటించింది. 44ఏళ్ళు గడిచిన ఇంద్రవెల్లి లో జరిగిన మహోత్తార పోరాటాన్ని ప్రజలు, ఆదివాసులు ఇంకా మర్చి పోలేదు. అప్పటినుంచి ఇంద్రవెల్లి అమరులకు ప్రతీ ఏటా ప్రజలు నివాళులు అర్పిస్తూనే ఉన్నారు. ఇంద్రవెల్లి మారణ కాండ మానని గాయం గా ఇంకా ఆదివాసీ హృదయాలను తొలుస్తూనే ఉంది. నాటినుంచి ఇప్పటి దాకా ఆదివాసీ ప్రాంతాల పై కేంద్ర ప్రభుత్వాలు అంచివేత సాగిస్తూనే ఉన్నాయి. ఆపరేషన్ కగార్ పేరుతో మధ్యభారత గిరిజన ప్రాంతాలను, దండ కారణ్యాం లో మారణ హోమం సాగిస్తూఅటవీనుంచి గిరిజనులను వేరుచేసి శవాల దిబ్బలు గా కేంద్రం మారుస్తుంది.ఇంద్రవెల్లి నుంచి బస్తర్, మధ్య భారతం దాకా ఈ దేశం లోని అడివి బిడ్డలపై జరుగుతున్న దాడిని అడ్డుకోడానికి మేధావులు, ప్రజా స్వామ్య వాదులు, లౌకిక వాదులు, ఐక్యం కావాల్సినఅవసరం ఏర్పడింది.



ఏబూసి
9849157969



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఉద్యోగం పోయిందని.. యువతి హల్‌చల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగంలోంచి తీసివేయడంతో ఓ యువతి హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో హల్‌చల్ చేసింది. ఎఐజి ఆసుపత్రి బిల్డింగ్ పైనుంచి దూకేస్తానంటూ బెదిరింపులకు పాల్పడింది. గమనించిన ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందిచారు. వెంటనే ఆసుపత్రి వద్దకు చేరుకున్న పోలీసులు ఆ యువతిని కిందకు దించడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. కిందకు దిగాలని, సమస్య ఏంటో చెప్పాలని ఆసుపత్రి సిబ్బందితో పాటు, పోలీసులు ఎంత వేడుకున్నా చెప్పకుండా అలాగే నిల్చొని చూస్తోంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఎఐజి ఆసుపత్రిలో సదరు యువతి కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం. సడన్‌గా ఆమెను విధుల్లోంచి తీసివేయడంతో భవనం పైకి ఎక్కి హల్‌చల్ చేసింది. చివరకు ఆసుపత్రి, పోలీసు వర్గాలు సముదాయించడంతో యువతి కిందికి దిగి వచ్చింది.



## తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు



### రెండు సంస్థలతో టామ్ కామ్ ఒప్పందాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ అధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. టెర్న్ (టీజీయూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణలో నైపుణ్యమున్న నిపుణులను జపాన్లోని అధిక డిమాండ్ ఉన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టెర్న్ గ్రూప్ టోక్యోలో ప్రాంతీయ కార్యాలయంతో పాటు సాఫ్ట్వేర్, ఇంజనీరింగ్, స్కిల్ వర్కర్ రంగాలలో అంతర్జాతీయ నియామకాలు చేపడుతుంది.

## అవగాహనే అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట :రంగనాథ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అగ్ని ప్రమాదాల నివారణకు ఏం చేయాలనే అంశంపై అందరిలో అవగాహన అవసరమని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. ఫైర్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా హైడ్రా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ మాట్లాడారు. ఒక్క అగ్ని ప్రమాదం కూడా జరగకూడదనే లక్ష్యంతో అందరూ కలసి పని చేస్తే తప్పకుండా అది సాధ్యమవుతుందన్నారు. ఫైర్ సేఫ్టీ విధానాలను అందరూ అనుసరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తరచూ అగ్ని ప్రమాదాలు జరిగాయని వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ సమస్యపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. అగ్ని ప్రమాదాలు ఎక్కడ ఎక్కువగా సంభవిస్తున్నాయి, అందుకు గల కారణాలేంటి, ఇలా సమగ్ర సమాచారంతో డేటా ఉంటే వాటిని నివారించడానికి మార్గాలు సులభతరమవుతాయన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తూ షార్ట్ ఫిల్మ్‌లు తీయాలని కమిషనర్ సూచించారు. అంతకు ముందు హైడ్రా ఫైర్ విభాగం అదనపు సంచాలకులు పాపయ్య, హైడ్రా ఎస్‌పి సుదర్శన్, హైడ్రా ఫైర్ విభాగం రీజనల్ ఆఫీసర్ జయప్రకాష్ అగ్ని ప్రమాదాల నివారణపై మాట్లాడారు. ఆసుపత్రులు, కార్యాలయాలు, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలలో ఫైర్ సేఫ్టీ విభాగాలకు చెందిన ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయండి



### ద.మ రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం పరిశీలించారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ ఇతర సీనియర్ రైల్వే అధికారులు ఉన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులపై ఆయన వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా (అంటే ప్లాట్ఫామ్ నంబర్ 1 & నంబర్ 10 వైపు) పునరభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జనరల్ మేనేజర్ స్టేషన్‌లోని ప్రయాణీకుల సౌకర్యాలను కూడా సమీక్షించారు,ప్లాట్‌ఫారంల విస్తరణ పనులను సులభతరం చేయడానికి కొన్ని ప్లాట్‌ఫారంలను తాత్కాలికంగా మూసివేసినందున ట్రాఫిక్ రద్దీని నివారించడానికి అదనపు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే స్టేషన్ బుకింగ్, పార్కింగ్, సర్క్యులేటింగ్ ప్రాంతాలలో కొనసాగుతున్న పనులను కూడా ఆయన పరిశీలించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను, అత్యున్నత ప్రమాణాల భద్రతను కొనసాగిస్తూ ప్రయాణీకుల సజావుగా రాకపోకలను నిర్ధారించడానికి సికింద్రాబాద్ డివిజన్ అధికారులు చేపట్టిన సమగ్ర చర్యలను జనరల్ మేనేజర్ వివరణాత్మకంగా సమీక్షించారు. గణనీయమైన మౌలిక సదుపాయాల మార్పులతో కూడిన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా సమర్థవంతమైన జనసమూహ నిర్వహణ, భద్రతా వ్యవస్థ లో మెరుగుదలలు మరియు ప్రయాణీకుల సహాయ చొరవలు అవసరమని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రయాణీకులకు ఇబ్బంది లేని ప్రయాణాన్ని సులభతరం చేయడానికి సరైన సంకేతాల ఏర్పాటుతో సహా అనేక కీలక చర్యల అమలును ఆయన పరిశీలించారు.

# ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మియాపూర్ వరల్డ్ వన్ స్కూల్ వెనుక ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. షెడ్లను జెసిబిల సహాయంతో కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగాయి. గతంలో సంబంధిత వ్యాపారులకు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే తుర్కయంజాల్ మున్సిపాలిటీ లోని సర్వే నెంబర్ 213, 214 ,215 ,216 లో స్కూప్స్ ఐస్ క్రీమ్ కంపెనీ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. దీంతో శ్రీరంగపురం కాలనీ, సుం దరయ్య కాలనీ, లక్ష్మి నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలతో పాటు సుమారు 7,8 కాలనీ స్థానికులు హైడ్రా అధికారుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. రహదారి కబ్జా చేసి చుట్టూ కొంతమంది వ్యక్తులు ప్రహరీ గోడ నిర్మించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని వాపోయారు. అక్రమ కట్టడాలపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న నాధుడే లేడని ముత్యాలమ్మ అనే మహిళ ఒంటరి పోరాటం చేస్తూ హైడ్రాకు ఇచ్చిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేయడం సంతోషంగా ఉందన్నారు. సమస్యను పరిష్కరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు బాధిత కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**యువత ఫిర్యాదుతో వెలుగులోకి ఆక్రమణలు..**


తాము రోజూ ఆడుకునే చోట ఆడనివ్వడం లేదని, అక్కడ చెరువును కూడా మాయం చేస్తున్నారని రహదారులు నిర్మిస్తున్నారని అక్కడ క్రికెట్ ఆడుకునే యువకుల ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. షేక్‌పేట మం డలం రాయదుర్గం దర్గా దగ్గరలోని సర్వే నెంబర్ 5/2లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన, 39 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు జరుగుతున్నట్టు నిర్ధారించింది. ల్యాండ్ గ్రాబింగ్ కేసున్నట్టు అక్కడ బోర్డులుంటుండగానే, మరోవైపు అక్కడ ప్లాట్ల కొనుగోలుకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లతో నార్నే ఎస్టేట్స్ సంస్థ బోర్డులు ఏర్పాటు చేసింది. అనుమతి లేని లే ఔట్‌తో రహదారులు నిర్మిస్తూ, ప్లాట్లు అక్రమణదారులు అమ్మకాలు చేపట్టారు. అక్కడ చెరువును కూడా కబ్జా చేసి ప్లాట్లుగా నార్నే ఎస్టేట్స్ సంస్థ అమ్మకాలు చేస్తోంది. హాఫీజ్‌పేట్, రాయదుర్గం ప్రాంతా ల్లో ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఆక్రమణ దారులపై పోలీసు కేసును అధికారులు నమోదు చేయించారు.

– ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు



– ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి వివిధ కోర్టులలో కేసులున్నప్పటికీ చుట్టూ ప్రహరీ నిర్మించి సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి ఆక్రమణలకు పాల్పడిన బడా నిర్మాణ సంస్థలు.
– శేరిలింగంపల్లి మున్సిపాలిటీ, కొండాపూర్‌లోని హాఫీజ్‌పేట సర్వే నెంబర్ 79లో మొత్తం 39.2 ఎకరాలు ఉండగా ఇప్పటికే సగానికి పైగా నిర్మాణాలు జరిగాయి.
– సర్వే నెంబరు 79 ప్రభుత్వ భూమి, నిషేధిత జాబితాగా రెవెన్యూ రికార్డులలో నమోదై ఉంది. ఆ సర్వే నంబరు 79/1 గా సృష్టించి ప్రభుత్వ వ్యవస్థలను తప్పుదోవ పట్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వసంత హోమ్స్ సంస్థ.
– ఇప్పటికే 19 ఎకరాలను కాజేసి ఇళ్లు నిర్మించి అమ్మే సి, ఇంకా ఖాళీగా ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో కార్యాలయంతో పాటు, పలు షెడ్డులు ఏర్పాటు చేసి వివిధ సంస్థలకు అద్దెకు ఇచ్చిన వసంత హౌస్ నిర్మాణ సంస్థ.
– ఈ భూములపై సుప్రీం కోర్టులో విచారణలో ఉండగా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వివిధ సంస్థలకు అద్దెకు ఇచ్చారు.
– ఈ ప్రభుత్వ భూమిపై కోర్టులో కేసులుండగా, ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదనే నిబంధనలున్నా పట్టించుకోకుండా నిర్మాణాలు.
– ఫైనల్ డిక్రీ రాకుండానే ఈ భూములలో నిర్మాణాలు ఎలా చేపడుతున్నారని పై వ్యాజ్యాన్ని విచారిస్తున్న సందర్భంగా విస్మయం వ్యక్తపరిచిన సుప్రీం కోర్టు.
– ప్రహరీతో పాటు లోపల చేపట్టిన నిర్మాణాల తొలగించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసిన హైడ్రా.

# వామపక్షాల విలీనం అవశ్యం




### దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు ధ్వంసం
### రాఘవాచారి సంపాదకీయాలు
### సమకాలీన పరిస్థితులకు దర్పణం
### నాల్గవ సంపుటి ఆవిష్కరించిన నారాయణ

**అమరావతి:** వామపక్షాల ఐక్యత కాదు... విలీనం కావాల్సిన అవసరం ఉందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అభిప్రాయపడ్డారు. అక్షర శస్త్రధారి చక్రవర్తుల రాఘవాచారి జాతీయ అంశాలతో కూడిన సంపాదకీయాల నాల్గవ సంపుటి పుస్తకావిష్కరణ సభ విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సి.రాఘవాచారి ట్రస్ట్ అధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన నారాయణ మాట్లాడుతూ అనేక విషయాలపై అవగాహన గల విజ్ఞాన ఖని రాఘవాచారి అని కొనియాడారు. సమకాలీన రాజకీయాలు, పరిస్థితులకు రాఘవాచారి సంపాదకీయాలు సాక్ష్యాలుగా నిలుస్తాయన్నారు. సంపాదకీయం రాయడం అంత సులువు కాదని అన్నారు. పత్రికల్లో ముందుగా ఎక్కువ మంది సంపాదకీయాలు చదువుతారని అన్నారు. రాఘవాచారి రాజకీయ నాయకుడు కాదు కానీ... రాజకీయ నాయకులకే గురువు లాంటి వారని అభివర్ణించారు. నాడు ఆయన కంటే సీనియర్ సంపాదకులైన పొట్లూరి స్వయంగా రాఘవాచారిని ఓ సభలో ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. వరుసగా రాఘవాచారి సంపాదకీయాలను సంపుటిలుగా పుస్తకాలు తీసుకుస్తున్న రాఘవాచారి ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. సుప్రీంకోర్టు తీర్పును ఉపరాష్ట్రపతి తప్పుబట్టడమంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అన్నారు. అదే ప్రతిపక్షాలు గానీ, వామపక్షాలు గానీ అలా మాట్లాడితే దేశద్రోహులు అంటూ కేసులు నమోదు చేస్తారన్నారు. వ్యవస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఉండాల్సిన లక్ష్మణ రేఖ ఎగిరిపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో బలమైన ప్రతిపక్షం ఉండాలని, అందువల్ల వామపక్షాల ఐక్యత కాకుండా సీపీఐ, సీపీఎం కలవాల్సిన సమయం ఆసన్నమైందని నారాయణ అన్నారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తను రాఘవాచారి వద్ద శిష్యరికం చేశానన్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు ఆయన గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని, మేధోసంపత్తిని ప్రశంసించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ రాఘవాచారితో స్నేహం చేస్తే వదులుకోలేరని అన్నారు. పార్టీలో తన ఎదుగుదల సమయంలోనే ఆయన విశాలాంధ్ర ఎడిటర్‌గా వచ్చారన్నారు. ఎంతపెద్ద విషయాన్నైనా సులభంగా చెప్పే తత్వం రాఘవాచారిదని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన గల వారు చాలా అరుదుగా ఉంటారని అన్నారు. సీపీఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ గొప్ప ప్రజ్ఞాశాలి రాఘవాచారి అని కొనియాడారు. ఆయన సంపాదకీయాలు రిఫరెన్స్‌గా ఉపయోగపడతాయన్నారు. అనేక అంశాలపై ఆయన రాసిన సంపాదకీయాలను నేటితరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విశాలాంధ్రకు రాఘవాచారిని కిరీటంగా అభివర్ణించారు. రాఘవాచారి సంపాదకీయాల క్యూఆర్ కోడ్‌ను విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహర్ నాయుడు ఆవిష్కరించారు. అతిథులకు మాలతి స్వాగతం పలకగా... సభకు ట్రస్ట్ సభ్యుడు బుడ్డిగ జమిందార్ అధ్యక్షత వహించారు. వామపక్షాల ఐక్యతపై ట్రస్ట్ అధ్వర్యంలో సెమినార్‌లు నిర్వహిస్తామని జమిందార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, విశాలాంధ్ర జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అజయ్, సీపీఐ ఎన్టీఆర్, విజయవాడ నగర కార్యదర్శులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, డాక్టర్ సురేశ్, రాఘవాచారి సతీమణి, ట్రస్ట్ చైర్మన్ కనపర్తి జోత్స్న, కుమార్తె డాక్టర్ అనుపమ ప్రసంగించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రనాయక్, పిచ్చయ్య, నజీర్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

### హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలని తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా పేర్కొన్నారు. తెలంగాణ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న హెచ్‌ఎండిఎ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఫైర్ డిపార్ట్‌మెంట్ స్టాల్స్‌ను ఫైర్ డిజి వై.నాగిరెడ్డితో కలిసి రవిగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అగ్నిమాపక ప్రమాదాల్లో సంబ ంధిత విభాగం అత్యాధునిక పరికరాలను సమకూర్చుకుందని తెలిపారు. మంటలను ఆర్పేందుకు ప్రత్యేకంగా మూడు రోబోలను ఫైర్ విభా గం సమకూర్చుకుందన్నారు. సుమారు రూ.6 కోట్ల విలువైన ఈ రోబోలను పటాన్‌చెరువు, హైదరాబాద్, రంగారెడ్డి పారిశ్రామిక వాడలో ఉపయోగిస్తారని తెలిపారు. మంటల వద్దకు మనుషులు వెళ్లలేని పరిస్థితిలో ఈ రోబోలు మంటల వద్దకు వెళ్లి మంటలను ఆర్పుతాయన్నారు. 900 సెంటిగ్రేట్ హీట్ ఉన్న మంటల్లో కూడా ఇవి పోగలవని తెలిపారు. ఫైర్ డిజి వై. నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 31 జిల్లా ల్లో అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు, వ్యాపారులకు, గృహిణులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రమాదాలు జరిగిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల కంటే ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ప్రమాదాలను సకాలంలో నివారించడంలో దేశంలోనే ఫైర్ విభాగంలో తెలంగాణ మొదటి స్థానాన్ని ఆక్రమించిందన్నారు. ''అగ్ని నివారణ పట్ల అవగాహన పెంచుదాం–సురక్షిత భారతాన్ని నిర్మిద్దాం'' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. గతంలోకంటే ఈసారి అగ్నిమాపక శాఖలో అత్యాధునికి పరికరాలు వచ్చాయన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో నూతన మోటర్లు, ప్రత్యేక వాహనాలను సమకూర్చుకున్నామని తెలిపారు. టూల్స్ వాహనం ఈసారి ప్రత్యేకంగా సమకూర్చుకున్నామన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులలోనైనా ఈ వాహనంలో ఉండే అన్ని ఆయుధాలను ఉపయోగించి పరిస్థితులను చక్కదిద్దుతామని తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అగ్నిమాపక స్టాల్స్‌ను ప్రజల సౌకర్యార్థం ఆదివారం వరకు కొనసాగించనున్నట్లు వై.నాగిరెడ్డి తెలిపారు. ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సీనియర్ అధికారులు నారాయణరావు, ప్రసన్నకుమార్, సుధాకర్, డిఎఫ్‌ఒలు పాల్గొన్నారు.




## స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)కు రూ.516.40 కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)కు రూ. 516.40 కోట్లను మంజూరు చేస్తూ ఫైల్‌పై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క సంతకం చేశారు. ఇందులో కేంద్రం వాటా 60 శాతం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం ఉంటుంది. ఎస్‌బిఎమ్‌జి ద్వారా కింద పేర్కొన్న పనులు చేసేలా కార్యచరణ రూపొందించారు.

– స్వచ్ఛ భారత్ నిధులతో ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో 1,90,166 వ్యక్తిగత టాయిలెట్ల నిర్మాణం
– ఒక్కో టాయిలెట్‌కు రూ. 12 వేల చొప్పున మొత్తం 228.19 కోట్లు కేటాయింపు
– 2. 410 సామూహిక టాయిలెట్లు) నిర్మాణం
– ఒక్కో కాంప్లెక్స్‌కు 3 లక్షల చొప్పున మొత్తం 12.30 కోట్లు కేటాయింపు
– మొట్టమొదటి సారిగా పల్లెల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ల నిర్మాణం
– మొత్తం 100 యూనిట్ల నిర్మాణం, ఒక్కో యూనిట్ వ్యయం రూ.64 లక్షలు, మొత్తం బడ్జెట్ రూ. 64 కోట్లు
– అనువైన ప్రాంతలను ఎంపిక చేసే బాధ్యత కలెక్టర్లకు అప్పగించారు
– ఇంకుడు గుంతలు, మిగిలిన జిపిల్లో వాటర్ మేనేజ్ మెంట్ షెడ్ల నిర్మాణం.


# నకిలీ మద్యం ఏరులై పారే అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదాయాన్ని పెంచుతాం.. పేదలకు పంచుతాం అని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పెంచుతాం అంటే ఏవో పరిశ్రమలు తెస్తారు పెట్టుబడులు రప్పిస్తారు అనుకున్నామని, మద్యం రేట్లు పెంచుతాం.. ఆదాయాన్ని సమకూర్చుకుంటాం అనే ధోరణిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మద్యం రేట్లు పెంచితే ఎవరు ధర్నా చేయరని ప్రభుత్వం ఆ పనికి ఒడిగడుతుందన్నారు. మద్యం రేట్లు పెంచడంతో నకిలీ మద్యం ఏరులై పారే అవకాశం ఉందన్నారు. కొత్తగా 604 బ్రాండ్‌లకు అనుమతిచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, పక్క రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా మద్యం బ్రాండ్‌లకు అనుమతి ఇవ్వడంతో నాసిరకం మద్యం తాగి మరణించిన సందర్భాలు ఉన్నాయన్నారు. అలాంటి పరిస్థితి ఇక్కడ కూడా రావాలని కోరుకుంటున్నారా?, మద్యం ధరలు 10 శాతం పెంచితే సామాన్యులపై భారం పడుతుందన్నారు. ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని విమర్శించారు. రూ.36 వేల 500 కోట్ల రూపాయలుగా ఉన్న మద్యం ఆదాయాన్ని 50 వేల కోట్లకు చేర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నాసిరకం మద్యం బ్రాండ్లు తెస్తే సహించేది లేదన్నారు. మద్యాన్ని టెట్రా ప్యాక్‌లలో అనుమతి ఇస్తే అన్ని ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం వినియోగం పెరిగే ప్రమాదముందన్నారు. బిఆర్‌ఎస్ హయంలో నకిలీ మద్యాన్ని కట్టడి చేశామని, టెట్రా ప్యాక్‌ల ప్రతిపాదనకు ఒప్పుకోలేదన్నారు. రవాణశాఖలో ఆదాయం ఎందుకు తగ్గిందో ఆలోచన చేయండి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో ఆదాయం ఎందుకు తగ్గిందో కారణాలేమిటో వెతకండి, జిఎస్‌టి వసూళ్లలో రాష్ట్రం పరిస్థితి జమ్మూ కాశ్మీర్ కన్నా దారుణంగా తయారైందన్నారు. ఎందుకో ఆలోచించండి అని శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. అడ్డగోలుగా ఆదాయం పెంచుకునే పద్ధతులు సరికావన్నారు. ఎవరు చస్తే తమకేమిటి ఆదాయం వస్తే చాలు అనే ధోరణితో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు.




## హెచ్‌సియులో కాంగ్రెస్ విధ్వంసం

### కెటిఆర్‌కు ఇప్పుడు జ్ఞానోదయం అయ్యిందా ?
### బిజెపి ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూముల రక్షణ కోసం తాము కట్టుబడి ఉన్నామని మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు అన్నారు. నాడు బిఆర్‌ఎస్, నేడు కాంగ్రెస్ రెండు ప్రభుత్వాలు పర్యావరణం విధ్వంసం చేశాయని ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. హెచ్‌సియు భూములు యూనివర్సిటీకే చెందాలని బిజెపి ఎంపిలుగా తాము పోరాటం చేశామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్‌సియు భూముల గురించి మాట్లాడిన తర్వాత కూడా మాజీ మంత్రి కెటిఆర్ చిత్తశుద్ధి నిలబెట్టుకోవాలని అనడం హాస్యాస్పదంగా ఉందని రఘునందన్ రావు విమర్శించారు. సాధికారిత కమిటీని అన్ని ఆధారాలతో కన్విన్స్ చేశామని రఘునందన్ రావు చెప్పారు. నాలుగు వందల ఎకరాల కోసం తాము గొంతు చించుకొని మాట్లాడుతున్నామన్నారు. కెటిఆర్‌కు ఇప్పుడు జ్ఞానోదయం అయ్యిందా ? అని ప్రశ్నించారు. 111 జి.ఓ రద్దు చేసినప్పుడు ప్రకృతి కెటిఆర్‌కు గుర్తుకు రాలేదా? అన్నారు. లక్షల ఎకరాల్లో 111 జి.ఓ పరిధిలో ఫామ్‌హౌస్‌లు కట్టుకోవడానికి గత కెసిఆర్ ప్రభుత్వం ఎలా అనుమతించిందన్నారు. 111 జి.ఓ పరిధిలో కెటిఆర్, హరీశ్‌రావులకు ఫామ్‌హౌస్‌లు లేవా అని రఘునందన్ రావు ప్రశ్నించారు. హెచ్‌సియు గురించి బిజెపి నేతలు మాట్లాడవద్దని చెప్పే నైతిక హక్కు బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ఎక్కడిదన్నారు. హెచ్‌సియు భూముల విషయంలో బిజెపి ఎంపి ఉన్నారని ఆరోపిస్తున్నారని, ఆ పేరు ఎందుకు బయటకు చెప్పడం లేదని రఘునందన్ రావు ప్రశ్నించారు.

## ఛార్‌ధామ్ యాత్రికులపై సైబర్ వల

### ప్రజలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక

**న్యూఢిల్లీ :** పర్యాటకులపై సైబర్ నేరగాళ్ళు దృష్టి సారించారని, అందువల్ల పుణ్యక్షేత్రాలకు, పవిత్రస్థలాలకు వెళ్ళే భక్తులు, యాత్రికులు, పర్యాటకులు తమ పర్యటనల సందర్భంగా చాలా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు హెచ్చరిక జారీచేసింది. ప్రత్యేకించి దేశవ్యాప్తంగా ఛార్‌ధామ్‌కు వెళ్ళే యాత్రికులు, టూరిస్టులపై ఈ ఆన్‌లైన్ మోసగాళ్ళు లక్ష్యంగా చేసుకుని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నందువల్ల గాడ్జెట్స్ ఉపయోగించేటప్పుడు, ఆన్‌లైన్ చెల్లింపులు చేసేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పరిధిలో ఉన్న భారత సైబర్ క్రైమ్ సమన్వయ కేంద్రం హెచ్చరించింది. యాత్రికులకు ఎలాంటి సందేహాలు వచ్చినా వెంటనే 1930 నెంబరు లేదా cybercrime.gov.in అనే పోర్టల్‌కు సమాచారం పంపించి సహాయం పొందాలని కోరింది. సోమనాథ్, కేదారనాథ్‌లకు వెళ్ళే యాత్రికులు జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ హెలికాప్టర్‌లో వెళ్ళాలనుకునేవారు heliyatra.irctc.co.in ద్వారా బుకింగులు చేసుకోవాలని, అదేవిధంగా సోమనాథ్‌కు వెళ్ళే యాత్రికులు somanath.org అనే అధికారిక వెబ్‌సైటు ద్వారా బుకింగులు చేసుకోవాలని, అధికారికంగా ధృవీకరించుకోకుండా ఎవరుపడితే వారి మాటలు నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో, ఫోన్ వాట్సాప్‌లలో వచ్చే సందేశాలను, సమాచారాలను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: మిర్యాలగూడ రైస్ మిల్లులో పనిచేసే దినసరి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్‌టీయూసీ జిల్లా ముఖ్య సలహాదారుడు ముక్కెర అంజిబాబు అన్నారు. శనివారం ఆయన పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైస్ మిల్లు దినసరి కూలీల వేతన ఒప్పందం 2025 జనవరి 31న ముగిసిందని నోటీసు ఇవ్వడం జరిగిందని, కాని మిల్లుల యాజమాన్యం వారు మే మొదటి వారం వరకు సమయం అడిగారని అన్నారు. కార్యక్రమంలో ఆకులపల్లి వెంకన్న, జక్కుల శంకర్, సూర సైదులు, షేక్ హుస్సేన్, పిచ్చయ్య, అంజయ్య, వెంకన్న, నాగేందర్, నామా వెంకన్న, లోహిత్‌రెడ్డి, సైదులు, పద్మా, సంధ్యా, బుజ్జిబాబు, కనకయ్య, అలివేలమ్మ పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యఆరోగ్య అధికారుల తనిఖీలు




**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో శనివారం జిల్లె వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం మాట్లాడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యులు లేకుండానే వైద్యం అందిస్తున్నారనే సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బృందం డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీశైలం, మనోహరరాణి, వీరయ్య, సిబ్బంది ఉన్నారు.



## ధాన్యం వెంటనే దిగుమతి

### జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** కొనుగోలు కేంద్రాల నుండి తీసుకవచ్చిన ధాన్యంను రైతులు వెంటనే దిగుమతి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని పిల్లలమర్రిలో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రం నుండి ఇప్పటి వరకు 3200 క్వింటాల ధాన్యంను మిల్లుకు ఎగుమతి చేసినట్లు తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. అనంతరం నాగారం మండలం డికొత్తపల్లి గ్రామంలో శివలింగ ఎంఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. తూకంలో ఏలాంటి తేడాలు రాకుండా చూడాలన్నారు. అనంతరం వాసవి రైస్ మిల్లులో ధాన్యం దిగుమతిని పరిశీలించారు. ఆయన వెంట పిఎసిఎస్ చైర్మన్ పద్మ, సెంటర్ ఇన్‌చార్జీ నాగరాజు, వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

## మున్సిపాల్టీ ఎదుట మహిళల ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి లేకుండా తాగునీరు అందించాలని 43వ వార్డుకు చెందిన మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ వేసవి కాలంలో తీవ్ర మంచినీటి ఎద్దడి ఉందని చెప్పారు. మూడు రోజులకు ఒకసారి అరగంట మాత్రమే నల్లాలు వస్తే నీళ్లు సరిపోవడం లేదని అన్నారు. మున్సిపల్ అధికారులు పూర్తి స్థాయిలో అయిన నీటిని అందించాలని లేదా మున్సిపల్ అధికారులు తీసుకవచ్చిన తమ మోటార్లను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు రమణ, సూరపల్లి భాగ్య, స్వాతి, సొడం సక్కుబాయి, రాధా, రుక్మిణి, నీరజ, ఇందిరా, భాగ్యమ్మ, సత్తెమ్మ పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా నష్టపోయిన రైతాంగానికి పంట నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని సిపిఐ జిల్లా కమిటి సభ్యులు బొడిగె సైదులు డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో వడగండ్ల వాన, ఈదురు గాలులకు నేల కొరిగిన వరిచేలను శనివారం సిపిఐ నాయకులు మండల వ్యవసాయాధికారి వీణతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల కోసం అప్పులు చేసి, ఆరు కాలాలు కష్టపడి పండించిన పంట కోసి అమ్ముకునే దశలో అకాల వర్షం కారణంగా తీవ్ర పంట నష్టం వాటిల్లిందన్నారు. గుండ్రాంపల్లి గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నప్పటికి వరిధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలలో రాశుల కొద్ది ధాన్యం నిల్వ ఉండటంతో వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సైదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జిల్లా లక్ష్మయ్య, జిల్లా సత్యం, బొబ్బల శంకర్‌రెడ్డి, సీమ అంజయ్య, జిల్లా యాదయ్య, సీమ వెంకటేశం, గోపగోని శేఖర్, నమ్ముల బుచ్చయ రత్నం లింగస్వామి రైతులు జిట్ట మల్లేష్, సీమ మల్లేష్,సీమ రాములు, జి అచ్చులు, కొత్త రమేష్, సాలయ్య పాల్గొన్నారు.

## 'గేట్' ఇంజినీరింగ్ కళాశాలలో దారుణం

### భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న కళాశాల విద్యార్థిని

### అనుమానాస్పదంగా కేసు నమోదు చేసిన పోలీసులు



**ప్రజాపక్షం/కోదాడ (చిలుకూరు)**:గేట్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని భవనంపై నుండి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కట్టకొమ్ము గూడెం గ్రామ శివారులో ఉన్న గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గేట్ కళాశాలలో బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న గంగాధర్ కృష్ణావేణి ఉదయం ఆరు గంటల సమయంలో భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. కృష్ణవేణి స్వగ్రామం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కాగా కృష్ణవేణి ఉగాది పండుగకు సెలవులకు స్వగ్రామం వెళ్లి శుక్రవారం తన తల్లితో గేట్ కళాశాలకు రాత్రి వచ్చింది. కృష్ణవేణి తల్లి కూడా రాత్రి కళాశాల హస్టల్‌లోనే కూతురు వెంట ఉన్నది. తెల్లవారుతుండగా కృష్ణవేణి భవనంపైకి ఎక్కి తల్లి చూస్తుండగానే పైనుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. కృష్ణవేణి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానస్పద కేసును నమోదు చేశారు. కాగా ఈ ఘటనతో కళాశాలలో విషాదచాయలు అలుముకున్నాయి.

## ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: ఏసుక్రీస్తు బోదనలు ప్రపంచ శాంతికి దోహదపడుతాయని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. శనివారం పట్టణంలో మిర్యాలగూడ నియోజకవర్గ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ 2025 కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ జెండా ఊపి ప్రారంబించారు. పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన త్యాగాల బాటలో అందరు పయనించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి మాధవి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కాంతయ్య, సీహెచ్.విద్యాసాగర్, విక్టర్, మట్టయ్య, రవి, ప్రసాద్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

### ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/హాలియా:** రాష్ట్ర ప్రజల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొందించిందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో శనివారం (తెలంగాణ భూభారతి చట్టం భూముల హక్కుల రికార్డు 2025) పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం రైతులకు వాగ్దానం చేసిన మేరకు ధరణి స్థానంలో భూభారతి వంటి మంచి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేలా భూభారతి లాంటి చారిత్రాత్మక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. మే 2 నుంచి మండలాలను పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసి చట్టం అమలు చేస్తామన్నారు. ధరణి పోర్టల్ కంటే ముందు పట్టాదారు అనుభవ కాలం ఉండేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ,మాజీ జెడ్పి వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాకునూరి నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

**భూ భారతితో పేదల భూములకు భద్రత తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్**

**ప్రజాపక్షం/తిరుమలగిరి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకవచ్చిన భూ భారతి చట్టంతో పేదల భూములకు భద్రత ఉంటుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో, నాగారం మండలం ఫణిగిరి గ్రామంలోని ఆనంద్ గార్డెన్‌లో భూ భారతి2025పై ప్రజలకు అవగాహన సదస్సులో ఆయన అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి మాట్లాడారు. భూ భారతికి రైతులకు విడదీయరాని అనుబంధం ఉంటుందన్నారు. గత పాలకులు పేద వారి స్వంత భూమికి వారు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా ధరణి పేరుతో భూములను దోచుకున్నారని నేడు భూ భారతితో ధరణి దరిత్రం వదిలిపోతుందన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు హరిచంద్రప్రసాద్, బ్రహ్మయ్య, ఎంపిడిఓ మారయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతినరేష్, వైస్ చైర్మన్ వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్, మాజీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# శాంతి భద్రతలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ 'నెంబర్ వన్'

### సమాజ సేవలో పోలీస్ శాఖ ముందంజ ఎమ్మెల్యే బాలునాయక్



**ప్రజాపక్షం/చందంపేట :** చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామంలో నల్గొండ జిల్లా పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిభిరాన్ని నల్గొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌తో కలిసి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు సమాజ సేవలో పోలీస్ శాఖ ముందుంటారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మారుమూల గ్రామాల్లోని గిరిజనులు అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాదపడుతున్నారని గుర్తించిన పోలీస్ శాఖ తరుపున వైద్య శిభిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గిరిజనులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ముఖ్యంగా మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులతో వైద్య శిబిరాన్ని పోలీస్ శాఖ వారు నిర్వహిస్తున్నారని ప్రజల రక్షణకే పోలీసులు పనిచేస్తున్నారన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద ఉచితంగా అందించే వైద్య సేవల పరిమితిని 5 లక్షల నుండి 10లక్షలకు పెంచి ఈ పథకం కింద అందించే చికిత్సల సంఖ్యను పెంచిందని అన్నారు. త్వరలో దేవరకొండలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి 100 పడకల నుండి 200 పడకల ఆసుపత్రిగా మార్చబోతున్నాం అని ఆయన తెలిపారు. అనంతరం వైద్య శిబిరంలో వైద్యులు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం పోలీస్ శాఖ వారు ఎంఎల్‌ఏ బాలునాయక్‌కు మెమోంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏఎస్పి మౌనిక, సిఐ సురేష్, బద్యనాయక్, శ్రీశైలం, ఎస్ఐ సతీష్,, రాజు, ప్రజా ప్రతినిధులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే కాన్పులో ముగ్గురి జననం

### తల్లి, పిల్లలు క్షేమం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని శ్రీహన్ ఆసుపత్రి వైద్యులు ఘన విజయం సాధించారు. సూర్యాపేట మండలంలోని రాయినిగూడెంకు చెందిన షెక్ షబానా 22 సంవత్సరాలుకు గత 3 సంవత్సరాల క్రితం వివాహమైంది. సంతానం లేకపోవడంతో అనేక ఆసుపత్రుల చుట్టు తిరిగిన ఫలితం లేకుండా పోయింది. చివరగా జిల్లా కేంద్రంలోని శ్రీహన్ ఆసుపత్రి సంతాపన చికిత్స కోసం చికిత్స పొందడంతో గర్భం దాల్చారు. అమెకు బిపి, షుగర్, థైరాయిడ్‌తో భాదపడుతున్న శ్రీహన్ ఆసుపత్రి వైద్యులు విజితగిరిధర్ రెడ్డి హైరిస్కు తీసుకొని ఆపరేషన్ చేసి కాన్పు చేయగా ముగ్గురు సంతానం ( ఇద్దరు మగ శిశువు, ఒకరు ఆడ శిశువు) జన్మించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజితగిరిధర్ రెడ్డి మాట్లాడుతూ శిశువులు, తల్లి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. గతంలో ఇలాంటి హై రిస్కు కేసులు అడ్మిట్ చేసుకొని విజయవంతంగా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. షబానా కుటుంబ సభ్యులకు వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

### మే 20 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

### 'ఆల్ ట్రేడ్ యూనియన్స్ సదస్సు'లో వక్తల పిలుపు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని మే 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పిలుపునిచ్చారు.శనివారం టి ఎన్ జిఓ భవనం లో ఆల్ ట్రేడ్ యూనియన్ సమ్మె సన్నహాక సదస్సు జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేందరంలో మూడవసారి అధికారులకు వచ్చిన బిజెపి నాయకత్వం లోని ఎన్ డి ఎ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోళ్లను ముందుకు తెచ్చిందని అన్నారు వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలతో లేబర్ కోడ్ ల అమలు ఐదు సంవత్సరాలు ఆలస్యమైనా వాటిని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని వాటిని నల్గొండ జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి,సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి, ఐఎఫ్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు బొంగురాల నరసింహా,లు అ అధ్యక్షత వహించగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి,ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు అంబటి సోమన్న, బి ఆర్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలువేరు ప్రభాకర్, కె ఎస్ రెడ్డి,దండెంపల్లి సత్తయ్య, ఆర్ ఆచారి, నూనె వెంకటేశ్వర్లు,వి లెనిన్, గుండె రవి ఎన్ ఆర్ సి రాజు బి వెంకటయ్య, శివయ్య, ఎండీ జానీ పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర మహాసభలకు తరలిరండి

### పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/వేములపల్లి:** ఈ నెల 21, 22 తేదీలలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ లను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.మండలంలోని తిమ్మారెడ్డి గూడెం లో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా సంక్షేమ బోర్డు కార్డులను కార్మికులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకురావడం కోసం కృషి చేయటం జరిగిందిఅన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు జిల్లా యాదయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు కత్తుల బిక్షం శ్రీరామ్ రెడ్డి,రహీం,రామానుజ రెడ్డి, ఈ శ్రీను, ఎల్ ప్రసాద్ రెడ్డి, జె నాగరాజు, కళమ్మా,హేమలత, సైధమ్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మోటకొండూరు :** తెలంగాణా బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి )రాష్ట్ర 4వ మహాసభలు రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీలలో జరుగుతున్నాయని, రాష్ట్ర మహాసభలను, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ మోటకొండూరు మండల కేంద్రంలోని రెడ్డిగట్టు శేషయ్య నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆ సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి బీరకాయల మల్లేష్ ఆధ్వర్యంలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి నర్సింహా, జివిలికపల్లి గణేష్, బొట్ల జహంగీర్, బోట్ల ఆంజనేయులు, బోట్ల పరమేశ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బాక సంజీవ, సిపిఐ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఈద మల్లయ్య, బాలు పాల్గొన్నారు.




# అర్హులైన లబ్ధిదారులకు రుణసహాయం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం రుణసహాయం అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధల ప్రకారం ఈ పథకం ద్వారా జిల్లాలో 60.502 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు చేసుకున్న వారిలో నుండి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి లక్ష్యం ప్రకారం రుణాలు అందించాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకే ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రుణాలు అందించడంలో బ్యాంకర్లు లబ్ధిదారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శ్రీనివాస్ నాయక్, వివి అప్పారావు, శంకర్, జగదీష్ రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఆర్ దినేష్ కుమార్, ఐఓబి బ్యాంకు మేనేజర్ వి నాగబాబు, యాక్సిస్ బ్యాంకు మేనేజర్ రవి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎం సురేష్, కెనరా బ్యాంక్ మేనేజర్ ఎస్ కళ్యాణ్ పాల్గొన్నారు.




## రెండు కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** బీహార్ నుండి నల్లగొండ కు గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి సుమారు 2 కిలోల గంజాయిని స్వాధీనము చేసుకోవడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజుల నల్లగొండ పట్టణము లొ గంజాయి అమ్ముచున్న వ్యక్తి అరెస్టు చేసి వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.బీహార్ రాష్ట్రముకు చెందిన ఎ 1. రాకేశ్ కుమార్, ఎ 2. పప్పూ యాదవ్, లు చదవడము ఇష్టం లేక చదువు ఆపివేసి ఆ తర్వాత బ్రతుకు దెరువు కోసము తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేటకు జిల్లాకు వచ్చి అక్కడ ఒక రైస్ మిల్లు లొ రెండు సంవత్సరములు హమాలిగా పని పనిచేశాడని తెలిపారు. పప్పూ యాదవ్ ధగ్గర గంజాయి ని ఒక కిలో రూపాయలు 12 వే ల 500 లకు కొనుగోలు చేసి నల్లగొండ కు తీసుకుని వచ్చి గంజాయిని చిన్న పాకెట్లు గా తయారీ చేసి నల్ల గొండ లో గుర్తు తెలియని గంజాయి తాగే వ్యక్తులకు ఒక్క పాకెట్ 300 రూపాయల చొప్పున అమ్ముచున్నాడని పేర్కొన్నారు. నేరస్థుడు కొద్దిరోజుల క్రితము అతని సొంత గ్రామానికి వెళ్ళి ఎ 2. పప్పూ యాదవ్ వద్ధ (02) కిలోల గంజాయి ని కొనుగోలు చేసి రైలులో సికింద్రాబాద్ కు వచ్చి అక్కడి నుండి రైలులో నల్లగొండ వచ్చి రైలు దిగి వెల్లుచుండగా ఈనెల 18న సాయంత్రము పోలీసువారికి వచ్చిన నమ్మధగిన సమాచారము మేరకు నేరస్థున్ని నల్లగొండ రైల్వే స్టేషన్ లో యున్న పార్కింగ్ స్థలము వద్ద పట్టు బడి చేశారని నేరస్థుడు రాజేష్ కుమార్ ని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు ఎ 2. పప్పూ యాదవ్ పరారీలో యున్నాడని ఈ కేసును నల్లగొండ టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ .రాఘవ రావు ఆధ్వర్యంలో నేరస్థున్ని పట్టుబడి చేసి నందుకు టౌన్ యస్. ఐ వై.సైదులు వారి సిబ్బంది శంకర్, బాలకోటి లను జిల్లా ఎస్పి అభినందించారని తెలిపారు.

## ఉర్దూ మీడియం పాఠశాలకు బెంచీలు



**ప్రజాపక్షం / కొత్తకోట:** కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాల కు కొత్తగా స్కూల్ బెంచ్‌లను పంపించినందుకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి స్కూల్ హెడ్మాస్టర్, టీచర్స్, స్కూల్ ఉన్న ఇబ్బందులను కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్‌లో బెంచీలు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు సలీం ఖాన్, మాజికో ఆప్షన్ సభ్యులు లతీఫ్, టౌన్ ఉపాధ్యక్షులు తయ్యబ్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఎజాజ్ అలీ, కాంగ్రెస్ లీడర్ ముజీబ్, టౌన్ జనరల్ సెక్రటరీ కైసర్, ఎన్ఎస్‌యూఐ టౌన్ ప్రెసిడెంట్ ఇమ్రాన్, సలహాదారులు మతీన్, మహ్మద్ ఖలీల్, మెకానిక్ ఆసిఫ్, ఆటో షాలి, ఎండి. బాబా తదితరులు పాల్గొన్నారు. స్కూల్ లో ఇబ్బందులు ఉన్నాయని జిఎంఆర్ సాయస్ఫూర్తితో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## గర్భిణీలకు సకాలంలో వైద్యసేవలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వైద్య ఆరోగ్యశాఖద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిగర్భిణీయొక్క నమోదు మాతశిశుఆరోగ్యంపోర్టల్‌లో 12వారాలలోపు తప్పనిసరిగా అంతర్జాలంలో నమోదుచేయాలని మాతా శిశుసంరక్షణ జిల్లాప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం.లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం బిజినేపల్లి మండలపరిధిలోని పాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను తనిఖీ చేశారు. ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవంపొందేవిధంగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గర్భిణీలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి మూత్రరక్తపరీక్షలు తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో ఉచితంగా నిర్వహించి రిపోర్టులు అందజేయాలని సూచించారు. రక్తహీనత పౌష్టికాహారంపై ప్రత్యేకశ్రద్ధ ప్రతి ఆరోగ్యకార్యకర్త, ఆశా కార్యకర్త ప్రతిగర్భిణికి వ్యక్తిగతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, విస్తరణ అధికారి బాదంరాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం వినతి

**ప్రజాపక్షం/ మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం లోని రుద్రసముద్రం గ్రామంలో రామలింగం తెలంగాణ ఉద్యమ నాయకుడు రుద్రసముద్రం దగ్గర రైతుల కొరకు పెద్ద గోడౌన్ల నిర్మాణం జరిగింది. అక్కడ వడ్లు కొనుగోలు కేంద్రం ఎందుకు చేయడం లేదో అర్థం కావట్లేదు రైతుల అవసర నిమిత్తం కొరకు అక్కడ ఒక కొనుగోలు సెంటర్ ను ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేసిన వారు అవుతారని ఆయన అన్నారు. తక్షణమే రైతులకు అక్కడ ఒక కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. భూత్పూర్ కర్ని ఖానాపూర్ రుద్ర సముద్రం కాట్రేపల్లి గ్రామాల రైతులకు చాలా ఇబ్బంది ఉంది కాబట్టి ప్రభుత్వము గమనించి వెంటనే అక్కడ కొనుగోలు సెంటర్ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అని ఆయన అన్నారు.

## కురుమ యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి



### ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర బిసి సామాజిక వర్గంలో అత్యధిక జనాభా ఉన్న కురుమ యాదవులకు మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్లీనరీ సమావేశం మేకల రాములు యాదవ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తమ పిల్లలను చదివించేలా యాదవ కుటుంబాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. చదువుంటే ఏ రంగంల్లోనైనా అభివృద్ధి చెందవచ్చన్నారు. గొర్రెకాపరుల ఫెడరేషన్‌ను ప్రభుత్వం బలోపేతం చేయాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేకల రాములు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర యాదవ కార్పొరేషన్‌కు చైర్మన్, డైరెక్టర్‌లను నియమించి, బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు. యాదవులను బిసి డి నుంచి బిసి ఎలోకి మార్చాలని కోరారు. సమితి రాష్ట్ర అధ్యక్షులుగా కొక్కు దేవేందర్ యాదవ్, ప్రధానకార్యదర్శిగా మల్లేశ్ యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అంజలి దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు గద్దం శ్రీనివాస్ యాదవ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నేతలు డాక్టర్ రవికిరణ్, బాల్‌రాజ్ యాదవ్, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కేంద్రాల్లో అమ్మితేనే బోనస్



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** కోడుగల్ గ్రామములో శనివారం నాడు వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, జిల్లా కిసాన్ సంఘం అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, మండల్ ఎంపిసి మార్కెట్ డైరెక్టర్లు, సింగిల్ విండో సీఈఓ కాటెమోని యాదగిరి, కొడుగల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీశైలం, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ గౌడ్, డైరెక్టర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, కోడుగల్, లింగంపేట్ ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు. క్వింటల్ కి 500 రూపాయలు బోనస్ ఇస్తున్న ప్రభుత్వానికి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కి ధన్యవాదాములు తెలిపారు. అదేవిధంగా గ్రామానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రెండు చెక్కులు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు శక్కరి వెంకటేష్ గౌడ్, పార్వతమ్మకి గ్రామస్తులు పెద్ద నర్సింములు గౌడ్, జి. సాయిరెడ్డి, రఘుమారెడ్డి, ఎండి మాన్నాన్, రామస్వామి గౌడ్, బాలరాజ్ గౌడ్, ఈ. పుల్లారెడ్డి, లక్ష్మీ రెడ్డి వెంకట్ రెడ్డి, ఎం. జనార్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జి. సుధాకర్ రెడ్డి, ప్రభాకర్, జీ. వీరస్వామి, ఎండి అజీత్, నర్సొజీ చందర్, జీ.ప్రశాంత్ గిరిబాబు,ఈ. రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

## 21నుండి భవన నిర్మాణ కార్మిక రాష్ట్ర మహాసభలు



**ప్రజాపక్షం/ మక్తల్ :** కేంద్ర ప్రభుత్వము కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ కంపెనీలకు అవనుకూలంగా మార్చడం సరైనది విధానం కాదని భవన నిర్మాణ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు టీ. నర్సింహులు అన్నారు. స్థానిక మక్తల్ పట్టణంలో యాదవ నగర్ కూలీల అడ్డ దగ్గర తెలంగాన భవన నిర్మాణ కార్మిక సంఘము నాలుగవ మహాసభలు సంబంధించి ఏప్రిల్ 21,22 వ తేదీన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో జరిగే రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని భవన నిర్మాణ కార్మికుల బోర్డులో దళారుల బెడదను అరికట్టాలని భోగస్కార్డులు వేరువేయాలని తంబు సిస్టం తీసేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేయాలని భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో టెస్టుల పేరుతో వివిధ రకాల పేర్లతో ఉన్న డబ్బులను కాజేసిన దళారుల పై చర్యలు తీసుకోవాలి వీటి పై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారుల పై చర్యలు తీసుకోవాలి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ మరింత పెంచాలని ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షలు ఇవ్వాలని, సహజ మరణానికి ఐదు లక్షలు ఇవ్వాలి, మ్యారేజ్ గిఫ్ట్ లక్ష రూపాయలు, డెలివరీ బెనిఫిట్ 60 వేల రూపాయలు ఇవ్వాలని ప్రస్తుతము ఇస్తున్నటువంటి బెనిఫిట్స్ పెంచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘము భవిష్యత్తు కార్య చరణ రూపొందించేందుకు ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపం రూపొందించడం జరుగుతుందని వారన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఈసారి రమేష్, కావలి ఆంజనేయులు,వెంకటేష్ ,కావలి అంజి, ఈసారి వెంకటి, రామచందర్, గుంతలు రాజు, శీను తదితరులు పాల్గొనడం జరిగింది.

## వీధి నాటకాలను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** వీధినాటకాలను ప్రోత్సహించాలని టాస్క్ సిఓఓ, ఐక్యతఫౌండేషన్‌చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. వెల్దండ పరిధిలోని చౌదర్‌పల్లిలో మూడురోజులుగా కొనసాగుతున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారినాటకాన్ని ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ మరుగునపడుతున్న సాంప్రదాయాలను చరిత్రను నాటకాలను ప్రజలందరూ ఆదరించాలన్నారు. తమదైనందిన జీవన విధానాల్లో ఆమార్గాలను అనుసరించాలని తెలిపారు. కళాకారులకు రూ.30వేలు విరాళంగా అందజేశారు. చంద్రశేఖర్, కొండల్‌యాదవ్, మల్లయ్య, శ్రీశైలం, నాటక బృందం సభ్యులు జంగయ్య, సాయిలు, గొడుగు రాములయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** దేశవ్యాప్తంగా మత, కుల,ప్రాంత,భాష, వర్ణభేదాలతో విద్వేషాలతో ప్రజలనురెచ్చగొడుతూ బిజెపిపార్టీ విచ్చిన్నకరరాజకీయ క్రీడను ఆరంభించి రిజర్వేషన్లు ఎత్తివేసి రాజ్యాంగాన్నిమార్చే కుట్రలనుప్రజలందరూ ఏకమై తిప్పికొట్టాలని ఎం.మోతిలాల్‌నాయక్ అన్నారు. శనివారం ఏఐసిసి పిలుపుమేరకు కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాలలో మండలకాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగపరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం మతభావజాలవ్యాప్తికోసం ప్రజల మధ్యలో భయాందోళనలను సృష్టిస్తుందన్నారు. హింసాయుత పాలనకు తెరలేపి ప్రజాస్వామ్యగణతంత్ర రాజ్యాంగ మూలాలను కూలదోసి ఆర్ఎస్ఎస్ విధానాలను, సిద్ధాంతాలను బలవంతంగా రుద్దేప్రయత్నం నరేంద్రమోడి, అమిత్‌షాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర చేపట్టిన తర్వాత దేశంలో ప్రజాస్వామ్యస్ఫూర్తిపెరిగి రాజ్యాంగ పరిరక్షణకోసం పెనుమార్పులతో విధానపరమైన నిర్ణయాలను తీసుకువచ్చిందన్నారు. దేశసంపదను, రిజర్వేషన్లు జనాభా నిష్పత్తిప్రకారం అభివృద్ధి ఫలాలను అందించాలనే సంకల్పం కాంగ్రెస్‌పార్టీ చేస్తుందన్నారు. కిసాన్‌సెల్ తాలుకా అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మాజీరాష్ట్ర కార్యదర్శి తక్కళ్లపల్లి శేఖర్, సేవాదల్‌జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, మాజీ యువజన కాంగ్రెస్ ఎస్సిసెల్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, నారాయణ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు రవీందర్‌రావు, హరికిషన్‌నాయక్ పాల్గొన్నారు.

## కార్మికుల మహాసభ పోస్టర్లు ఆవిష్కరణ



**ప్రజాపక్షం/వంగూర్/ నాగర్ కర్నూలు ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందించాల నిఏఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. ఈనెల 21,22 తేదిలలో శంషాబాద్‌లో నిర్వహించనున్న భవన కార్మికుల మహాసభల గోడపోస్టులను మండలపరిధిలోని జాజాలలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు రూ.5వేల పింఛన్ మంజూరుచేయాలనిడిమాండ్‌చేశారు. భవనకార్మికసంఘం నాయకులు రమేష్, బాలరాజు, శ్రీనివాసులు, వెంకటయ్య పాల్గొన్నారు.

## నందిమల్ల బిటి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/మక్తల్:** అమరచింత జడ్ పి రోడ్డు నుండి నందిమల్ల గ్రామం వరకు నూతన బీటీ రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్ రెడ్డి, కల్లు గీత సంఘం చైర్మన్ నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అయుబ్ ఖాన్ అమరచింత మండల అధ్యక్షుడు కేజీ మహేందర్ రెడ్డి అమరచింత పటన అధ్యక్షులు ఎస్ఎం అరుణ్ కుమార్ అమరచింత మండలం ప్రజలు హాజరయ్యారు.

## కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు

### మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లె కనీస సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలో ఐ.కె.పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. తాగు నీరు, టెండ్, ఫ్లెక్సీ, అదే విధంగా గన్నిలు, ప్యాడి క్లీనర్ లేకపోవడంతో ఏ.పి.ఎం.సి.సిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు కలెక్టర్ మోహన్ రావు, కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి సంజయ్ కుమార్, ఎం.పి.డి.ఓ తహశీల్దార్ లు ఉన్నారు.

## నిందితులను అరెస్ట్ చేయకపోతే డిజిపికి ఫిర్యాదు

**ప్రజాపక్షం/ధన్వాడః** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రక్షణ కరువైందని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. శనివారం ధన్వాడ మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఆధిపత్య కుల రాజకీయ మార్క్ స్పష్టంగా కనిపిస్తుందనిఆరోపించారు. ధన్వాడ మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భార్య పై ఘోరమైన దాడి చేసి చంపడానికి ప్రయత్నిస్తె నిందితులను అరెస్ట్ చేయాల్సిన పోలీసులు అధికార పార్టీ నాయకుల కనసన్నుల్లో పని చేస్తూ కేవలం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. పేరు పక్కన రెండు పదాలు లేకపోతే బాధిత కుటుంబాలకు న్యాయం జరగదా అంటూ ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయకుండా నిందితులను కాపాడటం సిగు చేటన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, బాధితులకు న్యాయం చేయకపోతే డీజీపీ కి ఫిర్యాదు చేస్తామన్నారు.

## శనేశ్వరునికి పూజలు

**ప్రజాపక్షం/బిజినేపల్లి:** మండలపరిధిలోని నందివడ్డెమాన్ గ్రామంలో శ్రీవిశ్వావసు సంవత్సరం చైత్రమాసంలో శనివారం శ్రీసార్థసప్తజేష్ట మాత సమేత శనేశ్వరస్వామికి ప్రత్యేకంగా తిలతైల అభిషేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ ఈమాసం శనేశ్వరస్వామిని పూజించిన ఆరాధించిన ఫలితం ఉంటుందన్నారు. అనంతరం గోనబుద్దారెడ్డికాలం నాటి బ్రహ్మసూత్రంగల పరమశివుడికి ఈరోజు భక్తులచే సామూహిక రుద్రాభిషేక పూజలు, అర్చనలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 26న శనివారం శనిత్రయోదశి ఉన్నందున వడ్డెమాన్ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు రాజేష్‌ప్రభాకర్, పుల్లయ్య, వీరశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## 'కల్యాణలక్ష్మి' ఆడబిడ్డలకు వరం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు వరం లాంటిదని కల్వకుర్తి మున్సిపాలిటి మాజీ కౌన్సిలర్ షేక్‌ఏజాస్ అన్నారు. షాదీముబారక్ ద్వారా కల్వకుర్తి మున్సిపాలిటిలోని 17వార్డుకుచెందిన రజియాబేగంకు చెక్కును పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో పట్టణమాజీసర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మాజీకౌన్సిలర్ షేక్‌ఏజాస్ అందజేశారు. తహసీల్దార్ ఇబ్రహీం, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటి డైరెక్టర్ రేష్మబేగం పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సింగిల్‌విండోచైర్మన్ భాస్కరరావు శనివారం డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు.అదేవిధంగా మొదటిగ్రేడ్ ధాన్యానికి రూ.2320, ద్వితీయశ్రేణి ధాన్యానికి రూ.2300 రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, నాగులునాయక్, ముక్తాలశేఖర్‌ముదిరాజ్, షాంపూరి రాఘవేందర్‌రెడ్డి, పుణ్యమూర్తి జంగయ్య, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, తాలుకా కన్వీనర్ పర్వత్‌రెడ్డి, యూత్‌కాంగ్రెస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి తక్కెళ్లపల్లి శేఖర్, కొయ్యలపుల్లయ్య, ఏఓ శోభారాణి, సింగిల్‌విండో అధికారులు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, వివిధపార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలులో ఘోర వైఫల్యం



**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** బీఆర్ఎస్ రజోత్సవ సభతో రాష్ట్రం లో కాంగ్రెస్ పని ఖతం కాక తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ జోస్యం చెప్పారు.శనివారంపెద్ద మందడి మండల కేంద్రం తో పాటు జగత్ పల్లి, మణిగిల్ల, అల్వాల్, చిన్న మందడి గ్రామాల్లో వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో రజోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీలు అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నా రు. రేవంత్ రెడ్డి సర్కార్ పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అందుకే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో తిరగడానికి జంకుతున్నారని ఎద్దేవా చేశారు. దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని శ్రీధర్ సవాల్ విసిరారు.పెద్ద మందడిమండలంలోని జగత్ పల్లి, మనిగిల్ల, పెద్ద మందడి, అల్వాల, పెద్దమందడి , చిన్నమందడి గ్రామాల సమావేశాలలో రజ తోత్స వ పోస్టర్‌ను విడుదల చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు వేణు, మాజీ జడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మణిగిల్ల శ్రీనివాస్ గౌడ్, గోపాల్ పేట మండల పార్టీ అధ్యక్షుడు బాలరాజు, సింగిల్ విండో ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, గొర్ల కాపరుల డైరెక్టర్ నాగేంద్ర యాదవ్, చిట్యాల రాము, కోట్ల వెంకటేష్, శివగౌడ్, లక్ష్మ ణ్ గౌడ్, సేనాపతి, బీఆర్ఎస్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జికి ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ మహమ్మద్ అబ్దుల్ రఫీ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ పై వెళ్తున్న సందర్భంగా పోలీసు అధికారులు జిల్లా జడ్జి ని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి. నల్లపు లింగయ్య, సీఐ శివ శంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ కృష్ణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. గుడ్‌ఫ్రైడే ఈస్టర్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని అన్నిసంఘాల పాస్టర్లు, నాయకుల ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా జెండాఊపి ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌చౌరస్తా నుంచి ఈరన్‌ఫర్ జీసస్ హైదరాబాద్ చౌరస్తా, కూరగాయల మార్కెట్, బస్టాండునుంచి ఎంబిచర్చివరకు చేరుకుంది. పాస్టర్ రెవరెండ్‌బేబిరాజు, పాస్టర్ యోహాను ఆనంద్‌కుమార్, యేసయ్య, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు మెంబర్ ఠాగూర్‌బాలాజి, మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, క్రైస్తవనాయకులు గుమ్మకొండరాజు, నేరటిరవి, నందు, జ్యోతిప్రసాద్, శ్రీకాంత్, ఆనంద్, ప్రేమ్‌ప్రభాకర్, పలుసంఘాల పాస్టర్స్ పాల్గొన్నారు.

## 'ధరణి'ని బంగాళాఖాతంలో కలిపాం



### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం / వనపర్తి :** గత పదేళ్లుగా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన మాయదారి ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపామని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతి చట్టంతో రైతులకు ఉన్న భూ సమస్యలను గ్రామీణ స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చునని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డా. మల్లురవి ఆధ్వర్యంలో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టంతో గ్రామాల్లో నెలకొన్న ప్రతి భూ సమస్యను పరిష్కరించుకోవచ్చునని సమస్యలున్న ప్రతి రైతు స్థానికంగా ఉండే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖ అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుడి నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

**ప్రజాపక్షం/జడ్చర్లః** మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన రేణుక అను గర్భిణి తన భర్తతో జడ్చర్ల పట్టణంలోని హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం వెళ్లింది. గర్భిణీ భర్త, వారి అత్త మాట్లాడుతూ హాస్పిటల్ డాక్టర్ నార్మల్ అయ్యే అవకాశం ఉంది. మళ్లీ మూడు రోజుల తర్వాత హాస్పిటల్‌కి రావలసిందిగా సూచించారు. దానికి అనుగుణంగానే మళ్లీ హాస్పిటల్‌కి వెళ్లారు. డాక్టర్ ట్రీట్మెంట్ వికటించి ఒక్కసారిగా గర్భిణీకి ఆరోగ్యం క్షీణించి రాత్రి మూడు గంటల సమయంలో అక్కడే చనిపోయినట్టు తన భర్త వాపోతున్నారు. అంతేగాక తనకు సమాచారం ఇవ్వకుండా తన సొంత వాహనంలో అప్పటికే చనిపోయిన తన భార్యను తీసుకుని మహబూబ్‌నగర్ జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లా రన్నారు. తన భార్య కనిపించట్లేదని డాక్టర్ ని ప్రశ్నిస్తే మెరుగైన చికిత్స కొరకు జిల్లా గర్నమెంటు ఆసుపత్రికి తరలించామని చెప్పారు. అక్కడికి వెళ్లి చూసేసరికి తన భార్య అప్పటికే మృతి చెంది ఉందన్నారు. వెంటనే తాను, తన కుటుంబ సభ్యులు కలిసి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. హాస్పిటల్ మరియు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్‌ను సీజ్ చేయాలని కోరారు.

## నేడు కార్మిక సంఘాల సమావేశం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20నదేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికై కార్మికసంఘాల సన్నాహక సమావేశం ఆదివారం జిల్లాకేంద్రంలోని సిఐటియు జిల్లాకార్యాలయంలో నిర్వహించనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం సిఐటియు కార్యాలయంలో జరిగిన కార్మికసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలుచేస్తుందన్నారు. కార్మికవర్గం సమరశీల పోరాటాలద్వారా సాధించుకున్న 29చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో నాలుగులేబర్‌కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఆందోళనలు పోరాటాలు చేస్తున్న కేంద్రప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తుందన్నారు. బిజెపిప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందన్నారు. ఆదివారం జరగబోయే కార్మికసంఘాల సన్నాహక సమావేశానికి ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, ఎఐటియూసి రాష్ట్ర సహాయకార్యదర్శి నర్సింహ్మ హాజరవుతున్నారని అన్నారు. కావున జిల్లాలోని కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని ఈసన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, సిఐటియు నాయకులు సుభాష్, సుల్తాన్, సత్యం, సురేష్, ఎఐటియూసి బిల్డింగ్‌వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

స్పోర్ట్స్

# క్రీడ




# నూర్ అహ్మద్‌కు పర్పుల్



## ఐపిఎల్ 2025 సీజన్ లీడర్‌బోర్డులో 12 వికెట్లతో తొలి స్థానం

స్పాన్సర్‌షిప్ కారణాల వల్ల ప్రస్తుతం అరాంకో పర్పుల్ క్యాప్ అని పిలువబడే పర్పుల్ క్యాప్ ఐపిఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు ప్రదానం చేస్తారు. 25 ఏప్రిల్ 2008న ఆరెంజ్ క్యాప్‌ను ప్రవేశపెట్టిన తర్వాత, 13 మే 2008న పర్పుల్ క్యాప్‌ను ప్రవేశపెట్టారు. సీజన్ వారీగా టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు పర్పుల్ క్యాప్‌ను ధరిస్తాడు. టోర్నమెంట్ ముగింపులో మొత్తం మీద అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ సీజన్ ఫైనల్ రోజున వాస్తవ పర్పుల్ క్యాప్ అవార్డును గెలుచుకుంటాడు. మ్యాచ్ టై అయితే, మెరుగైన ఎకానమీ రేటు ఉన్న బౌలర్‌ను పర్పుల్ క్యాప్ వరిస్తుంది. ఇప్పటివరకు భువనేశ్వర్ కుమార్, డ్వేన్ బ్రావో, హర్షల్ పటేల్ మాత్రమే రెండుసార్లు పర్పుల్ క్యాప్‌ను గెలుచుకున్నారు. డ్వేన్ బ్రావో, హర్షల్ పటేల్ 2013 ఇండియన్ ప్రీమియర్ లీగ్, 2021 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లలో వరుసగా 32 వికెట్లు పడగొట్టారు. ఇక ప్రస్తుత (2025) సీజన్‌లో శుక్రవారం రాత్రి నాటికి లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానంలో చెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన నూర్ అహ్మద్ ఉన్నాడు. 12 వికెట్లతో రేసులో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే 14.25 సగటు, 7.12 ఎకానమీని కలిగి ఉన్నాడు. ఇది అతనికి ర్యాంకింగ్స్‌లో ఆధిక్యాన్ని ఇచ్చింది. అదే విధంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మరో అద్భుతమైన ప్రదర్శన తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పేసర్ జోష్ హాజిల్‌వుడ్ ఐపిఎల్ 2025 పర్పుల్ క్యాప్ స్టాండింగ్స్‌లో రెండవ స్థానానికి ఎగబాకాడు. 7 మ్యాచ్‌ల్లో 16.91 సగటుతో 12 వికెట్లు, 8.17 ఎకానమీతో ఉన్నాడు. కాగా, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన కుల్దీప్ యాదవ్ 6 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు, 13.18 సగటుతో మూడవ స్థానంలో ఉన్నాడు. అతని తర్వాత అతని భారత సహచరుడు ఖలీల్ అహ్మద్ (సిఎస్‌కె) 11 వికెట్లు పడగొట్టాడు. కానీ 22.09 సగటుతో నాల్గొవ స్థానంలో ఉన్నాడు. ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా (11 వికెట్లు), ఎల్‌ఎస్‌జీకి చెందిన శార్దూల్ ఠాకూర్ (11 వికెట్లు) టాప్ 6లో ఉన్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 10 వికెట్లు, 6.22 చక్కని ఎకానమీతో ఏడో స్థానంలో ఉన్నాడు, అతను నమ్మకమైన మిడిల్ ఓవర్ బౌలర్‌గా తన ఖ్యాతిని నిలుపుకున్నాడు. ఐపిఎల్ 2025 ముందుకు సాగుతున్న కొద్దీ, పర్పుల్ క్యాప్ కోసం పోటీ మరింత తీవ్రమవుతుంది. బ్యాటర్లు మొదటి బంతి నుండి కష్టపడి పనిచేస్తుండటంతో, ఈ బౌలర్లు తమదైన ముద్ర వేయగలిగారు. టోర్నమెంట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో పిచ్‌లు అరిగిపోతున్నా కొద్దీ బౌలర్లు లయను కనుగొంటున్నందున, పర్పుల్ క్యాప్ కోసం పోటీ విస్తృతంగా ఉంది. సీజన్ ముందుకు వెళ్తున్నా కొద్దీ, లీగ్‌లోని ప్రముఖ బౌలర్లు తమదైన ముద్ర వేసి ప్రతిష్టాత్మకమైన పర్పుల్ క్యాప్‌ను దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నందున, ప్రేక్షకులు మరిన్ని అద్భుతమైన ప్రదర్శనలు. ఉత్కంఠభరితమైన ఎన్‌కౌంటర్‌లను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఐపిఎల్‌లో యువ ఆటగాళ్ల దూకుడు!

టీ20 క్రికెట్ అనేది యువతకు అనుకూలంగా ఉండే ఆటగా గుర్తింపు పొందింది. ప్రపంచంలోని అత్యుత్తమ లీగ్‌గా గుర్తింపు పొందిన ఐపిఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) అనేక ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకొచ్చింది. 2025 సీజన్‌లో కూడా యువ ఆటగాళ్లు తమ ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఇప్పటికే తమ ప్రభావాన్ని చూపిన కొందరితో పాటు కొత్తగా మెరిసిపోతున్న యువకులు కూడా ఈ సీజన్‌లో చర్చనీయాంశంగా మారారు.

### బ్యాటింగ్‌లో సంచలనం.. ప్రియాంశ్ ఆర్య



23ఏళ్ల ఢిల్లీ యువ ఆటగాడు ప్రియాంశ్ ఆర్య,ఈసారి పంజాబ్ కింగ్స్ తరఫున ఓపెనర్‌గా అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో అలరిస్తున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో కేవలం 39బంతుల్లోనే సెంచరీ బాదడం ద్వారా తన ప్రతిభను నిరూపించుకున్నాడు. తనతొలి మ్యాచ్‌లోనే 23బంతుల్లో 47పరుగులు చేసి ఐపీఎల్‌లో చక్కటి ఆరంభం ఇచ్చిన ఈ యువకుడు,తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనా చెన్నైపై ఘనంగా రాణించాడు. ఆతర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ ఆత్మవిశ్వాసంతో ఆడాడు.ఈ సీజన్ ప్రారంభానికి ముందు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టి ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించిన అతడు వేలంలో రూ.3.8 కోట్లు పలికాడు. ఇప్పటివరకు ఏడు మ్యాచ్‌ల్లో 232 పరుగులు చేసి, 200కి పైగా స్ట్రైక్ రేట్‌తో ఆకట్టుకుంటున్నాడు.

### నరైన్ శైలిలో స్పిన్ మాయాజాలం.. దిగ్వేశ్ సింగ్ రాఠి



వెస్టిండీస్ దిగ్గజ బౌలర్ సునీల్ నరైన్ తరహాలో బౌలింగ్ చేస్తూ నైపుణ్యం చూపిస్తున్న దిగ్వేశ్ సింగ్ రాఠి, లక్నో సూపర్ జెయింట్స్ ప్రధాన బౌలింగ్ ఆయుధంగా నిలిచాడు. చేతిని వెనక దాచిపెట్టి బంతి వేస్తూ ఆటగాళ్లను ఆశ్చర్యపరచడం నరైన్ శైలి అయితే, దానిని ఎంతో సమర్థవంతంగా అనుసరించి దిగ్వేశ్ తనదైన ముద్ర వేసాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో పరుగుల వర్షం కురుస్తున్నా అతడి ఎకానమీ రేటు కేవలం 7.42గా ఉండటం విశేషం. అతడు ఇప్పటివరకు 7 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు తీసి కెప్టెన్ రిషభ్ పంత్ విశ్వాసాన్ని గెలుచుకున్నాడు.

### బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ విప్రాజ్ చక్కటి ప్రదర్శన



ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలింగ్ విభాగం అత్యుత్తమంగా వ్యవహరిస్తోంది. కుల్దీప్ యాదవ్ ఒక వైపున నిలకడగా వికెట్లు తీస్తూ దూకుడుగా ఆడుతుంటే, మరో వైపు అతడికి తోడుగా ఉన్న విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. ఈ సీజన్‌కు ముందు అభిమానులకు తెలియని పేరు అయినా, లక్నోతో జరిగిన తొలి మ్యాచ్‌లో మార్క్రమ్ వికెట్ తీయడంతో పాటు 39 పరుగుల మెరుపు ఇన్నింగ్స్‌తో వెలుగులోకి వచ్చాడు. అప్పటి నుంచి బౌలింగ్‌లో మంచి స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ, ఇప్పటివరకు 7 వికెట్లు తీశాడు. లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌లో కూడా తన పాత్రతో ఢిల్లీ జట్టులో కీలక సభ్యుడిగా నిలిచాడు.

# రోబో డాగ్



చిట్టి రోబో తెలుసుగా.. సూపర్ స్టార్ రజనీకాంత్ రోబో సినిమాలో అనేక పనులను చకచకా చేసి అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పుడు అచ్చం అలాంటి రోబో డాగ్‌నే ఐపిఎల్ బ్రాడ్‌కాస్ట్ టీమ్ అభిమానులకు పరిచయం చేసింది. మ్యాచ్ కవరేజ్‌ను మరింత ఆహ్లాదకరంగా మార్చేందుకు ఈ చిట్టి రోబో డాగ్‌ను ప్రవేశ పెట్టింది. ఈనెల 13న ముంబై ఇండియన్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు ముందు ఈ చిట్టి రోబోను న్యూజిలాండ్ మాజీ క్రికెటర్, కామెంటేటర్ డానీ మోరీసన్ ఐపిఎల్ ప్రేక్షకులకు పరిచయం చేశాడు. బ్రాడ్‌కాస్ట్ కెమెరాలకు అనుసంధానంగా ఉన్న ఈ రోబోటిక్ డాగ్.. డానీ మోరీసన్ మాటలకు స్పందించడం విశేషం. తనదైన కామెడీతో మోరీసన్ ఈ రోబోటిక్ డాగ్‌ను ప్రేక్షకులకు పరిచయం చేశాడు. ఈ రోబోటిక్ డాగ్‌కు పేరు పెట్టాలని కూడా అభిమానులను మోరీసన్ కోరాడు. ఈ వీడియోను ఐపిఎల్ నిర్వాహకులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ రోబోటిక్ డాగ్‌తో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా, రీస్ టోప్లీ, ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్, మిచెల్ మార్ష్‌లు సరదాగా గడిపారు. రోబోటిక్ డాగ్ పని తీరును పరీక్షించారు. రోబోటిక్ డాగ్‌తో మోరీసన్ సరదాగా పరుగు పందెం పెట్టుకున్నాడు. ఈ పోటీలో రోబోటిక్ డాగ్ గెలవడం విశేషం. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు టాస్ కాయిన్ కూడా ఈ రోబోటిక్ డాగ్ తీసుకురావడం గమనార్హం.

సినిమా

# మిహికా, శ్రీలీల కవలలా...!

టాలీవుడ్ హీరో రానా భార్య మిహిక, శ్రీలీల కవల పిల్లలా? మిహిక తన ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోస్ చూసి నెటిజన్లు తెగ చర్చించుకుంటున్నారు. ఆ ఫొటోల్లో ఇద్దరూ నిజంగానే ఒకేలా ఉన్నారు.. మహికా శ్రీలీలను హగ్ చేసుకుని దిగిన పిక్స్ పోస్ట్ చేయగా అవిప్పుడు వైరల్ అవుతున్నాయి. అయితే 'సేమ్ సేమ్ బట్ డిఫరెంట్' అనే క్యాప్షన్ ఇచ్చింది మిహిక... ఇద్దరి ముఖాలు ఒకేలా ఉండడం చూసి వీళ్లు కవలలు అని కొందరు, సిస్టర్స్ అని మరికొందరు పోస్టులు పెడుతున్నారు. ఇటీవల శ్రీలీల రాబిన్ హుడ్ మూవీతో వచ్చింది. 'పరాశక్తి' అనే మూవీతో తమిళ ఇండస్ట్రీలో అడుగుపెడుతోంది. కార్తీక్ ఆర్యన్‌తో కలిసి బాలీవుడ్ మూవీలోనూ నటిస్తోంది. దగ్గుపాటి రానా 2020లో మిహకాను పెళ్లిచేసుకున్నాడు. హైదరాబాద్‌కి చెందిన మహినా ముంబైలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నిర్వహిస్తోంది.





## పద్ధతిలోనూ టాపరే

స్కూల్లోనూ, ఇండస్ట్రీలోనే కాదు ఈ హీరోయిన్ పద్ధతిలోనూ సంయుక్తా మీనన్ టాపరేగా నిలుస్తున్నది. పట్టుచీరలో పద్ధతిగా అందంగా వెలిగిపోతోంది సంయుక్తమీనన్. ఫస్ట్ మూవీతోనే నటిగా మెప్పించింది. ఆ తర్వాత వరుస ఆఫర్స్ అందుకుంది. మలయాళంలో కెరీర్ ప్రారంభించిన సంయుక్తమీనన్ భీమ్లానాయక్ తో తెలుగులో అడుగుపెట్టింది. ఆ తర్వాత బింబిసార, సర్, డెవిల్, విరూపాక్షలో నటించింది. చిన్నప్పుడు చదువులో టాప్..ఇప్పుడు ఇండస్ట్రీలో హిట్స్ లో టాపర్..అయినా ఇప్పటివరకూ స్టార్ హీరోయిన్ స్టేటస్ దక్కించుకోలేక పోయింది. ఆఫర్ల ఎంపికలో ఆమె ఆచితూచి వ్యవహరించడం కూడా ఇందుకు ఓ కారణం అనుకోవాలేమో..ఎందుకంటే తన క్యారెక్టర్ కి ఇంపార్టెన్స్ ఉన్న పాత్రలకే సంయుక్త గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విరూపాక్షలో సంయుక్త నటనకు ఫిదా అయిపోయారు ప్రేక్షకులు..ఆమె ఓ వెలుగు వెలుగుతుంది అనుకున్నారు. కానీ ఆశించిన స్థాయిలో సంయుక్త కెరీర్ లేదనే చెప్పాలి.

# రాజ్యాంగంలోని మత స్వేచ్ఛ హక్కును కాపాడుకుందాం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంలోని మత స్వేచ్ఛను కాపాడుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద పిలుపునిచ్చారు. శనివారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం ఐటిఐ గ్రౌండ్ నుండి అయ్యప్ప టెంపుల్ నుండి పెద్ద మసీద్ మీదుగా జెండా చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెట్రేగిపోతుందని,మతోన్మాదం పేరుతో దేశంలో అశాంతి నెలకొల్పుతున్నారని, మతోన్మాద పేరుతో మరణహోమం జరుగుతున్న నేపథ్యంలో మనం రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుని మీద ఉందన్నారు. ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్, విశ్వాహిందుపరిషత్, సంఘ్ పరివార్ శక్తులు చర్చిలపై దాడులు చేస్తూ క్రిస్టియన్ సోదరులపై దాడులు చేస్తూ, మైనార్టీల ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దేశంలో విద్వేష పూరిత వాతావరణ సృష్టిస్తున్నారని, మనం స్వేచ్ఛగా బ్రతకాలంటే రాజ్యాంగం కాపాడుకోవాలని తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మత దైవజనులు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

# భవన కార్మికులకు రూ.3వేలు పెన్షనివ్వాలి

సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మినారాయణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** 50ఏళ్ళు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.3వేలు పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వీరభవన్ జిల్లా సిపిఐ కార్యాయలంలో భవన నిర్మాణ కార్మిక సంఘ(ఎఐటియుసి అనుబంధం) మహబూబాబాద్ జిల్లా 4వ మహాసభ జానీ. మల్లికంటి వెంకన్నఅధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులంరికీ 50సంవత్సరాలు నిండిన వెంటనే రూ.3వేలు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ రంగాన్ని బిజెపి ప్రభుత్వం విస్మరించిందని, కేంద్రంలో బిజెపి అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రకాల బెనిఫిట్స్ అందించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే భవన నిర్మాణ కార్మికులకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సహజ మరణం, డెలివరీ స్కీంలను డబ్బులు పెంచి భవననిర్మాణ రంగంలో పనిచేసే వారందరికీ కార్మిక భద్రత ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి కార్పొరేట్లకే దాసోహం అంటోందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ ఆఫీస్ ద్వారా అన్ని రకాల బెనిఫిట్స్ సమయానికి అందించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఎఐటియుసి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లాకార్యదర్శి బి.విజయసారథి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బి.అజయ్ సారథిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, మంద శంకర్, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ శ్రేణులు సన్నద్ధం



సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/చిగురుమామిడి :** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల కోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ వందేళ్ల మహోజ్వల చరిత్ర కలిగిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలంలోని రేకొండ, ఒగులాపూర్, రామంచ, సుందరగిరి, ముల్కనూరు గ్రామాలలో సిపిఐ గ్రామ శాఖల మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నిరంతరం కార్మిక, కర్షక, పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన ప్రజల పక్షాన నిలిచే సిపిఐ పార్టీని బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. వందేళ్లలో జరిగిన పోరాటాలు, లాఠీలు, తూటాలు, రక్త తర్పణాలు జరిగి ఎన్నో విజయాలను సిపిఐ సాధించిందన్నారు. స్వాతంత్ర ఉద్యమం నుంచి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం నైజాం నవాబు రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. దేశంలో భూ సంస్కరణ చట్టం తీసుకురావడం కోసం, రాజభరణాల రద్దు కోసం, బ్యాంకుల జాతీయాకరణ కోసం ఎన్నో పోరాటాలు నడిపించిన గొప్ప చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలో ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసిన పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను మమేకం చేసుకుని ఎంపిటిసి, ఎంపిపి, జడ్పిటిసి, సర్పంచ్ స్థానాలను అత్యధికంగా కైవసం చేసుకవాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పిటిసి అందె స్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు అందె చిన్నస్వామి, చాడ శ్రీధర్ రెడ్డి, బోయిని పటేల్, ముద్రకోల రాజయ్య, బూడిద సదాశివ, సిపిఐ మాజీ మండల కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, వివిధ గ్రామాల సిపిఐ శ్రేణులు తదితరులున్నారు.

# దేశ ఆర్థిక వ్యవస్థ, లౌకిక వ్యవస్థను ప్రమాదంలోకి నెట్టివేస్తున్న బిజెపి ప్రభుత్వం

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలి : బాగం




**ప్రజాపక్షం/ఖమ్మం :** మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని వివాదస్పద చట్టాలను తీసుకువస్తూ దేశ లౌకిక వ్యవస్థకు భంగం కలిగిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 44వ డివిజన్ లెనిన్ నగర్ మహాసభలకు ఆ యన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విభిన్న మతా లు, జాతులు భిన్న సంస్కృతులు కలిగిన భారతదేశ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదస్పద చట్టాలను తీసుకువస్తుందని తెలిపారు. దీనిలో భాగంగానే 370 ఆర్టికల్ రద్దు, త్రిబుల్ తలాక్, వక్ఫ్ చట్టం లాంటి వివాదస్పద చట్టాలను తీసుకు వచ్చిందన్నారు. వీటివల్ల ప్రజల మధ్య విభజన తీసుకువచ్చి మైనార్టీలైన ముస్లిం ప్రజల్లో భయందోళన కలిగిస్తూ మతోన్మాద భావాలను రెచ్చగొట్టడం ద్వారా మతపరమైన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం ప్రజల సమస్యలను విస్మరించి ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ అశాంతిని సృష్టిస్తుందని దీని వల్ల మనదేశ లౌకిక వ్యవస్థకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఇటీవల తీసుకు వచ్చిన వక్ఫ్‌బోర్డ్ సవరణ చట్టం మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తుందని ఆయన విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి కార్పొరేట్ వర్గాలకు దేశంలోని వనరులను, సంపదను కట్టబెడుతుందని ప్రభుత్వ రంగం మొత్తాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు, త్యాగాలు చేసి ప్రజలకు అనేక హక్కులను సాధించి పెట్టిందని దేశ సమైక్యత, సమగ్రతల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. దేశాన్ని ప్రమాదపు అంచుల్లోకి నెట్టివేస్తున్న మతోన్మాద కార్పొరేట్ అనుకూల బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు నిర్వహించాలని బాగం పిలుపునిచ్చారు. ఎస్‌కె చానా అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, బోడా వీరన్న, తాటి నిర్మల, నాయకులు దుంగ్రోత్ శేఖర్, మసీద్దీన్, భద్రం పాల్గొన్నారు.

# పేదల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతర పోరాటం

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** పేదల పక్షాన భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని సిపిఐ సూర్యపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చిలుకూరు మండల పరిధిలోని దూదియతండా గ్రామ మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 12 మందితో గ్రామశాఖ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వస్త్రాం, సహాయ కార్యదర్శిగా మోహన్‌రావు, కమిటి సభ్యులుగా వీరభద్రరావు, ఎలమంద, నాగ, రమేష్, లక్ష్మణ్, నాగు, శ్రీను, స్వప్న, సుధా తరంగిణి లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# పాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు గౌడ్



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** పాల రైతులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన ఐదు రూపాయల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి నేటి వరకు రైతుల ఖాతాలో జమ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి మటూరి బాలరాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో మదర్ డైరీ పాల కేంద్రం వద్ద రైతులతో కలిసి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాటూరి బాలరాజు మాట్లాడుతూ 15 రోజులకు ఒకసారి పాల బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ మదర్ డైరీకి సంబంధించి ఐదు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. తక్షణమే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై దాణను ప్రభుత్వమే సరఫరా చేయాలని అన్నారు. పాడి గేదెలకు, పాడి రైతులకు బీ మా సౌకర్యం కల్పించి ప్రభుత్వమే ఆ బీమా మొత్తాన్ని చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండు, రైతు సంఘం మాజీ డివిజన్ కార్యదర్శి రాసాల వెంకటేశం, విజయ డైరీ చైర్మన్ కోయగూరమల్లిఖార్జున్, నరాల చంద్రయ్య, గాండ్లనరసింహ తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమపథకాలు అందించాలని ఎఐటియుసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. శనివారం వంగూరు మండలం జాజాల గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22తేదిలలో శంషాబాద్ పట్టణంలో జరిగే తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డుద్వారా సంక్షేమపథకాలు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు.ప్రభుత్వ సబ్సిడిలద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా భవన నిర్మాణ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటస్వామి, తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్, ఎఐటియుసి హమాలి నాయకులు గొర్లసత్యం, వంగూరు మండలం జాజాల గ్రామభవన నిర్మాణ నాయకులు బాలరాజు, రమేష్, శ్రీను, అశోక్ పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## బస్తీవాసుల సమస్యలు పరిష్కారం చేస్తాం



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** వనస్థలిపురంలో పిట్టలబస్తీవాసుల సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామని ఎల్‌బినగర్ ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం బస్తీవాసుల కోరిక మేరకు పిట్టల బస్తీలో పర్యటించారు. కాలనీ వాసులు కాలనీల్లో నెలకొన్న కొన్ని సమస్యలు డ్రైనేజ్ పొంగిపొర్లుతున్నాయని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు ఎంఎల్ఏ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే అధికారులతో మాట్లాడి డ్రైనేజ్, సీసీ రోడ్డు పనులు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని ఎంఎల్ఏ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు శక్తి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దైవాల గూడ అభివృద్ధికి కృషి చేస్తా
### చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పామెన భీంభరత్



**ప్రజాపక్షం/షాబాద్ :** దైవాలగూడ అభివృద్ధికి కృషి చేస్తామని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. శనివారం దైవాలగూడ గ్రామస్తులు పామెన భీంభరత్‌ను కలిసి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయితీలో మౌలిక వసతులు కల్పించేదుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. దైవాలగూడలో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్డు దశల వారిగా నిధులు మంజూరు చేసి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ఆర్‌అండ్‌బి అధికారులకు ఫోన్‌లో మాట్లాడి మాదల్ పోరాలు నుండి దేవాలగూడ వరకు బిటి రోడ్డు మంజూరుకు ఎస్టిమేషన్ వేయాలని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దైవాలగూడ గ్రామస్తులు, కడమంచి జంగయ్య, పార్వతి బాస్కర్, విజయ్, యాదయ్య, నర్సింలు, బాలయ్య తదితరులు ఉన్నారు.

# నిమ్స్‌లో అగ్ని ప్రమాదం

● తప్పిన పెనుప్రమాదం ● 'ఎవరికీ ఏం కాలేదు.. అంతా సేఫ్' : మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా ఆసుపత్రిలో మంటలతో పాటు దట్టమైన పొగలు రావడంతో రోగులు, డాక్టర్లు, నర్సులు, రోగుల బంధువులు ఒక్కసారిగా బయటికి పరుగులు తీశారు. అంతా గందరగోళ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. పెద్ద ప్రమాదమే తప్పింది. ఎమర్జెన్సీ వార్డులో ఉన్న టపాసుల బ్యాగులు పేలకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఇవి గనుక పేలి ఉంటే ప్రమాదం ఊహించనంతగా జరిగి ఉండేదని అంటున్నారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం 4.15 గంటలకు ఎమర్జెన్సీ వార్డు ఐదో అంతస్తులో చోటు చేసుకుంది. అరగంట పాటు అందరు శ్రమించి మంటలను ఆర్పారు. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదానికి కరెంట్ కేబుల్ షార్ట్‌సర్క్యూట్ కారణమని పోలీసులు తేల్చారు. పోలీసులు గనుక సకాలంలో స్పందించి ఉండకుంటే పెద్ద ప్రమాదమే జరిగేదని అంటున్నారు. అగ్నిప్రమాదంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించారు. నిమ్స్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు. అగ్ని ప్రమాద ఘటనలో ఎవరికి ఏమీ కాలేదని చెప్పారు. ఆస్తి నష్టం కూడా పెద్దగా జరగలేదని అన్నారు. పేషెంట్లందరినీ సేఫ్ ప్లేస్లోకి తరలించినట్లు చెప్పారు. అందరు సేఫ్‌గానే ఉన్నారని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

## జెఇఇ మెయిన్‌లో రెసోనెన్స్ చరిత్రాత్మక విజయం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఆల్ ఇండియా జెఇఇ మెయిన్స్ 2025లో హైదరాబాద్‌లోని రెసోనెన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు చరిత్రాత్మక విజయం సాధించారని రెసోనెన్స్ కళాశాల డైరెక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు. శనివారం మాదాపూర్‌లోని రెసోనెన్స్ కళాశాలలో ప్రవేశ పరీక్షలో అగ్రశేణి ర్యాంకులు సాధించడంతో రెసోనెన్స్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రెసోనెన్స్ కళాశాలల అన్ని బ్రాంచిల వారు ఐఐటి, ఎన్ఐటి, నీట్, ఇతర మెడికల్ ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ర్యాంకులు సాధించి అగ్రశేణిలో ఉన్నారని 295/300 స్కోర్ చేయడంతో ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంక్ 13 వచ్చిందన్నారు. హైద్రాబాద్‌లోని అన్ని క్యాంపస్‌ల నుంచి 1500 మంది విద్యార్థులు అడ్వాన్సడ్ పరీక్షకు అర్హత పొందరని, హైదరాబాద్ విద్యా రంగంలో రెసోనెన్స్ ఒక విశ్వసనీయ బ్రాండ్‌గా నిలిచిందని తెలిపారు. రెసోరెన్స్ కళాశాల ఆధ్వర్యంలో టాప్ 4గురు విద్యార్థులకు ప్రోత్సహకంగా ఒక్కోక్కరికి లక్ష రూపాయల స్కాలర్ షిప్ అందజేశామని తెలిపారు. కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల పరిధిలోని చిన్న ఎల్కిచర్ల గ్రామ పంచాయితీ పరిధిలోని పుల్లప్పగూడలో ఈ నెల 17న విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన సంఘటనలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ఉందని, వారిపై చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాకార్యదర్శి సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని పర్వతాపూర్ శివారులోని ఓ పొలం వద్ద షేడ్‌లోని ఉన్న మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం కురిసిన గాలివాన వర్షానికి ఓ స్థంబం విరిగిపోయిందని, ఈ విషయాన్ని రైతులు వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు తెలయజేశారని, కానీ మూడు రోజులు గడిచినా, మరమ్మత్తులు చేయలేదని అన్నారు. 17 గురువారంన పొలం వద్దకు అశోక్‌రెడ్డి వెళ్లడంతో విద్యుత్ షాక్‌కు గురై, అక్కడిక్కడే మృతి చెందాడని, విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించి మరమ్మత్తులు చేస్తే, ఓ నిండు ప్రాణం పోయేది కాదని అయన అన్నారు. ప్రభుత్వం మృతిడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ విద్యాసాగర్, కుర్వగడ్డ నర్సింలు, కందుకంల నర్సింలు గౌడ్, రాయికంటి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## హఫీజ్‌పేట్ డివిజన్‌లో ముకుంద జ్యూవెలర్స్ షోరూమ్ ప్రారంభం



**ప్రజాపక్షం/శేరి లింగంపల్లి :** ముకుంద జ్యూవెలర్స్ షోరూమ్‌లో ప్రజలకు కావలసిన అన్ని రకాల నగలు సరసమైన ధరలకు లభించడం సంతోషకరమైన విషయమని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరెకపూడీ గాంధీ తెలిపారు. శనివారం హాఫిజ్‌పేట్ డివిజన్ పరిధీలోని గంగారాం మెయిన్ రోడ్డులో నూతనంగా ముకుంద జ్యూవెలర్స్ షోరూమ్ ను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి దయానంద్ గుప్తా, పిఎసి చైర్మన్ , శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరెకపూడీ గాంధీ, ముకుంద జ్యూవెలర్స్ ఎండి నర్సింహ రెడ్డిలు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్ని షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ గాంధీ మాట్లాడుతూ ముకుంద జ్యూవెలర్స్‌లో వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా నగలు లభించడం గోప్ప విషయమని, కస్టమర్ల అర్డలకు అనువుగా నగలను తయారు చేసి అందించడంలో ముకుంద జ్యూవెలర్స్ మంచి పేరు, ప్రఖ్యాతులు తెచ్చుకుందని, కస్టమర్ల అదరాభిమాలతో ఇక్కడ గంగారాంలో ముకుంద జ్యూవెలర్స్ షోరూమ్ ఏర్పాటు చేశారని తెలిపారు. తదుపరి సంస్థ ఎండి నర్సింహ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభిమానంతో ఖమ్మం, కొత్తపేట, సోమాజజిగూ డ, హన్మకొండ, సుచిత్ర నందు తమ బ్రాంచిలను స్థాపించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాద వ్, నరేందర్ బల్లా, ఇబ్రహిం తదితరులు పాల్గొన్నారు.

## సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా యాదయ్య



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** స్పెషల్ గ్రేడ్ మున్సిపల్‌గా పనిచేస్తున్న హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తిప్పర్తి యాదయ్యను సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం హయత్ నగర్ సర్కిల్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల అధికారులు హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్యను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దినేష్ సింగ్, సూపరిడెంట్లు మహేదర్, విక్రమ్, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతుల పరిహారానికి కృషి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారుల బృందం సభ్యులు పర్యటించి ఆకాల వర్షాలు, పిడుగులకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించా రు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో మొత్తం 14మంది రైతులకు సంబంధించిన 16.20ఎకరాల భూమిలో వరిపంట 33శాతం దెబ్బతిందని తెలిపారు. ఆ రైతుల వివరాలను సేకరించడంతో పాటు వ్యవసాయ పోలాల వద్దకు వెళ్ళి పరిశీలించి నివేధిక తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని వివరించారు. 33శాతం కంటే ఎక్కువ పంటలు దెబ్బతింటేనే ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందని, ప్రతి ఎకరాలకు సుమారుగా రూ.10వేల వరకు నష్టపరిహారం వచ్చేందుకు వీలు ఉంటుందని తెలిపారు.

## జడ్జి ఇంట్లో దొరికిన రూ.500 కోట్లపై సమాధానమేది?
### కేంద్రానికి కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ ప్రశ్న



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో పట్టుబడ్డ రూ.500 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయన్న విషయంపై కేంద్రప్రభుత్వం దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. మన్‌కీ బాత్‌లో చెప్తారో లేదా ఆలిండియా రేడియోలో చెప్తారో అది మీ ఇష్టమన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో మాయవతి ఇంట్లో రూ.5లక్షలు ఉంటే, సిబిఐ పట్టుకొని, కేసు పెట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుతం జడ్జి ఇంట్లో దొరికిన డబ్బు ఎవరిచ్చారు.? ఎలా బయటపడిందన్న విషయాలపై ఆరా తీయాల్సిన సిబిఐ, ఈడి, ఐటి, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బిజెపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనార్టీలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. పాస్టర్ ప్రవీణ్ హత్యను యాక్సిడెంట్‌గా మారుస్తున్నారని, ఆయన ఆల్కహాల్ తీసుకొన్నట్టు పోస్టుమార్టం రిపోర్టులో లేదన్నారు. దేశమంతా ముస్లింలు ఆందోళనబాట పట్టారన్నారు. ఎస్‌సిలకు 15శాతం, ఒబిసిలకు విద్య, ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్సేదేనన్నారు. కర్నాటక ప్రభుత్వ తరహాలో తెలంగాణ, ఎపిలో ఎస్‌సి, ఎస్‌టిలకు 24శాతం, ఒబిసిలకు 15 శాతం ప్రభుత్వ కాంట్రాక్టు పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకపక్షం, ప్రతిపక్షం మధ్య వైషమ్యాలు దేశానికి మంచిది కాదని చింతా మోహన్ పేర్కొన్నారు. సమావేశంలో టిపిసిసి కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు

## కార్మిక రక్షణకు కలిసి పోరాడుదాం : పాలమాకుల

**ప్రజాపక్ష/రంగారెడ్డి ప్రతినిధి :** అమరవీరుల స్ఫూర్తితో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లపై ఉద్యమిద్దాం.. కార్మిక చట్టాలను పరిరక్షి౦చుకుందాం అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం శంషాబాద్ టౌన్‌లోని ఎలైట్ హోటల్ ముందు 139 'మేడే' వాల్ పోస్టర్లను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు జిల్లా అధ్యక్షుడు రామస్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందు యాదవ్, ఎస్.మల్లేష్‌లతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ మేడే ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే గొప్ప కార్మిక పండుగ అని వాడవాడల అన్ని గ్రామాలు మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించే కార్మిక వర్గం పోరాట చైతన్యాన్ని ప్రదర్శించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా మేడే స్పూర్తితో పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ, సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.



### కార్మిక బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ రాక : జంగయ్య

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా ఏప్రిల్ 21న నిర్వహించే ర్యాలీ,బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ పాల్గొననున్న కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభలు ఏప్రిల్ 21, 22 తేదీలలో శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్లో జరుగుతున్నాయని తెలిపారు. మొదటిరోజు ఏప్రిల్ 21న జరిగే భారీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

# రైతుకు, భూమికి ఉన్నబంధమే భూభారతి
### శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** నూతన ఆర్ఒఆర్ చట్టం ద్వారా అందరికీ న్యాయం జరుగుతుందని, రైతుకు భూమికి ఉన్న బంధమే భూభారతి అని, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ హాల్, శంకర్ పల్లి బద్దం మాణిక్య రెడ్డి ఫంక్షన్ హాల్ లలో భూభారతి చట్టం2025పై రైతులకు అవగాహన సదస్సులలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిలతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన చట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేవేళ్ళ ఆర్‌ఒడి చంద్రకళ చదివి వివరించారు.ఈ సందర్భంగా చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రైతులకు, ప్రజలకు ఏవిధంగా న్యాయం జరుగుతుందన్న విషయంపై వివరించారు. ధరణి ద్వారా రైతులు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కకున్నారని, అలాంటి వారికి ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణి స్థానంలో సరళమైన భూ భారతి పోర్టల్‌ను ఈ నెల 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించడం జరిగిందన్నారు. భూమి హక్కుల భద్రతకు,భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి అమల్లోకి తెచ్చిందని గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం గురించి రైతులకు వివరిస్తూ అవగాహన కల్పించారు.ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్ఒఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. మే మొదటి వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇదివరకే ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిష్కారించడం జరుగుతుందని,మళ్ళీ దరఖాస్తులుచేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. మీకు ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు అప్పీలు చేసుకునేందుకు ఈ చట్టం అవకాశం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్య గౌడ్, సురేందర్,ప్రజా ప్రతినిధులు, అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలి
### సిపిఐ కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** భవన నిర్మాణ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. శనివారం భవన నిర్మాణ కార్మిక సంఘం(ఎఐటియుసి అనుబంధం), అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణరెడ్డి సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్‌లో ఈ నెల 21,22 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర మాసభలను విజయవంతం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కట్టించి ఇవ్వడంతో పాటు విద్య వైద్య ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క కార్మికునికి పదివేల రూపాయలను పెన్షన్ ఇవ్వాలని,భవన నిర్మాణ కార్మికులు పనిచేస్తూ మృతి చెందితే వారికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని, డెలివరీ అయిన కార్మికురాలకు 50వేల రూపాయలు ఇవ్వాలని, తెలంగాణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అజ్మేరా హరి సింగ్ నాయక్,బిఓసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్,బిఒసి రంగారెడ్డి జిల్లా కోశాధికారి కేతరాజు నరసింహ, ధూపం నిరంజన్,సాకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పనులతో ధ్వంసమైన రోడ్లు
### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మిషన్ భగీరథ పనుల వల్లనే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 7,8వార్డుల్లో రూ.21లక్షల డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ అధికారులు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ రోడ్డును ధ్వంసం చేయడంతోనే ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ధ్వంసం చేసిన రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా అధికారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతోనే అనేక సమస్యలు వస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు అవసరమైన మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు ఉద్యమ తరహాలో కార్యకర్తలు, నాయకులు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇసుక వ్యాపారులకు శాశ్వత స్థలం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. పట్టణంలోని మహారాజా దాబా వెనుక భాగంలో ఉన్న ఇసుక లారీల వద్దకు వెళ్ళి పరిశీలించడంతోపాటు నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మున్సిపల్ కమీషనర్ సునీత, మాజీ కౌన్సిలర్లు కౌలస్య శ్రీశైలం గౌడ్, కృష్ణవేణి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సోనియా, రాహుల్‌గాంధీలపై మోదీ కక్షసాధింపు
### యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కక్షసాధింపు చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ఆరోపించారు. శనివా రం షాద్‌నగర్ యువజన కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున హైదారాబాద్ ఇడి కార్యాలయం ముట్టడికి తరలివెళ్ళారు. ఈ సందర్భంగా అందె మోహన్ ము దిరాజ్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాలు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదని, హెరాల్డ్ కేసులో ఇడి అధికారులు సోనియా, రాహుల్ గాంధీల పేర్లు చేర్చడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాలనే కాంగ్రెస్ నేతలపై ఇష్టారాజ్యం గా కేసులు పెట్టి నానా అవస్థలకు గురి చేస్తున్నారని వాపోయారు. సామాజిక దృక్పదంలో అప్పటి జవహార్‌లాల్ నెహ్రూ పత్రికను స్థాపిస్తే , ఆర్థిక ఇబ్బందుల కారణంగా పత్రికను మూసివేస్తే ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇడి ఇచ్చిన నోటీసులకు తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కడి శివ చరణ్, ఉపాధ్యక్షులు అరుణ్‌గౌడ్, దీపక్ ప్రజ్ఞ, షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం వల్లే రూ.7కోట్ల హెచ్‌ఎండిఎ నిధులు వాపస్

**ప్రజాపక్షం/కొత్తూరు:** మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరీ కారణంగా రూ.7కోట్ల హెచ్‌ఎండిఎ నిధులు వాపస్ వెళ్ళాయని, ఇందుకు అధికారులే పూర్తి బాధ్యత వహించి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కొత్తూరులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వివిధ పనుల రూపంలో పూర్తి చేయాల్సిన నిధులు అధికారులు ఆలసత్వం వహించడంతో ఆ నిధులు వెనక్కి వెళ్ళాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తే ఆ నిధులు వెళ్ళివి కావని, ఇందుకు అధికారులు బాధ్యత వహించి నిధులు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తం 10కోట్ల నిధులు మంజూరు కాగా కేవలం మూడు కోట్ల పనులు మాత్రమే పూర్తి చేశారని, మిగిలిన 7కోట్లు వాపస్ వెళ్ళాయని వివరించారు. కొత్తూరు మున్సిపాలిటిలో ప్రోటోకాల్ సమస్య ఉందని, ఏ వార్డులో ఏ పనులు చేస్తున్నారో అర్థం కానీ సమస్యగా ఉండిపోయిందన్నారు. రానున్న రెండు నెలల పాటు మున్సిపాలిటిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజల పట్ల నిర్లక్ష్యం వహిస్తే స హించేది లేదని, ప్రజల పక్షాన మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్, వైస్ చైర్మెన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాధవి గోపాల్ గౌడ్, చంద్రకళ రాజేందర్ గౌడ్, కోస్గి శ్రీను, సోమ్లానాయక్‌లు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/మోమిన్‌పేట్:వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని లబ్దిదారులకు మంజూరైన 42కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్దిదారులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలని కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/నాగారం:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ సిబ్బంది జీతాలు ఇవ్వాలని కమిషనర్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు. గత రెండు నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత కొన్ని రోజులుగా మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పక్క మున్సిపాలిటీ అయిన నాగారంలో కార్మికులకు ఫిబ్రవరి నెల కూడా జీతాలు ఇచ్చారని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఎందుకు ఇవ్వడంలేదని కమిషనర్‌ను నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి నిలదీశారు. తక్షణమే జీతాలు చెల్లించాలని లేని పక్షంలో సోమవారం భారీ ఎత్తున ధర్నా చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, బిఎంఎస్ నాయకులు మోర నాగమల్లారెడ్డి, సామల భరత్‌రెడ్డి, రామిడి బాపిరెడ్డిలు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులు పూర్తికి చర్యలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వర్షాకాలం సంబంధించిన పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పూర్తి చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగ డిఇ మహేష్, ఎఇ నవీన్‌లతో శనివారం సమీక్ష నిర్వహించారు. విష్ణుపురి కాలని, గౌతమి పాఠశాల వద్ద, బాలసరస్వతి నగర్, వెస్ట్ శ్రీ కృష్ణనగర్‌లోని నాలా పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలంలో ఎలాంటి ముంపుకు గురి కాకుండా ప్రణాళిక రూపొందించి ముందస్తుగానే అవసరమైన పనులు చేపట్టాలన్నారు.



## ప.బెంగాల్ హింసా ఘటనలపై నిరసనలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పశ్చిమ బెంగాల్‌లో గత వారం రోజులుగా హిందువులపై కొనసాగుతున్న దాడులకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి) ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్ చౌరాస్తాలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. విహెచ్‌పి తెలంగాణా ప్రాంత ఉపాధ్యక్షురాలు బేరి సునీతా రాంమోహనరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనారిటీ ఓట్ల రాజకీయంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం హిందువులను బలి చేస్తున్నారని, వెంటనే శాంతి భద్రతల పరిరక్షణకోసం రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గున్నాల సునీత యాదవ్, శ్రవణ్, తెలంగాణా ప్రాంత గోరక్ష సభ్యులు శివానంద్, జిల్లా కార్యదర్శి రజనీ కాంత్, సహ కార్యదర్శులు రాజిరెడ్డి గోపాలాచారి, గోరక్షా ప్రముఖ్ బాలాజి, మణిమాల, మాతృశక్తి సంయోజిక పశ్యంతి, ప్రచార ప్రముఖ్, పవన్, గోరఖ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన
### మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో బాగంగా తూంకుంట మున్సిపాలిటిలో విశ్వవిశ్వాని కళాశాల విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అప్పుడే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చునని అన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ హనుమాన్‌గౌడ్, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్, ఎస్ఐ దశరథ, విశ్వవిశ్వాని కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల కమిటీతో సమావేశం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో ఎంపిడిఓ గీతారెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడివో గీతా రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అధికారులు, కమిటీ సభ్యులు పారదర్శకంగా ఉండాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వచ్చే విదంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ డిఇ బలవంతరావు, ఎఇ అల్లాజి, ఎంపిఓ మంగతయారు. కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భూభారతితో భూవివాదాలకు చెక్

* ధరణిలో అన్ని సమస్యలు ఎదుర్కొన్నాం
* వేలాదిగా సర్వేయర్ల నియామకాలు

### కలెక్టర్ గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ఇకపై భూవివాదాలు సరళీకృతంగా పరిష్కారమయ్యేందుకు దోహదపడుతాయని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. ముందస్తుగా ఈ చట్టంలోని అంశాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం నేరుగా అవగాహనా సదస్సులు నిర్వహించటం మంచి మార్పుకు శ్రీకారమన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలోని సూపర్ సంగీత్ ఫంక్షన్ హాలులో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అమలులో ఉన్న ధరణి చట్టంలోని సమస్యలను తొలగించి దాని స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకొని వచ్చిందని, దీనివల్ల ప్రతి ఒక్కరి భూ సమస్యలు పారదర్శకంగా పరిష్కారమవుతాయన్నారు. అనుభవం కల్గిన విశ్రాంతి ఉద్యోగులు, నిపుణలతో చర్యల అనంతరం భూభారతి చట్టం రూపొందించారన్నారు. గత ధరణి చట్టంలో రెవెన్యూ అధికారులకు సరైన అధికారాలు లేనందున సరైన రీతిలో పరిష్కారం కాలేని సమస్యల విషయమై న్యాయ స్థానాలను ఆశ్రయించవలసి వచ్చేదని, దీనివల్ల వృథా వ్యయ ప్రయాసలు, కాలయాపన జరిగేదని,ఈ కారణంగా అనేక సమస్యలు అపరిష్కృతంగా పడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి ప్రధాన సమస్య పరిష్కారానికి గాను భూభారతి చట్టంలో తహసీల్దార్ స్థాయినుండి సిసిఎస్ఏ స్థాయి వరకు సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించటం జరిగిందన్నారు. ధరణిలో భూములు కొనుగోలు, అమ్మకాలే కాకుండా భూరికార్డుల్లో పేర్ల మార్పులకు సైతం ఇబ్బంది ఉండేదన్నారు. ధరణిలో నష్టపోయిన వారు ఇప్పటికీ న్యాయం పొందలేక పోయారని, భూభారతి చట్టం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా చట్టంలోని అంశాలన్నిటిని పొందుపరచారన్నారు. ధరణిలో విఆర్ఓ వ్యవస్థను తీసేయటం ద్వారా గ్రామాల్లో రైతుల చిన్న చిన్న సమస్యలు పెరిగి పోయాయన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో గ్రామ పరిపాలనాధికారి నియామకాలతో గ్రామ స్థాయి సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొని పోయే దిశగా చర్యలు చేపట్టటం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ఆధార్ తరహాలో భవిష్యత్తులో శాటిలైట్ ఆధారంగా భూములకు సంబంధించి సర్వే చేసిన కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో భూధార్ కార్డులు రానున్నాయన్నారు. తద్వారా పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని కలెక్టర్ గౌతం తెలిపారు. భవిష్యత్తు తరాలకు భూముల దురాక్రమణ వంటి సమస్యలు ఉండవని, ఈ తాజా చట్టం ద్వారా భూము ల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం సైతం ఉందని, భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. దీనికిగాను అధిక సంఖ్యలో ప్రభుత్వం వేలాది సంఖ్యలో సర్వేయర్లను నియమించనుందని కలెక్టర్ తెలిపారు.

అవగాహనా సదస్సుల్లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని అంశాలను వివరిస్తారన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయం సహాయం అందించే దిశగా చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. కీసర ఆర్డీఓ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ చిక్కులు లేని హక్కుల భూరికారుడు ఉన్న రాష్ట్రాల్లోనే వాణిజ్య, వ్యాపార రంగాల్లో పెట్టుబడులు ఎక్కువగా వస్తాయని, తద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్సింహా, మూడుచింతలపల్లి తహసీల్దార్ నర్సింహారెడ్డి అధికారులు, రైతులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నా రు.



## మహానుభావుల స్ఫూర్తితో ప్రజా సమస్యలను ప్రస్తావిస్తా
### సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/దుండిగల్:** ఎఐటియుసి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, ధనవంతులు వ్యాపారస్తులకు నిలయమైనటువంటి పార్లమెంటు అసెంబ్లీ నేడు ఒక రైతుబిడ్డగా శాసనమండలి సభ్యునిగా నన్ను కమ్యూనిస్టు పార్టీ పంపించడం చాలా గర్వకారణమని పార్టీ నాయకులైనటువంటి ధర్మ బిక్షం ఇచ్చినటువంటి స్ఫూర్తితో రానున్న రోజుల్లో ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తానని కాంగ్రెస్ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను పూర్తిచేసే వరకు ప్రజల తరఫున మాట్లాడతానని అన్నారు. గతంలో పార్లమెంటులో శాసనమండలం కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఉన్నప్పుడు ప్రజల సమస్యలపై చర్చించేవారని కానీ నేడు పార్లమెంటు అసెంబ్లీ వ్యాపారస్తులకు రౌడీలకు, డబ్బులు ఖర్చు పెట్టే వారితో నిలయం అయిందని వారికి భిన్నంగా ప్రజా సమస్యల కోసమే పనిచేస్తానని అన్నారు. మనుషులు బలహీన పడలేదని కమ్యూనిజం బలహీన పడలేదని ప్రజలు తెలుసుకుంటున్నారని కావున కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు నిత్యం ప్రజల్లోనే ఉండి వారి సమస్యల కోసం పనిచేస్తే రానున్నది కమ్యూనిజమే అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వము కార్మికుల హక్కులను కాల రాస్తున్నాయని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్‌టిసి లో యూనియన్‌ను నిషేదించారని మళ్ళీ యూనియన్ లను పునరుద్దరించుకుంటే కార్మికులకు న్యాయం జరుగుతుందని దాని కోసం మన శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు కృషి చెయ్యాలని, కార్మికుల, రైతుల, యువజనుల సమస్యలను ప్రస్థావించేది కేవలం కమ్యూనిస్టులేనని అన్నారు.ఈ కార్యక్రమానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు స్వామి అధ్యక్షతన ఎఐటియుసి ఉపాధ్యక్షుడు ఏసురత్నం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, రవి చందేర్, హరినాథ్ రావు, తులసి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు ప్రవీణ్, రాములు, ఎఐటియుసి నాయకులు బిక్షపాతి, యాద య్య, కృష్ణమూర్తి, నర్సింహా రెడ్డి, స్వామి, రమేష్,సుంకి రెడ్డి,కమలమ్మ, కృష్ణ, శీనివాస్, ముసలయ్యలతో యూనియన్ల కార్మికులు పాల్గొన్నారు.

## ఇకనైనా దుర్గంధం దూరం చేయరా?
### పొంగుతున్న డ్రైనేజీతో అవస్థలు పడుతున్న బాలసరస్వతీనగర్ వాసులు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పేరుకు పోయిన చెత్త కుప్పలు, రోడ్లపై పారుతున్నమురికి నీటి ప్రవాహం, దీనికి తోడు అడపా దడపా పడుతున్న వర్షాలు, అనారోగ్యాలకు దారి తీస్తున్న అపరిశుభ్ర వాతావరణంతో గత మూడు వారాలుగా నానా అవస్థలకు అటు కార్పొరేటర్, ఇటు జలమండలి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా పట్టించుకోవటం లేదంటూ మల్కాజిగిరి డివిజన్‌లోని ఆనంద్‌బాగ్ ప్రధాన రహదారికి కాస్తంత దూరంలోనే ఉన్న బాల సరస్వతినగర్ కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. సమీప ప్రాంతాల ఇళ్లల్లోంచి డ్రైనేజి పైపులు పగిలి పోవటమో, పూర్తిగా నిండి పోవటమోలాంటి కారణాల వల్ల ఈ సమస్య ఏర్పడి ఇక్కడి డ్రైనేజి మ్యాన్‌హోల్‌పై భాగం మీదుగా లోపలి నుండి వరదల్లా మురికి నీరు వెదజల్లుతూ రహదారిపై ప్రవహిస్తూ దుర్గంధ వాసన వెదజల్లుతుండటంతో ఈ మార్గం నుండి వెళ్లాలంటేనే జంకాల్సిన దుస్థితి నెలకొంది. ఇక సమీపంలోని ఇళ్లలో నివసిస్తున్న వారైతే కిటికీలు, తలుపులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై జలమండలి అధికారులతో పాటు స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ దృష్టికి తీసుకొని వచ్చినా పట్టించుకోవటం లేదని ఇక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం డివిజన్‌లోని ఏదో ఓ ప్రాంతంలో పర్యటిస్తున్నానని, సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తానంటూ పత్రికల్లో చెప్పుకొనే స్థానిక కార్పొరేటర్ తమ సమస్య కళ్లెదుట కనపడుతున్నా, తాము చెబుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మ్యాన్‌హోల్ నుండి మురికి నీరు పారుతున్న డ్రైనేజి సమస్య పట్టించుకోకపోతే తమ ఇళ్లలోని తామంతా రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, వెంటనే సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులతో పాటు కార్పొరేటర్‌ను స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## పాలి క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్యారోగ్య శాఖాధికారులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాలి క్లినిక్‌ను మేడ్చల్ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు శనివారం సీజ్ చేసారు. మల్లాపూర్ ప్రాంతంలో కొనసాగతున్న లక్ష్మి వెంకటేశ్వర మెడికల్ స్టోర్ పేరిట మందుల దుకాణం నిర్వాహకులు గత కొద్ది కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణం పక్కనే మరో గదిలో పాలిక్లినిక్, డయాగ్నస్టిక్ సెంటర్ అంటూ బోర్డులు పెట్టారు. ఇక్కడ కొంత మంది వైద్యులతో వైద్య సేవలు, సిబ్బందితో వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపిస్తూ సేవలందిస్తున్నారు. ఈ విషయంపై విశ్వసనీయ సమాచారం అందుకొన్న డిఎంహెచ్ఓ డాక్టర్ ఉమాగౌరి తమ సిబ్బందితో శనివారం పాలిక్లినిక్‌పై దాడి చేసి పరిశీలించారు. పాలిక్లినిక్ డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేనందున దాన్ని సీజ్ చేసారు.






## 25న తెలంగాణ గిరిజన సమాఖ్య మహాసభలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఈ నెల 25న జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్‌నగర్‌లో జరుగను న్న మేడ్చల్ జిల్లా తెలంగాణా గిరిజన సమాఖ్య మహాసభలు విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప నాయక్, జిల్లా ఇన్‌చార్జి తోటపల్లి శంకర్‌లు తెలిపారు. శనివారం మహాసభలకు సంబంధించిన కరపత్రం విడుదల చేసా రు. రాష్ట్రంలో గిరిజన సమస్యలపై నిరంతరం గిరిజన సమాఖ్య అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి మోతె రాజేశ్వరి, పద్మమ్మ, లావణ్య, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్ రావు,పోక్సో కోర్టు జడ్జి కిరణ్, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి మురళీ మోహన్ బదిలీపై వెళ్లున్న సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేసి వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయ మూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి,సెక్రెటరీ బాపిరెడ్డి,ఉ పాధ్యక్షురాలు మాధవి, ఇతర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం
### పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక, రూ.లక్ష చొప్పున తొలి దశ బిల్లుల మంజూరు
### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పేదల సొంతింటి కల ఆశయాన్ని సాకారం చేసేందుకు రాష్ట ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. పథకంలో భాగంగా నిరుపేదలైన అర్హులకే ఇళ్లు మంజురు చేయాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయించిందని అందుకు అనుగుణంగా ప్రతి మండలంలో ఒక గ్రామం చొప్పున గత జనవరి 26న ప్రభుత్వం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిందన్నారు. బేస్మెంట్ స్థాయి వరకు నిర్మా ణం పూర్తియితే లక్ష,పైకప్పు స్థాయి దాటిన తర్వత 2లక్షలు మొత్తం పనులు పూర్తి అయిన తర్వత 5లక్షలను ప్రభుత్వం లబ్దిదారులకు అందజేస్తుంది. జిల్లాలో మొదటి విడుతలో భాగం గా మొత్తం 2285 మంది లబ్దిదారులను గుర్తించామన్నారు. ఇందులో 340మంది ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేయగా 45మంది లబ్దిదారులకు బేస్మెట్ స్థాయి వరకు ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. తొలి విడుతగా బేస్మెంట్ దశ నిర్మాణం పూర్తి చేసుకున్నా వారికి లక్ష రూపాయలు చొప్పున ఖాతా ల్లో ప్రభుత్వం జమ చేసిందని, ఇప్పటి వరకు 26మందికి లక్ష చొప్పున ఈ నెల 15న ముఖ్యమంత్రి చేతుల మీదగా చెక్కులు అందజేశారు. వరికి లక్ష చొప్పున జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. త్వరలో రెండవ దశలో లబ్దిదారులను ఎంపికచేయడం జరుగుతుంది అని అన్నారు. ఈనెల 22నుంచి 30లోపు మండల స్థాయి అధికారులు పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి మే2తేదీన గ్రామ పంచాయతీ వార్డు కార్యాలయాల్లో లబ్దిదారుల జాబితాను ప్రదర్శిస్తామని అన్నారు. మే 5న అర్హులైన లబ్ది




దారులకు మంజురుచేస్తామని తెలిపారు.

**భూ భారతి ఎంతగానో ఉపయోగపడుతుంది**

**మర్పల్లి :**భూ సమస్యలను శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో ఉపయోగపడుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ అన్నారు. శానివారం మర్పల్లి మండల మండల కేంద్రంలో ని రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గోన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రతా భావానికి తావు నీయకుండా, జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూ భారతి చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు 2025ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్ ముటేషన్ ,నిషేదిత భూము లు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతుందని అన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించడం జరుగుతుందన్నారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య గ్రామీణ ప్రజలకు అర్థం అయ్యేల రూపొందించడం జరిగింది అన్నారు. రోజుకు రెండు మండలాల చొప్పున అధికారులు పర్యటిస్తారని అలాగే ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది అని అన్నారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర ఆర్ఓఆర్ చట్టం పై ప్రజలకు తెలియజేశారు. అనంతరం మర్పల్లి మండలంలోని మంజూరైన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మునీరుద్దీన్, మార్కెట్ కమిటి చైర్మన్ మహేందర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## 17మంది కానిస్టేబుళ్లకు పదోన్నతులు
### ఎస్‌పి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**వికారాబాద్ జిల్లాలో పనిచేస్తున్న 17మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పదోన్నతి పొందిన పేరుపేరున అభినందించిన జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి అనేది హోదాలో మార్పు మాత్రమే కాదని మరింత బాధ్యత పెరిగింది అని గుర్తించాలని , క్రమశిక్షణ ,నిజాయితీ , వృతి నైపుణ్యంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ సమస్యల పట్ల మానవతా దృక్పథంతో స్పందించేందుకు కృషి చేయాలని ఎస్పి తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో హెడ్ కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని ,మంచిగా పని చేసి ప్రజల మన్నలను పొందలని తెలిపారు. ప్రభుత్వ నియమనిబంధనలు పాటిస్తు ఉన్నత అధికారుల సూచనలను పాటిస్తూ ,జూనియర్ సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. పపదోన్నతి పొందిన వారు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారిని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**ప్రజాపక్షం/పరిగి:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెలే డిసిసి అధ్యక్షులు టి,రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజకొనడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని అన్నారు. రైతులు అందోళన చెందవల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుంది అని అన్నారు. చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరుశురాం రెడ్డి ,హనుమంతు, కృష్ణ, తౌర్యానాయక్, తదితరులు పాల్గోన్నారు.

# క్రీడ



## ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగింపు

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగించాలని అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య హెచ్‌సీఏను ఆదేశించారు. లారడ్స్ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్‌పై ఆయన శనివారం విచారణ చేపట్టారు. 'హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అజారుద్దీన్ తన పేరు పెట్టుకోవాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం చెల్లదు. ఇందులో విరుద్ధమైన ప్రయోజనాలున్నాయి' అని జస్టిస్ ఈశ్వరయ్య తీర్పునిచ్చారు. వెంటనే నార్త్ స్టాండ్‌కు అజారుద్దీన్ పేరు తొలగించాలని హెచ్‌సీఏను ఆదేశించారు. టికెట్లపై ఇకనుంచి ఆపేరు ప్రస్తావన ఉండొద్దని తేల్చి చెప్పారు.

## బాదేసిన బట్లర్..

### గుజరాత్ ఐదో విజయం



ఐపిఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ జైత్ర యాత్ర కొనసాగుతోంది. సొంతగడ్డపై రెచ్చిపోయిన శుభ్‌మన్ గిల్ సేన టేన టాపర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు షాకిచ్చింది. భారీ ఛేదనలో వికెట్ కీపర్ జోస్ బట్లర్(97) విధ్వంసక హాఫ్ సెంచరీ సాధించడంతో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్లు విఫలమైనా.. బట్లర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. షెర్ఫానే రూథర్‌ఫోర్డ్ (43)తో కలిసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 119 రన్స్ జోడించడంతో ఐపీఎల్ చరిత్రలో రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది గుజరాత్. ఫలితంగా టాపర్‌కు రెండో ఓటమి ఎదురైంది. సొంతగడ్డపై గుజరాత్ టైటన్స్ పంజా విసిరింది. టాపర్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెక్ పెట్టింది. 204 పరుగుల లక్ష్య ఛేదనలో జోస్ బట్లర్(97 నాటౌట్) మెరుపు హాఫ్ సెంచరీతో కదం తొక్కగా 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఛేదనలో గుజరాత్‌కు ఆదిలోనే పెద్ద షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(7)ను కరుణ్ నాయర్ రనౌట్ చేశాడు. దాంతో, 14 పరుగులకే తొలి వికెట్ పడింది. ఆ తర్వాత సాయి సుదర్శన్(36) అండగా జోస్ బట్లర్(97 నాటౌట్) ఢిల్లీ బౌలర్లను ఉతికేశాడు. వీళ్లిద్దరూ రెండో వికెట్‌కు 60 రన్స్ జోడించి గుజరాత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. అయితే.. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని కుల్దీప్ యాదవ్ విడదీశాడు. డేంజరస్ సుదర్శన్‌ను ఔట్ చేసి ఢిల్లీకి రెండో వికెట్ అందించాడు. మిచెల్ స్టార్క్ వేసిన 15వ ఓవర్లో రెచ్చిపోయిన బట్లర్ వరుసగా 4, 4, 4, 4, 4 బాది 20 రన్స్ పిండుకున్నాడు. దాంతో, గుజరాత్ గెలుపు వాకిట నిలిచింది. విజయానికి 11 పరుగుల దూరంలో రూథర్‌ఫోర్డ్ ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన రాహుల్ తెవాటియా(6) ఆఖరి ఓవర్లో సిక్సర్ కొట్టాడు. ఆ తర్వాత బంతికి వైడ్ రూపంలో 5 రన్స్ వచ్చాయి. దాంతో, గుజరాత్ ఖాతాలో ఐదో విజయం చేరింది.

**అక్షర్, అశుతోష్ దంచేయగా**

అహ్మదాబాద్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ భారీ స్కోర్ చేసింది. గుజరాత్ టైటాన్స్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న ఢిల్లీ బ్యాటర్లు సమిష్టిగా కదం తొక్కారు. అక్షర్ పటేల్ (33) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా ఓపెనర్ కరుణ్ నాయర్(31) మరోసారి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ప్రసిద్ కృష్ణ(441) హడలెత్తించినా.. ఆఖర్లో ఫినిషర్ అశుతోష్ శర్మ(37) సిక్సర్ల మోతతో జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. దాంతో, ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది.

## 3 పరుగుల తేడాతో రాజస్థాన్ ఓటమి



ఐపిఎల్ 18 సీజన్‌లో మరో ఉత్కంఠ పోరు. ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు లక్నో సూపర్ జెయింట్స్ ఊహించని షాకిచ్చింది. అవేశ్ ఖాన్(337) సంచలన బౌలింగ్‌తో లక్నో 2 పరుగుల తేడాతో గెలుపొందింది. భారీ ఛేదనలో యశస్వీ జైస్వాల్(74), కెప్టెన్ రియాన్ పరాగ్(39).. అరంగేట్రం కుర్రాడు వైభవ్ సూర్యవంశీ(34)లు రాణించినా.. లక్నో బౌలర్లు పుంజుకొని రాజస్థాన్ నుంచి విజయాన్ని లాగేసుకున్నారు. ఐపీఎల్‌లో మరో ఉత్కంఠ మ్యాచ్. ఆఖరి ఓవర్ వరకూ ఆసక్తిగా సాగిన పోరులో జయభేరి మోగించింది. అలవోకగా గెలుస్తుందనుకున్న రాజస్థాన్ ఆఖర్లో తడబడి ఓటమి పాలైంది. మొదట ఆడిన లక్నో 180 రన్స్ కొట్టింది. భారీ ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు దంచేశారు. యశస్వీ జైస్వాల్(74) అర్ధ శతకంతో చెలరేగాడు. ఈ సీజన్‌లో ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు ఇది మూడో హాఫ్ సెంచరీ. ఇక. 14 ఏళ్లకే అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ(34)సైతం దూకుడుగా ఆడాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన ఈ కుర్రాడు.. అవేశ్ ఖాన్ ఓవర్లో భారీ సిక్సర్ బాదాడు. మొదట మ్యాచ్‌లోనే ఫిఫ్టీ కొట్టేలా కనిపించిన ఈ చిచ్చరపిడుగు అనూహ్యంగా మర్క్‌రమ్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు. దాంతో, 85 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ కాసేపటికే నితీశ్ రానా(8)ను యశ్ ఠాకూర్ పెవిలియన్ పంపాడు. ప్రస్తుతం కెప్టెన్ రియాన్ పరాగ్ (15) ఆడుతున్నాడు. 18వ ఓవ ర్లో యశస్వీని బౌల్డ్ చేసి అవేశ్ చివరి బంతికి పరాగ్‌ను ఎల్బీగా ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. 12 బంతుల్లో 20 రన్స్ అవసరం కాగా.. ప్రిన్స్ బౌలింగ్‌లో హెట్‌మైర్(12) ఫోర్, 6 కొట్టా డు. 20వ ఓవర్లో 9 రన్స్ అవసరమయ్యాయి. తొలి బంతికి జురెల్ సింగిల్.. ఆ తర్వాత డబుల్స్.. మూడో బంతికి శార్థూల్‌కు క్యాచ్ ఇచ్చి హెట్‌మైర్ ఔటయ్యాడు. నాలుగో బంతికి యార్కర్ వేసిన అవేశ్ పరుగు ఇవ్వలేదు. ఐదో బంతిని శుభం దూబే(3) గాల్లోకి లేపగా మిల్లర్ జారవిడవడంతో 3 రన్స్ వచ్చాయి. ఆఖరి బంతికి సైతం ఒకటే రన్ రావడంతో లక్నో 2 పరుగుల తేడాతో గెలుపొందింది.

**ఆ ఇద్దరి మెరుపులతో**

జైపూర్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు చెలరేగారు. ఇన్నింగ్స్ ఆరంభంలో తడబడినా ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేశారు. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్(66), ఇంప్యాక్ట్ ప్లేయర్ ఆయుశ్ బదొని(50)లు ఆదుకున్నారు. క్రీజులో పాతుకుపోయిన ఈ ఇద్దరూ అర్ధ శతకాలతో చెలరేగి నాలుగో వికెట్‌కు 76 రన్స్ జోడించి.. భారీ స్కోర్‌కు పునాది వేశారు. ఆఖర్లో అబ్దుల్ సమద్(30 నాటౌట్) నాలుగు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. సందీప్ శర్మ వేసిన 20వ ఓవర్లో ఏకంగా బంతిని నాలుసార్లు స్టాండ్‌లోకి పంపి 27 రన్స్ పిండుకున్నాడు. దాంతో, లక్నో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది.

# రీల్

## 2027కి 'రామాయణ 2'






బాలీవుడ్ సినిమా నుంచి రాబోతున్న పలు ఎపిక్ చిత్రాల్లో టాలెంటెడ్ హీరో రణబీర్ కపూర్ అలాగే సాయి పల్లవి కాంబినేషన్ లో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'రామాయణ' కూడా ఒకటి. మరి ఈ సినిమాలో రణబీర్ రామునిగా సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. అయితే ఆల్రెడీ రెండు భాగాలుగా ఈ సినిమాని అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. వాటిలో ఆల్రెడీ పార్ట్ 1 షూటింగ్ కూడా కంప్లీట్ చేసినట్టు తెలుస్తుంది. ఇక లేటెస్ట్‌గా పార్ట్ 2పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇపుడు తెలుస్తుంది. దీని ప్రకారం మేకర్స్ పార్ట్ 2 షూటింగ్ ఆల్రెడీ స్టార్ట్ చేసేసారట. ప్రస్తుతం సాయి పల్లవిపై లంకలో కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఈ తర్వాత రణబీర్ పై సన్నివేశాలని తెరకెక్కించనున్నారట. సో ఇలా పార్ట్ 2 షూటింగ్ కూడా ప్రస్తుతం శరవేగంగా కంప్లీట్ అవుతుంది అని చెప్పాలి. ఇక వీటిలో పార్ట్ 1 ఈ ఏడాదిలో దీపావళి కానుకగా రిలీజ్ కానుండగా పార్ట్ 2ని 2027కి లాక్ చేసిన సంగతి తెలిసిందే.

## పెళ్లిపై నమ్మకం లేదు

### త్రిష వ్యాఖ్యలు



నాలుగు పదుల వయసులోనూ వరుస సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు నటి త్రిష. అయితే, ఆమె వైవాహిక బంధంలోకి ఎప్పుడు అడుగు పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆమె పెళ్లి గురించి ఇప్పటికే ఎన్నో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆమె వివాహంపై తన అభిప్రాయాన్ని బయటపెట్టారు. తనకు పెళ్లిపై సదుద్దేశం లేదని వ్యాఖ్యలు చేశారు. 'థగ్ లైఫ్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెను.. 'మూడు ముళ్ల బంధంపై మీ అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించగా.. "నిజం చెప్పాలంటే నాకు వివాహంపై నమ్మకం లేదు. నాకు పెళ్లి అయినా ఓకే, కాకపోయినా ఫర్వాలేదు" అని ఆమె బదులిచ్చారు. ఆమె ఇచ్చిన సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ షాకయ్యారు.

## ఆ నొప్పి మగవాళ్లకు వస్తే... అణు యుద్ధాలే

### జాన్వీ కపూర్



నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే బాధ వర్ణణాతీతం. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇక అప్పుడు వచ్చే మూడ్ స్వింగ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, నెలసరిలో వచ్చే నొప్పిని చులకనగా చూస్తే అది మరింత బాధగా ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రస్తావించారు నటి జాన్వీ కపూర్. తనకు కూడా పీరియడ్ మూడ్ స్వింగ్స్ ఉన్నాయన్నారు. 'నాకు పీరియడ్స్ సమయంలో విపరీతమైన మూడ్ స్వింగ్స్ వస్తాయి. నా మాట తీరుని బట్టి నేను పీరియడ్స్‌లో ఉన్నానని ఎదుటి వారికి అర్థం అయిపోతుంది. అందుకే నేను చిరాకుగా మాట్లాడగానే 'నీకు ఇది ఆ సమయమా' అని అడుగుతారు. అయితే ఈ ప్రశ్న అడిగే విధానమే ఒక్కోసారి బాధను కలిగిస్తుంది. కొందరు ఈ నెలసరి నొప్పి అనేది చాలా చిన్న విషయంగా పరిగణిస్తూ వ్యంగంగా మాట్లాడతారు. దీన్ని అర్థం చేసుకున్నవాళ్లు మాత్రం మనకు ప్రశాంతత కలిగేలా ప్రవర్తిస్తారు. విశ్రాంతి తీసుకోమని సలహాలిస్తారు' 'పీరియడ్ పెయిన్ అనుభవించే వారికి మాత్రమే తెలుస్తుంది. ఆ సమయంలో మేం పడే బాధను, ఈ మానసిక స్థితిని అబ్బాయిలు ఒక్క నిమిషం కూడా భరించలేరని కచ్చితంగా చెప్పగలను. ఒకవేళ మగవాళ్లకు పీరియడ్స్ వస్తే ఆ నొప్పికి అణు యుద్ధాలే జరిగేవేమో..!' అని జాన్వీ చెప్పారు. ఈ విషయం గురించి ఆమె ధైర్యంగా మాట్లాడారంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

## నటుడు అజిత్‌కు మళ్లీ కారు ప్రమాదం..




తమిళ నటుడు అజిత్ మరోసారి కారు ప్రమాదానికి గురయ్యారు. బెల్జియంలోని సర్క్యూట్ డి స్పాఫ్రాంకోర్చాంప్స్ రేస్‌లో ఆయన పాల్గొన్నారు. అయితే, రేస్ సమయంలో నియంత్రణ కోల్పోవడంతో ఆయన నడిపిన కారు ట్రాక్ నుంచి పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అజిత్ సురక్షితంగా బయటపడ్డారు. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఇంతకు ముందు కూడా అజిత్ రెండు సార్లు కారు ప్రమాదానికి గురయ్యాడు. అయితే అప్పుడు కూడా అజిత్‌కు ఎలాంటి గాయలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల గుడ్ బ్యాడ్ అగ్లీ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకున్నాడు అజిత్. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదలై రూ.200 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. సిమ్రాన్, త్రిష కృష్ణన్ ఇందులో కథానాయికలుగా నటించారు.

## నోటీసులపై పోలీసుకే స్మితా ట్విస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం రోజురోజుకూ మరింత ముదురుతోంది. ఇదివరకే రాష్ట్రం నుంచి కేంద్రానికి, సుప్రీం కోర్టుకు విషయం వెళ్లగా ఆ భూములలో ఎలాంటి చర్యలు చేపట్టరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. అయితే ఈ భూములకు సంబంధించి ఫొటోలు, వీడియోలు షేర్ చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్ సహా పలువురికి పోలీసులు నోటీసులు జారీ చేశారు.తనకు వచ్చిన నోటీసులపై స్మితా సబర్వాల్ స్పందించారు. పోలీసుల విచారణకు తాను పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేసిన ఆమె.. బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం స్టేట్మెంట్ ఇచ్చానంటూనే ఓ కీలక సందేహాన్ని లేవనెత్తారు. ఇది మరో వివాదానికి దారితీసేలా కనిపిస్తోంది. పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఓ విషయంపై క్లారిటీ అడిగారు. తాను షేర్ చేసిన పోస్టుకుగానూ నోటీసులు ఇచ్చారు ఓకే. అయితే తాను షేర్ చేసిన పోస్టును సోషల్ మీడియాలో 2 వేల మంది వరకు రీషేర్ చేశారు. వారందరిపై సైతం ఇదే విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందా స్మితా సబర్వాల్ సూటిగా అడిగారు.ఒకవేళ వారిపై అలాంటి చర్యలు లేవంటే.. తనను ఉద్దేశపూర్వకంగానే టార్గెట్ చేశారని తేలిపోతుంది. చట్టం ముందు అందరూ సమానులే, చట్టానికి ఎవరూ అతీతులు కాదనేది ఇక్కడ వర్తించడం లేదని స్పష్టమవుతోందని ఐఏఎస్ స్మితా సబర్వాల్ తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది.

## సోషల్ మీడియాపై నిఘా పెంచిన పోలీసులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో సామాజిక మాధ్యమాలపై సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల జరిగిన కొన్ని అంశాల ఆధారంగా సామాజిక మాధ్యమాలపై తీవ్ర స్థాయిలోనే పోలీసులు దృష్టి సారించినట్లు తెలిసింది. కొంత మంది నకిలీ ఖాతాలను క్రియేట్ చేసి లవ్ పేరుతో యువతి, యువకులను ట్రాప్ చేయడం, ఫోటోలు మార్ఫింగ్, అసభ్యకరమైన కంటెంట్, ఫేక్ వీడియోలు, బ్లాక్ మెయిల్ చేయడం వంటి ఘటనలు విపరీతంగా పెరిగాయి. నేటి యువత సైతం సోషల్ మీడియాను తప్పుదారిలో ఉపయోగిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు కేంద్ర రాష్ట్రాలకు వ్యతిరేకంగా కొంత మంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని తమకు తెలియకుండానే కొంత మంది యూజర్లు నిజమైన వీడియోలు, ఫోటోలు అని.. ఫేక్వి పోస్ట్ చేస్తున్నారు. ఇటీవల కంచె గచ్చిబౌలి భూముల అంశంపై సోషల్ మీడియాలో ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఏఐ పోస్టులతో తప్పుడు ఆరోపణలు చేయడం తెలంగాణ సైబర్ పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాపై తెలంగాణ పోలీసులు నజర్ పెంచారు. ఈ మేరకు ఎక్స్ అధికారిక ఖాతా ద్వారా తెలంగాణ పోలీసులు ఆసక్తికర ట్వీట్ చేశారు. 'సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్స్, రీ పోస్టింగ్స్ చేసేముందు జాగ్రత్త. వ్యక్తిత్వ హననం, ఇతరుల్ని కించపరిచేలా పోస్టులు చేస్తే చర్యలు తప్పవు. శ్రుతిమించిన చేష్టలపై నిఘా ఉంటుందని గ్రహించండి. సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేసేటప్పుడు పరిణామాలను ఆలోచించండి' అంటూ తెలంగాణ పోలీస్ పేర్కొంది. కాగా, హెచ్‌సీయూ వివాదంలో ఏఐ గిబ్లీ ఇమేజ్ ను రీ ట్వీట్ చేసిన నేపథ్యంలో సీనియర్ ఐఏఎస్, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్ కు గచ్చిబౌలి పోలీసులు గత నెలలో నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## రైతుల భూ సమస్యలు తీర్చేచట్టమే భూభారతి చట్టం

ప్రజల అభిప్రాయాల మేరకే రూపొందించిన చట్టం

రెవెన్యూ గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి హెలిక్యాప్టర్ ద్వారా చేరుకోగా హెలిప్యాడ్ దగ్గర ఎంపి మల్లురవి, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం నాగర్‌కర్నూల్ మండల పరిధిలో గల గగ్గలపల్లి గ్రామంలోని ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం 2025పై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఏదైనా చట్టంచేస్తే వందేళ్లకు సరిపడే విధంగా చట్టం చేయాలని సూచించారు. భూభారతిచట్టం వందేళ్లకు సరిపడా విధంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళా ఖాతంలో కలిపేస్తాం అన్నమాటను నిలబెట్టుకున్నామని, ధరణిపోర్టల్ ద్వారా ఎదుర్కొన్న భూ సమస్యలను భూభారతి చట్టం ద్వారా తీర్చనున్నట్లు తెలియజేశారు. నాలుగుగోడల మధ్య చుట్టాల కోసం రూపొందించిన ధరణి చట్టాన్ని రూపుమాపి రాష్ట్ర ప్రజలందరి భూ సమస్యలు తీర్చే భూభారతి చట్టంగా ప్రజలకొరకు తీసుకొచ్చామని వివరించారు. గతంలో ధరణివల్ల ఎంత ఇబ్బంది కలిగిందో రైతులకు తెలుసని దానిని దృష్టిలో ఉంచుకొని భూ భారతి కొత్తచట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. 2020 ధరణి చట్టంలో సాదాబైనామా అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. గతంలో రైతులు సాదాబైనామా కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతుల కన్నీటిని తీర్చేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలులేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజలను ఇబ్బందిపెట్టకుండా రైతులకు సేవలందిస్తామన్నారు. ధరణిలో ఏదైనా సమస్య పరిష్కారంకోసం దరఖాస్తుచేస్తే వెయ్యిరూపాయలు ఇవ్వాల్సి ఉండేదని, ఇప్పుడు ఒక్కరూపాయికూడా ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఒక్కరూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తహసీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. మే 1నుండి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతులనుండి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ఈ అవగాహన సదస్సుకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెంకరమణ, అదనపు కలెక్టర్ అమరేందర్, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రెవెన్యూసిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నా!



డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025 పోలీస్ ర్యాంకింగ్ ప్రకారం పౌరులకు సేవలు అందించడంలో దేశంలోనే ప్రథమ స్థానం పొందిన తెలంగాణ పోలీస్ శాఖలో పనిచేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుండి వచ్చిన స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో అదనపు డిజిపి మహేష్ భగవత్‌తో కలిసి జితేందర్ శనివారం తన కార్యాలయంలో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ... తాను సివిల్ సర్వీసెస్‌కు సెలెక్ట్ అయిన తర్వాత ఏ సర్వీస్ ఎంపిక చేసుకోవాలని పలువురితో చర్చించానని చాలామంది ఐపిఎస్ ఎంపిక పట్ల విముఖత కనబరిచారన్నారు. కానీ 33 సంవత్సరాలు పనిచేసిన తర్వాత దేశంలోనే ప్రథమ స్థానం పొందిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో పనిచేస్తున్నందుకు తాను గర్వపడుతున్నానని హర్షద్వానాల మధ్య సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ పనితీరు, విధానాలను పరిశీలించి మన పోలీస్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, తదితర 32 ప్రామాణికాలను బేరీజు వేయడం ద్వారా దేశంలోనే మొదటి స్థానాన్ని పొందామన్నారు. ఈ గౌరవాన్ని నిలుపుకునేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరింత సమర్థంగా, జాగ్రత్తగా పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర పోలీస్ శాఖకు దక్కిన ప్రధాన స్థానాన్ని నిలుపుకోవాలంటే స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరు మెరుగుపడాలనీ, బాధితులకు న్యాయం చేయాలనే ప్రధాన ఉద్దేశంతో ఎస్‌హెచ్‌ఓలు పనిచేయాలని, ఫిర్యాదులను స్వీకరించి దర్యాప్తు చేయడం ద్వారా వాస్తవాలను తెలుసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్ శాఖ ప్రజల రక్షణ కోసం ఉన్నదన్న విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాలని, బాధితులకు న్యాయం జరిగినప్పుడు పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తుందని డిజిపి అభిప్రాయపడ్డారు. ఎస్‌హెచ్‌ఓల పనితీరు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పద్ధతిని ప్రవేశపెట్టామని, దాని ద్వారా పనితీరును తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. సీసీటీఎన్ఎస్ పనితీరును క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. తమ పనితీరును కుటుంబ సభ్యులను, చుట్టూ ఉన్నవారి నుండి తెలుసుకోవచ్చని అన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయడం ద్వారా ఉత్తమ పోలీస్ అధికారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని డిజిపి డాక్టర్ జితేందర్ సూచించారు. శాంతిభద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఏం భగవత్ మాట్లాడుతూ కింది స్థాయిలో పోలీస్ సిబ్బంది తప్పులు చేస్తే ఉన్నతాధికారులు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలలో, పోలీస్ స్టేషన్ల సిబ్బందిలో మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కొన్ని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అధికంగా వేతనాలు తీసుకుంటున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ సిబ్బంది అవినీతికి పాల్పడవద్దని తద్వారా చెడ్డ పేరు తెచ్చుకోవద్దని స్పష్టం చేశారు.

## 22న ఇంటర్ పరీక్ష ఫలితాలు

ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఇంటర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు సిద్ధమయింది. ఈ నెల 22వ తేదీ ఉదయం ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంటర్ ఫలితాలను విడుదల చేస్తారని ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ఫలితాలు బోర్డు అధికారిక వెబ్ సైట్ tsbie.cgg.gov.in లేదా results.cgg.gov.inలో అందుబాటులో ఉంటాయని తెలియజేసింది. తెలంగాణలో ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు జరిగాయి. మొత్తం 9,96,971 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాలను విడుదల చేసిన తర్వాత నెల రోజుల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ అధికారుల సమాచారం.

## సోనియా, రాహుల్ గాంధీలను టచ్ చేస్తే బిజెపి ప్రభుత్వం కుప్ప కూలిపోతది : విహెచ్



ప్రజాపక్షం/హైదరాబాద్: సోనియా, రాహుల్‌గాంధీలను టచ్‌చేస్తే దేశంలో బిజెపి ప్రభుత్వం కుప్ప కూలిపోతుందని మాజీ ఎంపి హనుమంతరావు హెచ్చరించారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో బ్రిటీష్ పాలకు వ్యతిరేకంగా నేషనల్ హెరాల్ పత్రికను స్వాతంత్ర్య సమర యోధులు స్థాపించారన్నారు. నేషనల్ హెరాల్ పత్రికను ప్రజలంతా విశ్వసించారని, నేషనల్ హెరాల్‌లో మనీలాండరింగ్ చేశారని సోనియా రాహుల్ గాంధీపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసం? అని ఆయన ప్రశ్నించారు. గతంలో జనతా పార్టీ చేసిన తప్పు ఇప్పుడు బిజెపి ప్రభుత్వం చేస్తుందన్నారు. మోడీ అమిత్ షా, సోనియా గాంధీ రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతుందన్నారు. అదానీ విజయ మాల్యాపై కూడా మనీలాండరింగ్ కేసులు ఉన్నాయి వాటి పైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో బిసి కులగణ చేసి దేశంలో తెలంగాణ రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. బిసిలకు 42 శాతం విద్య ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. బిసి కులగణన చేపట్టిన సిఎం రేవంత్ రెడ్డికి కోసం నిర్వహించే కృతజ్ఞత సభకు బిసి కులసంఘాలు అంతా తరలిరావాలి అని పిలుపునిచ్చారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com